అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
ఆదివారం 29-10-2023
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 9 సంచిక : 298 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 8 పేజీలు + టాబ్లాయిడ్ 12 పేజీలు + (వెబ్‌లో సోపతి) వెల : 8.00

స్పందించిన మానవత్వం

గాజాకు అండగా ప్రపంచ దేశాలు

- తక్షణమే దాడులు ఆపేయాలి
- గాజాకు సాయం పెంచాలి : ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధుల సభ తీర్మానం
- అత్యధిక మెజారిటీతో తీర్మానం ఆమోదం
- ఓటింగ్‌కు భారత్ గైర్హాజరు



న్యూయార్క్ : ఇజ్రాయిల్, హమాస్ మధ్య తక్షణమే మానవతా సంధి కుదరాలని పిలుపిస్తూ ఐక్యరాజ్య సమితి సర్వప్రతినిధుల సభ అత్యధిక మెజారిటీతో తీర్మానాన్ని ఆమోదించింది. 22 అరబ్ దేశాల గ్రూపు ఈ తీర్మానాన్ని రూపొందించగా, 120-14ఓట్ల తేడాతో ఆమోదించారు. భారత్ సహా 45 దేశాలు గైర్హాజరయ్యాయి. అమెరికా, ఇజ్రాయిల్‌లు వ్యతిరేకించాయి. ఓటింగ్‌కు ముందు జోర్డాన్ విదేశాంగ మంత్రి ఐమన్ సఫాది మాట్లాడుతూ, తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేయడమంటే అర్థం లేని ఈ యుద్ధాన్ని, విచక్షణారహితమైన హత్యలను ఆమోదించడమేనని అన్నారు. కాగా ఇజ్రాయిల్ ఈ ఓటింగ్‌ను 'అపఖ్యాతి'గా వ్యాఖ్యానించింది. అయితే జనరల్ అసెంబ్లీ ఆమోదించిన ఈ తీర్మానానికి తప్పనిసరిగా కట్టుబడి వుండాల్సిన అవసరం లేదు కానీ ప్రపంచ దేశాల అభిప్రాయానికి ఇదొక ప్రామాణికంగా పనిచేస్తుంది. ఇప్పటికి ఇజ్రాయిల్ యుద్ధం మొదలై మూడు వారాలు గడుస్తున్నా తగిన చర్యలు తీసుకోవడంలో భద్రతా మండలి విఫలం కావడంతో జనరల్ అసెంబ్లీ ఓటింగ్ జరిగింది. ఇతరులు మద్దతిచ్చిన ప్రతిపాదనలను నిలువరించడానికి అమెరికా, రష్యాలు వీటో అధికారాలను ఉపయోగించాయి.

తక్షణమే, శాశ్వతమైన, సుస్థిరమైన మానవతా సంధి కుదుర్చుకుని ఘర్షణలు విరమించాలని తీర్మానం పిలుపిచ్చింది. పాలస్తీనియన్లను బలవంతంగా ఇతర ప్రాంతాలకు వెళ్ళగొట్టే ప్రయత్నాలను నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. ఈ ఘర్షణలు విస్తృతంగా పెచ్చరిల్లకుండా చూడాల్సిన అవసరం వుందని తీర్మానం నొక్కి చెప్పింది. గాజాకు మానవతా సాయాన్ని ...7లో



మారణహోమాన్ని తక్షణమే ఆపాలి

యూఎన్‌లో భారత్ ఓటింగ్‌కు దూరంగా ఉండటం సరికాదు

సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఏచూరి

- కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో నేడు ఢిల్లీలో ధర్నా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పాలస్తీనా ప్రజలకు సంఘీభావం తెలుపుతూ, గాజాలో ఇజ్రాయిల్ మారణహోమాన్ని తక్షణమే ఆపాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఆదివారం ఢిల్లీలో ధర్నా నిర్వహించనున్నట్టు సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఏకేజీ భవన్ (సీపీఎం ప్రధాన కార్యాలయం) ఎదుట ధర్నా చేపట్టాలని శనివారం హరికిషన్ సింగ్ సూర్జిత్ భవన్‌లో జరిగిన కేంద్ర కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా ...7లో

కేసీఆర్ ఫ్యామిలీ ఫామ్‌హౌస్‌కే..

తెలంగాణలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే

- ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తాం :కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్
- కేసీఆర్ పదివేల ఎకరాల కబ్జాకోర్
- కౌలు రైతులకు రైతుబీమా, రైతుబంధు ఏదీ? : రేవంత్ రెడ్డి
- తాండూర్, పరిగి, చేవెళ్లలో కాంగ్రెస్ విజయభేరి బస్సు యాత్ర

'రాబోయే తెలంగాణ ఎన్నికల్లో కేసీఆర్ కుటుంబాన్ని ఫామ్‌హౌస్‌కే పరిమితం చేయాలి. ప్రజల మీద ప్రేమతో సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రం ఇచ్చారు. కాంగ్రెస్‌ను ఈ ఎన్నికల్లో అధికారంలోకి తీసుకురావాలి. అధికారంలోకి రాగానే మొదట ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తాం..' అని కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు. శనివారం రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లోని చేవెళ్ల, పరిగి, తాండూర్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ విజయభేరి బస్సు యాత్ర నిర్వహించారు. మొదట తాండూర్‌లో ప్రారంభమైన యాత్ర పరిగి మీదుగా చేవెళ్లకు చేరింది. ఈ యాత్రలో కర్నాటక డిప్యూటీ సీఎం డీకే ప్రసంగించారు.

వివరాలు 7లో..



గాంధీభవన్ ప్రశాంతం

అసంతృప్తి చల్లార్చిన కాంగ్రెస్

చెదురుమదురు ఘటనలే తప్ప చెప్పుకోదగ్గ నిరసనలేం లేవు

వివరాలు 3లో..

భారత్ రైల్వేగా ఇండియన్ రైల్వే..!

పేరు మార్చటానికి రైల్వే మంత్రిత్వ శాఖ యత్నం

- కేంద్ర మంత్రివర్గానికి ప్రతిపాదనలు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రైల్వే మంత్రిత్వ శాఖ 'ఇండియా' పేరును తొలగించి 'భారత్' పేరుతో భర్తీ చేయాలని ప్రతిపాదించింది. పేరు మార్పునకు సంబంధించి కేంద్ర మంత్రి వర్గానికి తెలిపింది. భారత్ పేరు వినియోగానికి సంబంధించి ఇలాంటి ప్రతిపాదన కేంద్రమంత్రివర్గం ముందుకు రావడం ఇదే తొలిసారి. రానున్న రోజుల్లో మరిన్ని ప్రభుత్వ శాఖలు భారత్ అనే పేరును ఉపయోగించనున్నట్టు అధికారులు తెలిపారు. రాజ్యాంగంలో ఇండియా, భారత్ అనే పేర్లకు సమాన ప్రాధాన్యత ఉందని, అందువల్ల కేంద్రమంత్రివర్గం భారత్ అనే పేరును ఉపయోగించడంలో తప్పులేదని ప్రభుత్వం వాదిస్తోంది. జీ20 సదస్సులో భాగంగా ఏర్పాటు చేసిన విందుకు సిద్ధం చేసిన ఆహ్వానపత్రికలో ప్రెసిడెంట్ ఆఫ్ ...7లో

అ ఐదు రాష్ట్రాల్లో యాత్రలు వద్దు

కేంద్ర ప్రభుత్వానికి ఎన్నికల సంఘం హుకుం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

గత తొమ్మిదేండ్లలో కేంద్రం సాధించిన విజయాలను దేశవ్యాప్తగా ప్రచారం చేసేందుకు "వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర" ఎన్నికలు జరిగే ఐదు రాష్ట్రాల్లో నిర్వహించకూడదని కేంద్రఎన్నికల సంఘం స్పష్టం చేసింది. సంకల్ప్ యాత్ర నుంచి ఐదు రాష్ట్రాలను మినహాయించింది. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉన్నందున ఆయా రాష్ట్రాలకు వెళ్లవద్దని కేంద్ర క్యాబినెట్ కార్యదర్శికి కేంద్ర ఎన్నికల సంఘం లేఖ రాసింది. యాత్ర ప్రయాణానికి వినియోగించే వాహనాలను రథాలుగా పిలవడం కూడా నివారించామని కేంద్ర సమాచార మంత్రిత్వ శాఖ కార్యదర్శి అపూర్వ చంద్ర తెలిపారు. అధికారుల పేరును జిల్లా రథ్‌ప్రభారిమార్ నుంచి నోడల్ అధికారిగా మార్చారు. నవంబర్ 20 నుంచి జనవరి 25 వరకు జరిగే యాత్రలో కేంద్ర ఉద్యోగులను చేర్చుకోవాలనే ...7లో

నరేంద్రునితో సెల్ఫీ దిగండి

కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల వద్ద పాయింట్ల ఏర్పాటు

- సెల్ఫీ క్రేజ్‌ను రాజకీయాలకు ఉపయోగించుకునే ప్రయత్నం
- తప్పుపట్టిన మాజీ అధికారులు

యువతలో సెల్ఫీలకు ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. దీనిని ఉపయోగించుకొని రాజకీయ ప్రయోజనాలు పొందాలని బీజేపీ ప్రభుత్వం భావించింది. అనుకున్నదే తడవుగా కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల వద్ద సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేస్తోంది. అక్కడ నిలువెత్తు మోడీ చిత్రపటం మీకు కన్పిస్తుంది. దాని పక్కనే నిలబడి సెల్ఫీ దిగండి.. దేశ ప్రధానితో ఫొటో దిగిన అనుభూతి పొందండని ఊదరగొడుతోంది.



న్యూఢిల్లీ : ఐదు రాష్ట్రాల శాసనసభలకు, ఆ తర్వాత లోక్‌సభకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ ప్రభుత్వం సెల్ఫీ పాయింట్ల ఎత్తుగడకు శ్రీకారం చుట్టింది. ఈ సెల్ఫీ పాయింట్ల వద్ద మోడీ చిత్రపటంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చంద్రయాన్ వంటి దేశ విజయాలను కూడా ప్రదర్శిస్తారు. ఈ ప్రయోగం విజయవంతమైతే మోడీ ఎన్నికల ప్రచార వాహనంలో కూడా ఈ తరహా ప్రదర్శనలు ఉండే అవకాశం ఉంది.న్యూఢిల్లీలోని సైనిక ఆస్పత్రి వద్ద ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్‌ను మాజీ బ్రిగేడియర్ హర్దీప్ సింగ్ సోహీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. సాయుధ దళాలకు రాజ్యాంగమే సుప్రీం అని, రాజకీయ పార్టీలు తమ వైఖరులను మార్చుకోవచ్చు కానీ సాయుధ దళాలు రాజకీయాలకు దూరంగా ఉండాలని ఆయన వ్యాఖ్యానించారు. ప్రభుత్వ ప్రచారంలో సైనిక దళాలు ఎందుకు భాగస్వాములు కావాలని ఓ ...7లో

మార్గదర్శకాలు జారీ

సెల్ఫీ పాయింట్ల ఏర్పాటుకు సంబంధించి కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ కూడా ఇప్పటికే తన విభాగాలకు మార్గదర్శకాలు జారీ చేసింది. 800కి పైగా పాయింట్లలో మంత్రిత్వ శాఖ సాధించిన విజయాలను ప్రదర్శించడంతో పాటు మోడీ చిత్రాలను కూడా ఉంచుతారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో రక్షణ దళాలను రాజకీయ అవసరాల కోసం వినియోగించుకోవడాన్ని పలువురు మాజీ సైనికాధికారులు తీవ్రంగా ఖండించారు.

ఇదే మా వ్యూహం

మేం బలపడటం.. ప్రత్యర్థులను బలహీనపర్చటం...

కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు నక్కకూ నాగ లోకానికి ఉన్నంత తేడా

- 'కరెంటు'పై కర్నాటక వెళ్లి చూసొద్దామా..? :మీట్ ది ప్రెస్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'యుద్ధం రెండు రకాలుగా ఉంటుంది.. మేం బలపడటం.. ప్రత్యర్థులను బలహీనపర్చటం... ఇదే మా వ్యూహం...' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు. 'మీ ప్రభుత్వం, పార్టీ బలంగా ఉందంటున్నారు.. సంక్షేమ, అభివృద్ధి పథకాలు బాగా అమలవుతున్నాయని అంటున్నారు... అలాంటప్పుడు ప్రతిపక్షాల నుంచి నేతలను విపరీతంగా ఎందుకు చేర్చుకుంటున్నారు ? వలసలను ఎందుకు ప్రోత్సహిస్తున్నారు ?' అని అడిగిన ప్రశ్నకు ఆయన పై విధంగా సమాధానమిచ్చారు. ప్రభుత్వ పాలనలోనూ, సంక్షేమ, అభివృద్ధి పథకాల విషయంలోనూ కాంగ్రెస్‌కు, తమ పార్టీకి నక్కకూ నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని చెప్పారు. కర్నాటక రైతులు తమ కరెంటు కష్టాల గురించి ఇక్కడికొచ్చి చెప్పుకుంటున్న నేపథ్యంలో... వారికి బీఆర్ఎస్ డబ్బులిచ్చి తీసుకొస్తోందంటూ కాంగ్రెస్ నేతలు కొట్టిపడేయటాన్ని కేటీఆర్ తీవ్రంగా తప్పుబట్టారు. 'ఇద్దరం కలిసి ఒకే బస్సులో కర్నాటకకు పోదాం. అక్కడి ...7లో

మళ్లీ తగ్గిన విదేశీ నిల్వలు

వారం రోజుల్లో 2.36 బిలియన్ డాలర్ల క్షీణత



ముంబయి : భారత విదేశీ మారకం నిల్వల్లో మళ్లీ తగ్గుదల చోటు చేసుకుంది. ఈ నెల 20తో ముగిసిన వారంలో 2.36 బిలియన్ డాలర్లు క్షీణించాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) వెల్లడించింది. దీంతో అక్టోబర్ 20 నాటికి దేశంలోగల ఫారెక్స్ నిల్వలు 583.53 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. అంతకుముందు అక్టోబర్ 6 నుంచి 13 మధ్య 1.153 బిలియన్ డాలర్లు పెరిగాయి. వరుసగా నెల రోజులకుపైగా పడిపోయిన విదేశీ మారకపు నిల్వలు.. ఒక్క వారం పెరిగినట్టే పెరిగి తిరిగి పతనం కావడం గమనార్హం. దీంతో సెప్టెంబర్ 1 నుంచి ఈ నెల 20 వరకు 15 బిలియన్ డాలర్లకు పైగానే దేశీయ ఫారెక్స్ నిల్వలు పడిపోయినట్లయ్యింది. మనదేశ ఎగుమతులు పడిపోవడం, దిగుమతులు పెరగడంతో ఇటీవల కాలంలో ...7లో

కాళేశ్వరం ముంచనుందా..?

వేగుల నివేదికతో బీఆర్ఎస్ గాబరా

- ప్రభుత్వంపై ప్రభావం
- ఆ నలుగురిలో కలవరం



బి.బసవపున్నయ్య

కాళేశ్వరం ప్రాజెక్టులో చోటుచేసుకున్న నిర్మాణ పగుళ్ళ బీఆర్ఎస్ చాపకిందికి నీళ్ల తేనున్నాయని ఇంటెలిజెన్స్ నివేదిక చెబుతున్నట్టుగా ఆ పార్టీ శ్రేణుల్లో చర్చ జరుగుతున్నది. ఇప్పటికే దక్షిణ తెలంగాణలో గులాబీ సర్కారుపై వ్యతిరేకత పెరుగుతున్న తరుణంలో, లక్ష్మిబ్యారేజీలో ...2లో

సాధారణంగా అధికారంలో ఉన్న ఏపార్టీ అయినా ప్రభుత్వ పనితీరుపై ఎప్పటికప్పుడు తన నిఘావర్గాల(ఇంటెలిజెన్స్)తో సర్వేలు చేయించుకుంటుంది. వేగులకు తరచుగా పనిచెబుతుంటుంది. పనితీరు, పథకాల అమలు, మంత్రులు, ఎమ్మెల్యేలపై నియోజకవర్గాల్లో నెలకొన్న అభిప్రాయాలు, సచివాలయం, హెచ్‌వోడీల్లోని అధికారిక కార్యక్రమాలపై నిరంతరం పర్యవేక్షణ చేస్తుంది. కనీసం నెలలో రెండు, మూడుసార్లు అయినా ఇంటెలిజెన్స్‌వర్గాలకు ఆయా టాస్కులు ఇస్తుంది. ఎన్నికల సమయంలో మరింత అప్రమత్తంగా ఉంటుంది. ఆ నిఘా వర్గాల సమాచారాన్ని విశ్లేషించుకుంటుంది. ఇప్పుడు ఆ నిఘావర్గాల నివేదికే అధికార పార్టీని కలవరపరుస్తున్నట్టుగా తెలుస్తోంది.

కాళేశ్వరంపై కేంద్రం ఆరా

- చట్టం ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటాం : రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ లేఖ 2లో..

జక్కలొద్దిపై జులుం

గుడిసెవాసులకు బెదిరింపులు



- వారిపై బలవంతంగా గులాబీ కండువాలు
- పక్క నియోజకవర్గంలో 'నన్నపనేని' జోక్యంపై చర్చ
- తతంగం వెనుక భూదందా!
- 17 నెలలుగా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో భూపోరాటం
- ఇటీవల నేతలపై దాడి.. దుష్ప్రచారం

వివరాలు 7లో..

వరంగల్ తూర్పు సిట్టింగ్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి నన్నపనేని నరేందర్ జక్కలొద్ది గుడిసెవాసులపై జులుం ప్రదర్శిస్తున్నారు. పేదలపై ఆయన అరాచకీయాలు బీఆర్ఎస్ మెడకు చుట్టుకునే ప్రమాదం ఏర్పడింది. జక్కలొద్దిలో 17 నెలలుగా సీపీఐ (ఎం) ఆధ్వర్యంలో భూపోరాటం జరుగుతోంది. ప్రభుత్వ అణచివేతలకు సైతం బెదరక పేదలు సాగిస్తున్న పోరాటమది. అలాంటి పేదలపై, సీపీఐ(ఎం) నేతలపై ఎమ్మెల్యే 'నన్నపనేని' అనుచరులు దాడి చేసి గుడిసెవాసులను బెదిరించి గుడిసెలపై గులాబీ జెండాలు ఎగురవేయడం చర్చనీయాంశంగా మారింది. జక్కలొద్ది 'తూర్పు' నియోజకవర్గం పరిధిలోని ప్రాంతం కాకపోయినా 'నన్నపనేని' అనుచరులు, రియల్ ఎస్టేట్‌వ్యాపారులు జక్కలొద్దిలో రంగప్రవేశం చేయడం గమనార్హం.

పేదలపై దాడి అమానుషం

- నన్నపునేని నరేందర్ తీరు సిగ్గు చేటు : సీపీఐ(ఎం)రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, జి.నాగయ్య



వివరాలు 5లో..



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు

(10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	62,620	▲	660
22 క్యారెట్లు	57,400	▲	600
కిలో వెండి	77,500	---	---



చికెన్ ధరలు

హైదరాబాద్

బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 114
రిటైల్ (లైవ్)	రూ. 136
స్కిన్‌తో	రూ. 197
స్కిన్‌లెస్	రూ. 224

ఢీ అంటే ఢీ..!

కేసీఆర్ మాటలకు తుమ్మల, పొంగులేటి కౌంటర్

బీఆర్ఎస్ మాజీ నేతలపై పువ్వాడ ఆగ్రహం

- దీటుగా కౌంటర్ ఇచ్చిన 'హస్తం' నేతలు



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

బీఆర్ఎస్, కాంగ్రెస్ మాటలయుద్ధం రోజురోజుకూ తారాస్థాయికి చేరుతోంది. బీఆర్ఎస్ మాజీ నేతలు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై బీఆర్ఎస్ ఖమ్మం నియోజకవర్గ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ విమర్శలు గుప్పిస్తున్నారు. ఆయనకు కాంగ్రెస్ పాలేరు నియోజకవర్గ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు దీటుగా కౌంటర్లు ఇస్తున్నారు.

సీఎం వ్యాఖ్యలకు తుమ్మల కౌంటర్

పాలేరు నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభ కూసుమంచి మండలం జీళ్లచెరువులో శుక్రవారం నిర్వహించారు. ఇందులో బీఆర్ఎస్ అధినేత, సీఎం కల్వకుంట్ల చంద్రశేఖరరావు పొంగులేటి పేరు ప్రస్తావించకుండా డబ్బుల కట్టల అహంకారంతో మాట్లాడుతున్నారని వ్యాఖ్యలు చేశారు. తుమ్మల నాగేశ్వరరావు పేరు ప్రస్తావిస్తూ.. 2014 ఎన్నికల్లో ఓడిపోయి ఇంట్లో మూలకు కూర్చుంటే పాత మిత్రుడని చేరదీసి ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రి పదవి కట్టబెట్టానని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్‌కు తుమ్మల అన్యాయం చేశారా? తుమ్మలకు బీఆర్ఎస్ అన్యాయం చేసిందా? అన్న వ్యాఖ్యలపై వెంటనే ఖమ్మంలో ఆత్మీయ సమ్మేళనంలో తుమ్మల స్పందించారు. కేసీఆర్‌తోపాటు పువ్వాడ అజయ్‌కి కూడా కౌంటర్ ఇస్తూ మాట్లాడారు. పోటాపోటీగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు ఢీ అంటే ఢీ అనే రీతిలో పరస్పరం విమర్శలు చేసుకున్నారు.

కేసీఆర్‌కు తుమ్మల.. తుమ్మలకు అజయ్

పాలేరు ఆశీర్వాద సభలో తనపై కేసీఆర్ చేసిన ఆరోపణలకు తుమ్మల గట్టిగానే కౌంటర్ ఇచ్చారు. తనకు కేసీఆర్ పదవి ఇచ్చారు సరే.. ఎన్టీఆర్‌తో మాట్లాడి కేసీఆర్‌కు మంత్రి పదవి ఇప్పించినదాన్ని ఏమంటారు? అని ప్రశ్నించారు. దీనిపై బీఆర్ఎస్ నేతలు పువ్వాడతోపాటు ఎంపీలు నామ, వద్దిరాజు, పాలేరు, వైరా నియోజకవర్గ అభ్యర్థులు కందాల ఉపేందర్‌రెడ్డి, మదన్‌లాల్ కౌంటర్ ఇచ్చారు. 'ఎన్టీఆర్‌కు మీరు చెబితే కేసీఆర్‌కు మంత్రి పదవి ఇవ్వడానికి ఆనాడు మీరేమైనా మంత్రా? పార్టీ అధ్యక్షులా?' అని తుమ్మలను ప్రశ్నించారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మెన్ కొండబాల కోటేశ్వరరావు.. తుమ్మల గతాన్ని ఏకరువుపెట్టారు. పువ్వాడ.. '2018 ఎన్నికల్లో మీ ఇద్దరు చెప్పినట్టుగానే టిక్కెట్లు ఇస్తే ఆయన్ను ఈయన, ఈయన్ను ఆయన పొడుచుకు చంపుకుని ఓడించారని తుమ్మల, పొంగులేటిని ఉద్దేశించి కేసీఆర్ ఐదేండ్ల కిందటే అన్నారని..' చెప్పుకొచ్చారు. ఈ వ్యాఖ్యలపై వెంటనే కాంగ్రెస్ ఆఫీసులో మీడియా సమావేశం పెట్టి పొంగులేటి.. కేసీఆర్, పువ్వాడకు కౌంటర్ ఇచ్చారు.

కేసీఆర్ పార్టీలో ఒరిగిందేమీ లేదన్న పొంగులేటి

కేసీఆర్ పార్టీలో తనకు ఒరిగిందేమీ లేదని, వందలసార్లు అల్లుడు, కొడుకు తన చుట్టూ తిరిగితేనే ఆ పార్టీలో చేరానని కాంగ్రెస్ ప్రచార కమిటీ కో కన్వీనర్ పొంగులేటి అన్నారు. ఆ పార్టీలో తాను ఏ పదవులూ అనుభవించలేదన్నారు. నాకు ఇచ్చిన కాంట్రాక్టులు, వర్క్‌లు ఏంటో కేసీఆర్ తడిగుడ్డలతో ప్రమాణం చేసి చెబుతారా? అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా వ్యవహరించింది కేసీఆరే అన్నారు. దమ్ముంటే పాలేరులో తనపై పోటీ చేయాల్సిందిగా సవాల్ విసిరారు.

కాంగ్రెస్‌లో అసమ్మతి జ్వాల..!

- టికెట్ దక్కని ఆశావహుల్లో తీవ్ర నిరాశ
- ఆసిఫాబాద్‌లో ధర్నా.. బోథ్, భైంసాలో నిరసనలు



నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

కాంగ్రెస్‌లో టికెట్ల కేటాయింపు ప్రక్రియ తీవ్ర దుమారం రేపుతోంది. టికెట్లు రాని వారంతా శనివారం ఆసిఫాబాద్, బోథ్, భైంసాలో నిరసన కార్యక్రమాలు చేశారు. కాంగ్రెస్ పార్టీ రెండో జాబితాలో చెన్నూర్ మినహాయించి ఆరు నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఇందులో నాలుగు నియోజకవర్గాలకు తొలిసారి పోటీ చేస్తున్న వారు ఉండగా.. మరో ఇద్దరు మాత్రం గత ఎన్నికల్లో పోటీచేసిన వారు ఉన్నారు. బోథ్ నియోజకవర్గంలో అనేక మంది కీలక నాయకులు టికెట్లు ఆశించారు. కానీ అధిష్టానం మాత్రం డా.వన్నెల అశోక్‌కు టికెట్ కేటాయించింది. దీంతో ఇన్నాండ్లు వేర్వేరు గ్రూపులుగా ఉన్న ఆడె గజేందర్, డా.నరేష్‌జాదవ్, రాథోడ్ పార్వతీబాయి, కొమురం కోటేష్ తాజా పరిణామాలతో ఒక్కటయ్యారు. వీరందరూ శనివారం సమావేశం నిర్వహించి అభ్యర్థిని మార్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వీరిలో ఒకరు రెబెల్ అభ్యర్థిగా అసెంబ్లీ బరిలో ఉండాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఆదివారం కార్యకర్తలతో చర్చించి పోటీలో ఉండే అభ్యర్థిని నిర్ణయించాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది.

ఇక ఆసిఫాబాద్‌లో తొలి నుంచి పార్టీలో ఉన్న మర్సుకోల సరస్వతి, రాథోడ్ గణేష్‌ను కాదని ఇటీవల ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరిన ఆజ్మీరా శ్యాంనాయక్‌కు అధిష్టానం టికెట్ కేటాయించింది. ఇన్నాండ్లు వేర్వేరు గ్రూపులుగా ఉన్న సరస్వతి, రాథోడ్ గణేష్ ఒకే గొడుగు కిందకు వచ్చారు. ఆసిఫాబాద్ పట్టణంలోని కుమురంభీం చౌక్‌లో ధర్నా నిర్వహించారు. 2002 నుంచి పార్టీలో ఉన్న తనకు పార్టీ అధిష్టానం తీవ్ర అన్యాయం చేసిందని సరస్వతి ఆవేదన వ్యక్తం చేశారు. కచ్చితంగా పోటీలో ఉంటానని.. కాంగ్రెస్ అభ్యర్థి ఓటమే లక్ష్యంగా పనిచేస్తామని స్పష్టం చేయడం చర్చనీయాంశంగా మారింది. ముధోల్‌లో కొర్మెవార్ కిరణ్‌కుమార్‌కు కాకుండా ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్‌కు ఆ పార్టీ అధిష్టానం టికెట్ కేటాయించింది. దీంతో కిరణ్‌కుమార్ అనుచరులు శనివారం భైంసాలో నిరసన తెలిపారు. ఆదిలాబాద్‌లో ముందు నుంచి పార్టీలో ఉంటూ టికెట్ ఆశించిన నాయకులను కాదని.. కొత్తగా చేరిన ఎన్ఆర్ఐ కంది శ్రీనివాస్‌రెడ్డికి పార్టీ టికెట్ కేటాయించింది. దీంతో టికెట్‌పై ఆశలు పెట్టుకున్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, పార్టీ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ సంజీవరెడ్డి తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. వీరిలో ఒకరు రెబెల్ అభ్యర్థిగా పోటీ చేయాలని భావిస్తున్నట్టు ఆ పార్టీ వర్గాల ద్వారా తెలిసింది.

ఇద్దరు సిట్టింగ్‌లకు నో ఛాన్స్..!

బీఆర్ఎస్ నుంచి టికెట్ ఆశించి భంగపడిన సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఇద్దరికీ కాంగ్రెస్ పార్టీ సైతం టికెట్ నిరాకరించడం చర్చనీయాంశంగా మారింది. ఖానాపూర్ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న రేఖానాయక్‌కు బీఆర్ఎస్ టికెట్ దక్కకపోవడంతో ఇటీవల రాహుల్‌గాంధీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ టికెట్‌పై ఆశలు పెట్టుకున్నప్పటికీ.. ఆమె భర్త శ్యాంనాయక్‌కు కాంగ్రెస్ అధిష్టానం ఆసిఫాబాద్ నుంచి పోటీ చేసే అవకాశం కల్పించడంతో రేఖానాయక్‌కు టికెట్ దక్కలేదు.

దీంతో ఆమె కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ బొజ్జుతో కలిసి పనిచేసేందుకు నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇక బోథ్ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న రాథోడ్ బాపురావుకు సైతం ఈసారి బీఆర్ఎస్ టికెట్ దక్కలేదు. దీంతో ఆయన బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. కాంగ్రెస్ నుంచి టికెట్ తనకే వస్తుందని చివరి వరకు నమ్మకంతో ఉన్నారు. కానీ ఆ పార్టీ అధిష్టానం మాత్రం డా.వన్నెల అశోక్‌కు కేటాయించడంతో బాపురావుకు నిరాశ తప్పలేదు. ప్రస్తుతానికి ఆయన సైలెంట్‌గా ఉన్నారు.

వరిపై రుతుపవనాల ఎఫెక్ట్

- ఉత్పత్తి 3.7 శాతం తగ్గే అవకాశం
- 2023-24 ఏడాదికి ఉత్పత్తి అంచనా 1063.13 ఎల్ఎంటీ
- గతేడాది 1105.12 ఎల్ఎంటీ
- కేంద్రం గణాంకాలు

న్యూఢిల్లీ : భారత్‌లో రుతుపవనాల ప్రభావం వరి ఉత్పత్తిపై పడనున్నది. ఫలితంగా వరి దిగుబడి తగ్గే అవకాశం కనిపిస్తున్నది. వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ 2023-24 కు సంబంధించి విడుదల చేసిన ప్రధాన ఖరీఫ్ పంటల మొదటి ముందస్తు అంచనాలు ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాయి. దీని ప్రకారం భారత వరి ఉత్పత్తి 1,063.13 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్ఎంటీ) వద్ద ఉన్నది. గత సంవత్సరం ఇదే సీజన్‌లో 1,105.12 ఎల్ఎంటీలతో పోలిస్తే 3.7 శాతం తగ్గుదల కావటం గమనార్హం. 2023-24లో అంచనా వేయబడిన ఉత్పత్తి.. 2021-2022లో నమోదైన 1,110.01 ఎల్ఎంటీ కంటే తక్కువగా ఉండటం గమనార్హం. 2023-24 వరి ఉత్పత్తిలో అంచనా తగ్గుదల రుతుపవన వర్షాల అసమానత ప్రభావాన్ని చూపు తుందని వ్యవ సాయ, పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. దేశంలో వరి విస్తీర్ణం పెరిగినప్పటికీ దాని ఉత్పత్తి తగ్గుతుం డటం గమనార్హం. వ్యవసాయ మం త్రిత్వ శాఖ ప్రకారం.. 2023 ఖరీఫ్ సీజన్‌లో వరి ఉత్పత్తి విస్తీర్ణం 411 లక్షల హెక్టార్లు. ఇది 2022లో అదే సీజన్‌లో విస్తీర్ణం 404.27 లక్షల హెక్టార్ల కంటే ఎక్కువ కావటం గమనించాల్సిన విషయం. "పంటల ఉత్పత్తి అంచనా రాష్ట్రాలు అందించిన డేటాపై ఆధారపడి ఉంటుంది. తర్వాత వివిధ ప్రత్యామ్నాయ వనరుల నుంచి సమాచారాన్ని ఉపయోగించి ధృవీకరించ బడుతుంది. 2023-24 (ఖరీఫ్) కోసం ఈ మొదటి ఉత్పత్తి అంచనా ఎక్కువ గా గత 3 సంవత్సరాల సగటు దిగుబడిపై ఆధార పడి ఉంటుంది. వాస్తవ పంట కోత ఆధారంగా దిగుబడి అంచనాలను స్వీకరించిన తర్వాత అది మార్పుకు లోనవుతుందని గమనించడం ముఖ్యం" అని వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొన్నది. "ఖరీఫ్‌లో ప్రధా న పంట అయిన వరి సాగు విస్తీర్ణం గతేడాది చివరి అంచ నా కంటే సుమారు 2 లక్షల హెక్టార్లు, సగటు వరి విస్తీర్ణం కంటే 4.5 లక్షల హెక్టార్లు ఎక్కువగా ఉంటుందని అంచనా. సగటు ఖరీఫ్ బియ్యం ఉత్పత్తితో పోలిస్తే దీని ఉత్పత్తి దాదా పు లక్ష టన్నులు ఎక్కువగా ఉంటుందని అంచనా. "2023 -24కి ఖరీఫ్ ముతక తృణధాన్యాల ఉత్పత్తి 351.37 ఎల్ఎంటీగా అంచనా వేయబడింది, ఇది సగటు ముతక తణధాన్యాల ఉత్పత్తి 350.91 ఎల్ఎంటీ కంటే కొంచెం ఎక్కువ. పప్పు ఉత్పత్తి 34.21 ఎల్ఎంటీగా అంచనా వేయబడింది. ఇది గతేడాది ఉత్పత్తిని పోలి ఉంటుంది" అని కేంద్ర మంత్రిత్వ శాఖ ప్రకటన పేర్కొనటం గమనార్హం. సెంట్రల్ పూల్‌లో ఆహారధాన్యాల నిల్వలు క్షీణించడం, పెరిగిన తృణధాన్యాల ధరలు, ఖరీఫ్ సీజన్‌లో వరి పంటలకు కొనసాగుతున్న రుతు పవనాల అసమాన ముప్పు వంటి కారణాలతో ఈ ఏడాది జులైలో బాస్మతీయేతర తెల్ల బియ్యం ఎగు మతిని భారత్ నిషేధించింది. భారత్ ఇంతకు ముందు 2022 మే 13 నుంచి గోధుమల ఎగుమతిని నిషేధించింది. 2022 సెప్టెంబర్8న పారా బాయిల్డ్ రైస్ మినహా అన్ని బాస్మతీయేతర బియ్యం పై 20 శాతం ఎగుమతి సుంకం విధించబడింది. 2022, సెప్టెంబర్ 9న విరిగిన బియ్యం ఎగుమతిపై నిషేధం విధించబడిన విషయం విదితమే.

రూ.20 కోట్లు ఇవ్వకుంటే చంపేస్తాం

- ముకేశ్ అంబానీకి బెదిరింపు

ముంబై : రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మెన్ ముకేశ్ అంబానీని చంపేస్తా మని బెదిరింపులు వచ్చినట్టు పోలీ సులు తెలిపారు. ఈ-మెయిల్ ద్వారా ఓ వ్యక్తి బెదిరించాడని, తమకు రూ. 20 కోట్లు ఇవ్వకుంటే, చంపేస్తామని ఆ మెయిల్ లో హెచ్చరించారని, తమ వద్ద బెస్ట్ షూటర్స్ కూడా ఉన్నట్లు ఆ మెయిల్‌లో పేర్కొన్నారని పోలీసులు తెలిపారు. షాదాబాద్ ఖాన్ పేరుతో ఉన్న మెయిల్ నుంచి అక్టోబరు 27న బెదిరింపు వచ్చింది. ఆంటిలియాలోని అంబానీ నివాసానికి చెందిన సెక్యూ రీటీ అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీ సులు ఫిర్యాదు నమోదు చేశారు. ముంబైలోని గామ్‌దేవి పోలీసులు కేసు రిజిస్టర్ చేశారు. ఐపీసీ 387, 502(2) సెక్షన్ల కింద కేసును బుక్ చేశారు.

కాళేశ్వరం ముంచనుందా..?

(మొదటిపేజీ తరువాయి)

చోటుచేసుకున్న నిర్మాణ అవకతవకలు ఉత్తర తెలంగాణపై తీవ్ర ప్రభావమే చూపనున్నాయనే నిఘావర్గాల హెచ్చరికలు ప్రభుత్వాధినేతకు వెళ్లాయి. ఈనేపథ్యంలో బీఆర్ఎస్‌లో కీలకమైన ఆ నలుగురూ కలవరపడుతున్నట్టుగా సమాచారం. రిటైర్డ్ ఇంజినీర్లు సైతం కాళేశ్వరం నిర్మాణం విషయంలో ఇటు సాగునీటి శాఖను, అటు ప్రభుత్వాధినేతలను తప్పుబడుతున్నారు. బ్యారేజీ నిర్మాణం ప్రమాణాల ప్రకారం కాకుండా వ్యక్తుల ఇష్టాల ప్రకారం కొనసాగిందనీ, అక్కడ ఇంజినీర్లు నామమాత్రమే అయ్యారనే ప్రచారం జలసౌధలో జోరుగానే వినిపిస్తున్నది.. చేతులు కాలాక ఆకులుపట్టుకుంటే ఏం లాభం ? వినాల్సిన సమయంలో వినకుండా అంతా అయ్యాక ఇప్పుడు గగ్గోలు పెడితే ప్రయోజనం ఏంటనే ప్రశ్నలు విశ్లేషకుల నుంచి వస్తున్నాయి. కాళేశ్వరాన్ని కేవలం రెండేండ్లల్లో పూర్తిచేసి చరిత్ర సృష్టించామని జబ్బలు చరుచుకుంటున్న లార్సన్ అండ్ టూబ్రో(ఎల్అండ్‌టీ) కంపెనీ ఇప్పుడు నెత్తినోరూ కొట్టుకుంటున్నది. ప్రభుత్వం ఇచ్చిన డిజైన్ ప్రకారమే తాము నిర్మించామని పైకి చెబుతున్నా, అంతర్గతంగా సాగునీటి ఇంజినీర్లతో మరోరకమైన వాదనలకు దిగినట్టు సమాచారం. నష్టాన్ని తాము భరించి త్వరలో సంబంధిత పిల్లర్లను పున:నిర్మిస్తామని అంటున్నా ఇది ఇప్పట్లో సాధ్యమయ్యే పనికాదనే సమాచారం కూడా ఇంటెలిజెన్స్ నుంచి పెద్దాయనకు చేరింది. బ్యారేజీ నిర్మాణంలో చోటుచేసుకున్న సాంకేతిక, నిర్మాణ లోపాలు ఇప్పుడు ఎన్నికల ముందు సీఎం కేసీఆర్‌కు పరీక్ష పెడుతున్నాయి. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చైర్మెన్ అనిల్‌జైన్ జలసౌధలో తెలంగాణ ఇంజినీర్ ఇన్ చీఫ్ సి.మురళీధర్, కాళేశ్వరం ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు, క్వాలిటీ కంట్రోల్ అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించినట్టు తెలిసింది. ఆ సమావేశంలో వాతావరణాన్ని బట్టి లక్ష్మిబ్యారేజీకి స్వల్ప మరమ్మత్తులు కాకుండా భారీగానే చేయాల్సి ఉంటుందనీ, వందల కోట్ల వ్యయం కానుందనే గుసగుసలు జలసౌధలో చోటుచేసుకుంటున్నాయి. అలాగే రాష్ట్రంలో బీఆర్ఎస్ మ్యానిఫెస్టో ప్రభావం ప్రజలపై పెద్దగా పడలేదని ప్రభుత్వానికి వేగుల సమాచారం అందజేసినట్టు తెలిసింది. సీఎం కేసీఆర్ ఇటీవల ' నేను ఓడిపోతే రెస్ట్ తీసుకుంటా.." అని ప్రచారసభల్లో చెప్పడం కూడా తప్పుడు సంకేతాలు వెళ్లేలా చేశాయని వేగుల నుంచి వినికిడి. ఇకపోతే మంత్రి హరీశ్‌రావు కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఆంధ్రాలోని అమరావతి పరిస్థితే ఎదురవుతుందని చెప్పడం కూడా జీహెచ్ఎంసీ పరిధిలో భారీ చర్చకు దారితీసిందని తెలిసింది. సెంటిమెంట్‌ను క్యాష్‌చేసుకోవడంలో తొలినుంచే అందెవేసిన చేయి అయిన బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు కొన్ని విషయాల్లో తడబడటానికి ప్రజల్లో చోటుచేసుకుంటున్న విభిన్న పరిణామాలే కారణమని చెబుతున్నవారూ ఉన్నారు.

కాళేశ్వరంపై కేంద్రం ఆరా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్ట్ డేటా కేంద్రానికి ఇవ్వడం లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ లేఖ రాసింది. ఆదివారంలోపు ప్రాజెక్టుకు సంబంధించి సమాచారమివ్వాలని గడువు విధించింది. లేనిపక్షంలో రాష్ట్ర ప్రభుత్వం వద్ద సమాచారం లేదని భావిస్తామని లేఖలో పేర్కొంది. మేడిగడ్డ బ్యారేజ్ నిర్మాణానికి సంబం ధించి 20 రకాల సమాచా రాన్ని కేంద్ర డ్యామ్ సేఫ్టీ అథారిటీ అడిగింది.

కాగా, ఇప్పటివరకు మూడు అంశాలపై మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం సమాచారం ఇచ్చింది. ఒక దానికి పాక్షిక సమాధానమిచ్చింది.మిగతా 16 అంశాలపై తెలంగాణ ప్రభుత్వం సమాచారమే ఇవ్వలేదు. అలాగే ప్రాజెక్టు క్వాలిటీ, జియలాజికల్ స్టడీ, కాంట్రాక్టర్ లయబిలిటీ తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం సమాచారం ఇవ్వలేదు. దీంతో డ్యామ్ సేఫ్టీ అథా రిటీ ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించింది.

సమాచారంలో ఇచ్చిన అంశాలు

1.పునాది పొరలకు సంబంధించిన జియో లాజికల్, జియోటెక్నికల్ వివరాలు, బోర్‌హోల్ లాగ్ వివరాలు, ఎస్‌పిటి ఫలితాలు, ప్లేట్ లోడ్ పరీక్ష ఫలితాలు మొదలైనవి.
2. బ్యారేజీ రూపకల్పన లెక్కలు. హైడ్రాలిక్ (ఉపరితలం, ఉపరితల), స్థిరత్వం. సేఫ్ ఎగ్జిట్ గ్రేడియంట్ లెక్కింపు, వివిధ డిజైన్ పరిస్థితుల కోసం తెప్ప కింద ఒత్తిడి మొదలైనవి.
3. ఫిజికల్ మోడల్ స్టడీ రిపోర్ట్

పాక్షికంగా ఇచ్చిన సమాచారం

1. బ్యారేజ్ సంబంధిత డ్రాయింగ్‌లు

సమాచారం ఇవ్వని అంశాలు


1.బ్యారేజీకి సంబంధించిన ఇన్‌స్ట్రుమెంటే షన్ డేటా (పైజోమీటర్, స్ట్రెస్ సెల్స్ మొదలైనవి ఇప్పటి వరకు)
2. ఇప్పటి వరకు బ్యారేజీలో గమనించిన అన్ని కష్ట పరిస్థితుల వివరాలు.
3. సెటిల్‌మెంట్‌ను చూపే నిర్మాణ సంబంధిత సెక్షనల్ డ్రాయింగ్‌లు.
4. భౌగోళిక ప్రొఫైల్‌లను చూపే నిర్మాణ సంబంధిత సెక్షనల్ డ్రాయింగ్‌లు.
5. బ్యారేజీని నిర్దేశిత ఆనకట్టగా చేర్చినందున, రుతుపవనాల ముందు, తరువాత తనిఖీ నివేదికలు, ఈఎపి మొదలైన ఎన్‌డిఎస్ఎ సంబంధిత సమాచారం.
6.ఫౌండేషన్ మెరుగుదల పనులు, ఏదైనా ఉంటే.
7. నాణ్యత నియంత్రణ నివేదికలు.
8. థర్డ్ పార్టీ పర్యవేక్షణ నివేదికలు, ఏదైనా ఉంటే.
9.రుతుపవనాలకు ముందు, రుతుపవనాల అనంతర క్రాస్-సెక్షన్లు/బ్యారేజీని ప్రారంభించిన పుటి నుండి యు/ ఎస్, డి/ ఎస్‌లలో వాస్తవ తిరోగమనం.
10. లోపాల బాధ్యత కాలానికి సంబంధించి ఒప్పంద సంబంధిత నిబంధనలు.
11. అన్ని భాగాలను కలిగి ఉన్న ప్రతి బ్లాక్ పూర్తి నివేదికలు.
12. బేరింగ్‌ల ఫొటోగ్రాఫ్‌లు అప్ స్ట్రీమ్, డౌన్ స్ట్రీమ్ రెండింటిలోనూ ఉన్నాయి.
13. అన్ని పైర్‌లలోని పగుళ్ల మ్యాపింగ్.
14. డబుల్ పీర్ కింద అడ్డంగా ఉండే సెకాంట్ పైల్ కట్-ఆఫ్‌ను చూపుతున్న డ్రాయింగ్. పైర్‌తో పైల్‌ల పైభాగంలో చేరడం గురించి వివరించడం.
15. బ్లాక్ నంబర్ 7లోని అన్ని గేట్ల పరిస్థితి.
16.బ్లాక్ నంబర్ 7లో స్టాప్ లాగ్ గ్రూవ్‌ల పరిస్థితి.



బ్యారేజీల్లో సమస్యలు సహజమే..

మరోవైపు.. ఇసుకపై పునాదులు వేసి కట్టే బ్యారేజీల్లో సమస్యలు సహజమేనని, మేడిగడ్డ బ్యారేజీ డిజైన్, నిర్మాణంలో సమస్యల్లేవని నీటి పారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ రజిత్ కుమార్ స్పష్టం చేశారు. బ్యారేజీ డిజైన్‌లో లోపాలుంటే ఎప్పుడో కొట్టుకుపోయేదన్నారు. గతంలో ఫరక్కా, ధవళేశ్వరం బ్యారేజీల్లోనూ, సమస్యలు వచ్చాయని గుర్తుచేశారు. మోనోలిథిక్ డిజైన్‌తో బ్యారేజీ నిర్మించారని, గతేడాది భారీ వరదలను కూడా బ్యారేజీ తట్టుకుందన్నారు. బ్యారేజీ మొత్తం ఎనిమిది బ్లాకులతో నిర్మిస్తే అందులో 7వ బ్లాకులోని పియర్ నంబర్ 16, 17, 18, 19, 20, 21లలో సమస్యలు ఉత్పన్నం అయ్యాయన్నారు.

తొలుత కాఫర్ డ్యామ్ నిర్మించి ఎగువ ప్రాంతాల నుంచి వరదను మళ్లిస్తామని, ఆ తరువాత చుట్టూ రింగ్ మెయిన్ నిర్మించి పియర్ల కుంగుబాటుకు గల కారణాలను గుర్తిం చాకే మరమ్మతులు ప్రారంభి స్తామని ఆయన వివరించారు. బ్యారేజీ నిర్మాణం రివర్ బెడ్‌పై జరగడం, ఇసుకపైనే పునాదులు ఉండటం వల్ల సమస్యలు వస్తాయన్నారు. పిలర్ల కింద ఇసుక కదలడం వల్లే కుంగినట్లు చెప్పారు. మరమ్మ తులకు సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ అనుమతిం చాలని తెలిపారు. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ కోరిన వివరాలను సమర్పించినట్లు చెప్పారు.



మధ్యప్రదేశ్‌లో ద్విముఖ పోరు

మధ్యప్రదేశ్‌లో అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ మధ్య పోటీ నెలకొంది. ఈసారి కాంగ్రెస్ గెలుపు ఖాయమని అనేక సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. బీజేపీ ఎదుర్కొంటున్న ప్రజా వ్యతిరేకతలో మోడీ, షా ద్వయం తర్జనభర్జన పడుతోంది. ఎలా గట్టెక్కాలో తెలియక, తలలు పట్టుకుంటుంది. అందుకే విద్వేషాలను రెచ్చగొట్టేందుకు, విషం చిమ్మేందుకు ప్రయత్నిస్తుంది.



ప్రజా వ్యతిరేకతలో బీజేపీ

- కుల గణన ఎజెండాతో కాంగ్రెస్
- బీజేపీని వెంటాడుతున్న 50 శాతం కమీషన్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

2018 మధ్యప్రదేశ్ ఎన్నికల్లో బీజేపీ 41.02 శాతం సాధించి 109 అసెంబ్లీ సీట్లు దక్కించుకుంది. కాంగ్రెస్ 40.89 శాతం ఓట్లు సాధించింది. బీజేపీ కన్నా కాంగ్రెస్ కాస్త తక్కువ ఓటు శాతం సాధించినా.. 114 నియోజకవర్గాల్లో గెలుపొందింది. అయితే ఎప్పటి నుంచో మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్, బీజేపీ మధ్య ద్విముఖ పోరు జరుగుతోంది. మధ్యప్రదేశ్ ఓటర్లు బీజేపీపై కోపం వచ్చినప్పుడు కాంగ్రెస్‌కు, కాంగ్రెస్‌పై కోపంగా ఉన్నప్పుడు బీజేపీకి పట్టం కడుతున్నారు. అయితే గత ఐదేండ్లలో కాంగ్రెస్ (15 నెలలు), బీజేపీ (మిగతా కాలం) అధికారం పంచుకున్నాయి. దీంతో ఇప్పుడు మధ్యప్రదేశ్ ప్రజలు ఎవరికి అధికారం కట్టబెడుతారన్నది ఆసక్తికరంగా మారింది. ఈ క్రమంలో ముస్లిం ఓటు బ్యాంకు కాంగ్రెస్‌కు ఆశలు రేపుతోంది.

వర్గపోరు లేకపోవడమే కాంగ్రెస్‌కు కలిసొచ్చే విషయం

గత ఎన్నికల్లో 114 సీట్లు గెలిచి మ్యాజిక్ ఫిగర్‌కు అతి చేరువగా వచ్చిన కాంగ్రెస్.. సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కానీ బీజేపీ డైరెక్షన్‌లో కాంగ్రెస్ సీనియర్ నేత జ్యోతిరాదిత్య సింధియా 22 మంది ఎమ్మెల్యేలతో కలిసి తిరుగుబాటు చేయడంతో 15 నెలల్లోనే ఆ ప్రభుత్వం కుప్పకూలింది. ఆ తర్వాత శివరాజ్ సింగ్ చౌహాన్ ముఖ్యమంత్రిగా బీజేపీ ప్రభుత్వం కొలువుదీరింది.

కీలకమైన అంశాలు

నిరుద్యోగం, రైతు సమస్యలు, అవినీతి, 50 శాతం కమీషన్, కరువు, బుందేల్ ఖండ్ అభివృద్ధి, మహిళలు, దళితులపై పెరుగుతున్న నేరాలు వంటి అంశాలు ఎన్నికల్లో కీలకం కానున్నాయి. తీవ్ర ప్రజా వ్యతిరేకతను ఎదుర్కోవడం బీజేపీకి ప్రతికూలం కాగా, వర్గపోరు లేకపోవడం, కుల గణన డిమాండ్ కాంగ్రెస్‌కు సానుకూలం కానుంది.

జ్యోతిరాదిత్య సింధియా సహాయానికి ప్రతిఫలంగా బీజేపీ ఆయనను కేంద్ర మంత్రిని చేసింది. కానీ ఆయన వర్గీయులు బీజేపీలో ఉండలేక పోతున్నారు. ఇటీవల ఒక్కొక్కరుగా బీజేపీని వీడుతున్నారు.

ఇది జ్యోతిరాదిత్య సింధియాకు సవాలుగా మారింది. మధ్యప్రదేశ్‌లో మాజీ ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు కమల్ నాథ్.. కమలం పార్టీకి గట్టి పోటీ ఇస్తున్నారు. బీజేపీ ప్రభుత్వం 50 శాతం కమీషన్ సర్కారంటూ కాంగ్రెస్ ఆరోపణలు గుప్పిస్తోంది. కుల గణనను ప్రధాన ఎజెండాగా కాంగ్రెస్ ప్రచారం చేస్తుంది. కాంగ్రెస్‌లో వర్గపోరు లేకపోవడం, మాజీ ముఖ్యమంత్రి దిగ్విజయ్ సింగ్ పూర్తిగా కమల్ నాథ్ వెనుక నిలవడం, రాష్ట్రంలో కొద్దికాలానికే అధికారాన్ని కోల్పోవడంపై ప్రజల్లో సానుభూతి నెలకొనడం తమకు కలిసి వస్తాయని కాంగ్రెస్ ఆశలు పెట్టుకుంది.

ముఖ్యమంత్రి అభ్యర్థి లేని బీజేపీ

15 నెలలు మినహా 2005 నుంచి నేటి వరకు శివరాజ్ సింగ్ చౌహాన్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. వివిధ వర్గాలను ఆకట్టుకునే పథకాల ద్వారా 'మామ'గా ఆయన ప్రసిద్ధులు. అయితే తీవ్ర ప్రజా వ్యతిరేకతను చౌహాన్ ఎదుర్కొంటున్నారు. ఆర్ఎస్ఎస్ ప్రయోగశాలగా చెప్పుకొనే మధ్యప్రదేశ్‌లో హిందూత్వపై, ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రచారంపై బీజేపీ నమ్మకం పెట్టుకుంది. కొందరు కేంద్ర మంత్రులను బరిలో దింపింది. ఈసారి ఆమాద్మీ కూడా ఇక్కడ బరిలో దిగుతోంది. ఇండియా కూటమిగా కలిసి పోటీ చేసేందుకు కాంగ్రెస్, ఎస్పీ ప్రయత్నించిన ప్పటికీ, అది బెడిసికొట్టింది. ఎస్పీతో సీట్ల సర్దుబాట్లపై చర్చ జరుగుతున్నప్పటికీ, కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించింది. దీనిపై ఎస్పీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎస్పీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ కాంగ్రెస్‌పై మండిపడ్డారు. తాము పోటీకి వెనక్కి తగ్గేదేలేదని స్పష్టం చేశారు. మరోవైపు బీఎస్పీ కూడా బరిలోకి దిగింది.

సామాజిక సమీకరణలు

అంచనాల ప్రకారం ఆరు కోట్ల కంటే ఎక్కువ జనాభా ఉన్న మధ్యప్రదేశ్‌లో దాదాపు 50శాతం పైబడి ఓబీసీలు ఉన్నారు. 22 శాతం షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీ), 14 శాతం షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) జనాభా ఉంది. మొత్తం జనాభాలో ముస్లింలు 5 శాతం ఉండగా, బ్రాహ్మణులు 5 శాతం ఉన్నారు. అంతేకాక మొత్తం జనాభాలో ఐదు శాతం చొప్పున గణనీయమైన జనాభా కలిగిన అహిర్లు, రాజ్‌పుత్‌లు ఉన్నారు. మధ్యప్రదేశ్ జనాభాలో తెలిస్, కుర్మీలు, లోధ్‌లు కూడా మూడు శాతం మంది ఉన్నారు.

47 అసెంబ్లీ స్థానాల్లో ముస్లింల ప్రభావం



మధ్యప్రదేశ్‌లో ముస్లింల జనాభా ఐదు శాతం ఉంది. 47 అసెంబ్లీ స్థానాల్లో ఈ ముస్లిం ఓటర్లు ప్రభావం చూపించే అవకాశం ఉంది. అందులో హెూరాహెూరీ పోరు నెలకొనే 22 నియోజకవర్గాల్లో ముస్లిం ఓటింగ్ డిసైడింగ్ ఫ్యాక్టర్ కానుంది.

బుందేల్ ఖండే విజయానికి సోపానం



పేదరికం, కరవుకు పుట్టినిల్లుగా గుర్తింపు ఉన్న బుందేల్ ఖండ్‌లో ఆధిక్యం సాధించిన పార్టీకే మధ్య ప్రదేశ్‌లో అధికారం దక్కుతుందని 20 ఏండ్ల ఎన్నికల ఫలితాలు చాటుతున్నాయి. మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ సరిహద్దులో మొత్తం ఆరు జిల్లాల్లో విస్తరించిన బుందేల్ ఖండ్‌కు 26 శాసనసభ స్థానాలు ఉన్నాయి. అందులో ఆరు ఎస్సీ రిజర్వ్డ్ స్థానాలు ఉన్నాయి. ఈ నియోజకవర్గాల్లోనే ఎస్పీ, బీఎస్పీ పార్టీల బలం గణనీయంగా ఉంది.

ఇండియా కూటమి బలోపేతం

దేశానికి అవసరం

అందుకు కోసం ప్రయత్నాలు : సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి



నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో

ప్రతిపక్షాల కూటమి 'ఇండియా'ను బలోపేతం చేయడం దేశానికి అవసరమని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. దేశ లౌకిక, ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు 'ఇండియా' మరింత బలోపేతం కావాలని, ఇందుకోసం సీపీఐ(ఎం) ప్రయత్నాలు చేస్తోందని ఆయన అన్నారు. శనివారం నాడిక్కడ ఏచూరి మీడియాతో మాట్లాడుతూ 'ఇండియా' కూటమిలోని అన్ని పార్టీల సీనియర్ నేతలతో సంప్రదించి నిర్ణయాలు తీసుకుంటారని, దీనికి సమన్వయ కమిటీలో సభ్యులుగా లేకపోవడం అడ్డంకి కాదని పేర్కొన్నారు. జేడీఎస్ కేరళ యూనిట్ జాతీయ నాయకత్వానికి పూర్తిగా దూరమైందని, సాంకేతికంగా మాత్రమే ప్రస్తుతానికి కేరళలో జేడీఎస్‌గా కొనసాగుతున్నారని తెలిపారు. త్రిపుర మాజీ ముఖ్యమంత్రి, సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు మాణిక్ సర్కార్ అధ్యక్షత హరికిషన్ సింగ్ సుర్జీత్ భవన్‌లో ప్రారంభమైన సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సమావేశంలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి రిపోర్టును వివరించారు. ఈ సమావేశంలో జాతీయ రాజకీయ పరిస్థితులతో పాటు ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, సంస్థాగత అంశాలపై చర్చ జరుగుతోంది.



టిప్పు సుల్తాన్ కత్తికి వేలంలో భారీ ధర

- రూ.1.01 కోట్లు వెచ్చించి దక్కించుకున్న వ్యక్తి

న్యూఢిల్లీ : 18వ శతాబ్దపు మైసూరు రాజు టిప్పు సుల్తాన్‌కు చెందిన కత్తి, జెమ్ సెట్ లండన్‌లోని క్రిస్టీస్ వేలంలో భారీ ధర పలికాయి. వీటిని రూ.1.01 కోట్లు ఇచ్చి ఓ వ్యక్తి కొనుగోలు చేశారు. ది ఆర్ట్ ది ఇస్లామిక్ అండ్ ఇండియన్ వరల్డ్ సేల్‌లో ఆయనకు చెందిన మరో కత్తికి ముందుగా ఆశించిన ధర రాలేదు. టిప్పు మరణానంతరం భారత్‌లో బ్రిటిష్ అధికారాన్ని బలోపేతం చేసిన చార్లెస్ వద్ద ఈ కత్తులు ఉన్నాయి. వీటిని అమ్మడం ద్వారా వచ్చే సొమ్మును ఈ కుటుంబానికి చెందిన పోర్ట్ ఎలియట్ ఎస్టేట్‌కు మరమ్మతులు చేయించడానికి ఉపయోగిస్తామని ఈ ఎస్టేట్ అధికార ప్రతినిధి తెలిపారు.



గాంధీభవన్ ప్రశాంతం

అసంతృప్తి చల్లార్చిన కాంగ్రెస్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ అభ్యర్థుల ప్రకటన తర్వాత గాంధీభవన్ గప్‌చుప్‌గా ఉన్నది. చెదురుమదురు ఘటనలు మినహా గాంధీభవన్ శనివారం ప్రశాంతంగా ఉన్నది. అభ్యర్థుల ప్రకటన తర్వాత జరగనున్న పరిణామాలను పార్టీ ముందుగానే గ్రహించి అసంతృప్తిని చల్లార్చిందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. తొలి జాబితా కంటే రెండో జాబితా తర్వాత నిరసనలతో గాంధీభవన్ దద్దరిల్లుతుందని అందరూ భావించారు. కూకట్‌పల్లి, జూబ్లీహిల్స్ నియోజకవర్గాలను ఆశించి భంగపడిన గొట్టిముక్కుల వెంగళ్‌రావు, పి విష్ణువర్ధన్‌రెడ్డి అనుచరులు మాత్రం గాంధీభవన్ వద్ద నిరసన తెలిపారు. రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఫ్లెక్సీలు చించేయడం, ఇటుకలతో దాడి చేసేందుకు ప్రయత్నించారు. వారితో పార్టీ నేతలు మాట్లాడిన తర్వాత శాంతించారు. గతం కంటే ఈసారి అసంతృప్తుల విషయంలో పార్టీ వ్యూహాత్మకంగా వ్యవహరించిందని పార్టీ నేతలు చెబుతున్నారు. అందుకే గాంధీభవన్ వైపు వచ్చేందుకు సాహసించలేదని తెలుస్తోంది. గతంలో టికెట్లు దక్కని నేతలు దశలవారీగా వచ్చి రకరకాల పద్ధతుల్లో నిరసనలు తెలిపిన సందర్భాలున్నాయి.

కొంత మంది పెట్రోలు పోసుకుని నిప్పంటించుకున్న ఘటనలూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో పార్టీ పక్కా వ్యూహాన్ని అనుసరించడంతో పాత సంప్రదాయాలకు తెరపడిందని పార్టీ నేతలు చెబుతున్నారు. కారు ఢీ కొనే క్రమంలో గెలుపుగుర్రాలకు టికెట్లు కేటాయించిందనే వాదన వినిపిస్తున్నది. ఈ నేపథ్యంలో టికెట్లు దక్కని నేతలు సహజంగానే కొంత అసంతృప్తికి గురి అవుతారనేది తెలిసిందే. ఇప్పటికే ఆయా నియోజకవర్గాల్లో చాలా కాలంగా కార్యక్రమాలు నిర్వహిస్తూ...సొంత డబ్బు ఖర్చు చేసుకుని ఉంటారు. కొంత మందికి ప్రజల్లో పలుకుబడి కూడా ఉండవచ్చు. అటువంటి కీలక నేతలను టికెట్ దక్కించుకున్న అభ్యర్థి.. నేరుగా వారితో మాట్లాడుకోవాలని పార్టీ సూచించినట్టు తెలిసింది. అరమరికలు లేకుండా అన్ని విషయాలు వారితో చర్చించి, వ్యతిరేకత రాకుండా అభ్యర్థులే చూసుకోవాలని రేవంత్‌రెడ్డి ఓ మెలిక పెట్టినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. టికెట్ రాలేదంటూ గాంధీభవన్‌కు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించినట్టు సమాచారం. అభ్యర్థులకు సహకరించేలా మీరే చొరవ తీసుకుంటే, కొంతమేరకు ఉపశమనం కలుగుతుందని పార్టీ అంచనా వేసింది. దీని ప్రకారం టికెట్ దక్కని చాలా మంది నేతలు ఆయా జిల్లాల్లో అసంతృప్తి వ్యక్తం చేశారు. వరంగల్ పడమర టికెట్ ఆశించిన జంగా రాఘవరెడ్డి టికెట్ దక్కకపోవడంతో రగిలిపోయారు. అక్కడ కొంత హల్‌చల్ చేశారు. ఆదిలాబాద్ జిల్లాల్లో ఒకరిద్దరూ అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం చైర్మెన్ సోహెల్ పార్టీకి రాజీనామా చేశారు. 40 ఏండ్లుగా పార్టీ కోసం పని చేసినా తనకు టికెట్ దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. టికెట్ ఆశించి భంగపడిన నేతల్లో మచ్చుకు ఎర్రశేఖర్, సుభాష్‌రెడ్డి, గాలి అనిల్‌కుమార్, వెంకట్, ప్రవీణ్‌రెడ్డి, బలరాంనాయక్, బెల్లయ్యనాయక్, తిరుపతిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీరంగం సత్యం, శ్రీకాంత్, రోహిత్, పారిజాత నర్సింహారెడ్డి, రమేష్‌నాయక్, ఈ వెంకట్రామ్‌రెడ్డి, రఘునాథ్‌యాదవ్, దండెం రామిరెడ్డి, చలమల కృష్ణారెడ్డి, సర్వే సత్యనారాయణ, పిడమర్తి రవి తదితరులు కొంత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అందులో కొంత మంది నేతలతో రేవంత్‌రెడ్డి సంప్రదింపులు జరుపుతున్నారు. పార్టీ సీనియర్ నేత కె జానారెడ్డి కూడా రంగంలోకి దిగినట్టు తెలిసింది. మొత్తంగా మూడో జాబితా వచ్చేవరకు అసంతృప్తులను బుజ్జగించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే 100 సీట్లు ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ...19 స్థానాలు ప్రకటించాల్సి వస్తుంది. అందులో సీపీఐ, సీపీఐ(ఎం), టీజేఎస్ పార్టీలకు సీట్ల కేటాయింపులుంటాయి. మిగిలిన స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ నేతల మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది. ఆయా స్థానాలను ఆశిస్తున్న నేతలను పార్టీ దారికి తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నది.

మహిళా కాంగ్రెస్ మినహా ఏ విభాగానికి టికెట్ దక్కలే...

పార్టీ అనుబంధ విభాగాలకు టికెట్ల కేటాయింపుల్లో అన్యాయం జరిగిందనే చర్చ మొదలైంది. మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు సునీతారావుకు మాత్రమే గోషామహల్ టికెట్ దక్కింది. ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్, కిసాన్ కాంగ్రెస్, ఐఎన్‌టీయూసీ, మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, గౌడ్, వికలాంగులు, ఎన్ఆర్ఐ, సేవాదళ్ విభాగాల చైర్మెన్లకు టికెట్ దక్కలేదు. ఆయా విభాగాలకు చెందిన చైర్మెన్లు అభ్యర్థిత్వం కోసం దరఖాస్తులు చేసుకున్నారు.

ఉచిత ల్యాప్‌టాప్‌లు..టాబ్లెట్‌లు

పాత పెన్షన్ పథకానికి మద్దతు

- పశువుల పేడ కొనుగోలు : రాజస్థాన్‌లో కాంగ్రెస్ ఎన్నికల వాగ్దానాలు
- విద్యార్థులు, రైతులు, ప్రభుత్వ ఉద్యోగులే లక్ష్యంగా హామీలు



జైపూర్ : రాజస్థాన్‌లో అధికార కాంగ్రెస్ ఎన్నికల హామీల జాబితాను విడుదల చేసింది. ఓటర్లలో అధిక సంఖ్యలో ఉన్న, కీలకమైన విద్యార్థులు, రైతులు, ప్రభుత్వ ఉద్యోగులే లక్ష్యంగా తన వాగ్దానాలను ప్రకటించింది. కాలేజీ విద్యార్థులకు ఉచిత ల్యాప్‌టాప్‌లు, టాబ్లెట్‌లు, ప్రభుత్వ ఉద్యోగుల కోసం చట్టం ద్వారా పాత పెన్షన్ పథకం (ఓపీఎస్)కు మద్దతుగా నిలవటం, పశువుల పేడను కొనటం వంటివి ఇందులో ఉన్నాయి. ఆయన ఇలా ఐదు కొత్త ఎన్నికల హామీలను అశోక్ గెహ్లాట్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రకటించింది.

ఆ రాష్ట్ర రాజధాని జైపూర్‌లోని కాంగ్రెస్ వార్ రూమ్‌లో విలేకరుల సమావేశంలో గెహ్లాట్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పశువుల పేడను కిలో రూ.2 చొప్పున కొనుగోలు చేస్తుందన్నారు. "ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్‌లోని భూపేష్ బఘెల్ ప్రభుత్వం మాత్రమే అటువంటి పథకాన్ని అమలు చేస్తోంది. దీనిని గోధన్ న్యాయ్ యోజనతో అమలు చేస్తున్నది. ఇది బయోగ్యాస్, సహజ ఎరువులు మొదలైనవాటిగా ఉపయోగించబడుతున్నది. ఇది రైతుల ఆదాయాన్ని పెంచుతుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మెరుగుపరుస్తుంది" అని గెహ్లాట్ చెప్పారు. ప్రతి విద్యార్థికీ ఇంగ్లీషు మీడియం విద్యనందిస్తామన్న హామీని ప్రకటించారు. ఇప్పటి వరకు 3 వేల ఆంగ్ల మాధ్యమ పాఠశాలలు ప్రారంభించామనీ, అందులో 6 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. ప్రస్తుతం లాటరీ విధానంలో విద్యార్థులను కేటాయించాల్సి ఉండగా, డిమాండ్ ఉన్న చోట ఇంగ్లీషు మీడియం పాఠశాలను తెరుస్తామని పార్టీ హామీ ఇస్తున్నదని తెలిపారు. దీనితో రాష్ట్రంలోని మానవ వనరుల నాణ్యత మెరుగుపడుతుందని చెప్పారు.

ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు ల్యాప్‌టాప్ లేదా ట్యాబ్లెట్ ఇస్తామని చెప్పారు. రాష్ట్రంలో ఏటా 7-8 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు పొందుతున్నారని తెలిపారు.

పాత పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్) చట్టానికి మద్దతుగా కాంగ్రెస్ ఉంటుందని ఆయన చెప్పారు. ఓపీఎస్‌ను బీజేపీ వ్యతిరేకిస్తున్నందున, రాజస్థాన్‌లో బీజేపీ అధికారంలోకి వస్తే ఓపీఎస్‌ను ఉపసంహరించుకుంటామని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు భయపడుతున్నారని ఆయన అన్నారు. అందుకే, భవిష్యత్తులో కూడా ఏ ప్రభుత్వమూ దానిని ఉపసంహరించుకోలేని విధంగా చట్టంతో మద్దతు ఇవ్వాలని మేము నిర్ణయించుకున్నామని అశోక్ గెహ్లాట్ వివరించారు.

పెరుగుతున్న వాతావరణ మార్పుల ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వం చిరంజీవి ఆపద బీమా హామీని తీసుకువస్తుందనీ, ఇందులో ప్రతి బాధిత కుటుంబానికీ రూ. 15 లక్షల వరకు బీమా కల్పిస్తామని ఆయన చెప్పారు.

మొత్తం 200 అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ ఐదు శిబిరాలను ఏర్పాటు చేస్తున్నదని తెలిపారు. జుంజునులో జరిగిన ర్యాలీలో పార్టీ నాయకురాలు ప్రియాంక గాంధీ సమక్షంలో గెహ్లాట్ గృహ లక్ష్మి యోజన కింద కుటుంబ పెద్దలకు ఏటా రూ. 10,000 ప్రకటించారు. అలాగే, రాష్ట్రంలో సబ్సిడీ సిలిండర్ పథకం ద్వారా లబ్ధిదారులను 1.05 కోట్ల కుటుంబాలకు లబ్ధి కల్పించనున్నట్టు తెలిపారు. కాగా, ఈ కొత్త ప్రకటనలు మొత్తం గ్యారంటీల సంఖ్యను 17కి తీసుకువెళుతున్నాయని కాంగ్రెస్ చెప్పింది. పార్టీ ఇంకా మ్యానిఫెస్టోను ప్రకటించలేదనీ, దానికి అదనపు చర్యలు ఉంటాయని గెహ్లాట్ తెలిపారు. ప్రధాని మోడీ మా హామీల గురించి చాలా ఆందోళన చెందుతున్నారని అశోక్ గెహ్లాట్ చెప్పారు.

జానపద కవి కొసరాజు సమగ్ర సాహిత్యం తానా ప్రచురణ

తానా ప్రపంచ సాహిత్య వేదిక వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సుమారు నాలుగు దశాబ్దాలకుపైగా తెలుగు సినీ రంగంలో 'ఏరువాక సాగాలో, రామయ తండ్రీ ఓ రామాయ తండ్రీ, అడుతు పాడుతు పని చేస్తుంటే,' వంటి పలు గీతాలు జానపద శైలిలోను అచ్చమైన తెలుగు నుడికారంతో రాసిన కొసరాజు రాఘవయ్య సమగ్ర సాహిత్యాన్ని సేకరించి గ్రంథ రూపంలో వెలువరించేందుకు సన్నాహం చేస్తున్నామని తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా) ప్రపంచ సాహిత్య వేదిక నిర్వాహకులు డాక్టర్ ప్రసాద్ తోటకూర ఒక ప్రకటనలో తెలిపారు. అయనతో కలసి తానా అధ్యక్షులు నిరంజన్ శృంగవరపు కలసి కొసరాజు సినీ పాటలే కాక గండికోట యుద్ధం కావ్యం, కడగండ్లు, నవ భారతం, భాను గీత వంటి పద్య నిఘంటులు, యక్ష గానం వంటి వివిధ ప్రక్రియలో ప్రతిభావంతులని సమగ్ర సాహిత్య గ్రంథంలో ఆయన రచనలతో పాటు జీవిత విశేషాలు ఉంటాయని తెలిపారు. గతంలో ప్రముఖ కవి సిరివెన్నెల సీతారామ శాస్త్రి సమగ్ర సాహిత్యాన్ని ఆయన కుటుంబ సభ్యుల సహకారంతో అరు సంపుటాలుగా సాహిత్య అభిమానులకు అందిచామని ఆ ప్రకటనలో వివ రించారు. గ్రంథ ప్రచురణకు సహకారం అందిస్తున్న కొసరాజు కుటుంబ సభ్యులకు మనసు ఫౌండేషన్ అశోక్ కుమార్ పారాకు ధన్యవాదాలు తెలిపారు.



అమృత్ కలశ యాత్ర ప్రత్యేక రైలు ప్రారంభం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో


ఢిల్లీలో జరిగే 'మేరీ మట్టి మేరా దేశ్' ప్రచార కార్యక్రమానికి సంబంధించిన అమృత్ కలశ యాత్ర ప్రత్యేక రైలు శనివారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి బయల్దేరివెళ్లింది. రాష్ట్రానికి చెందిన 195 మంది నెహ్రూ యువకేంద్రం వాలంటీర్లు తమ గ్రామాలకు చెందిన మట్టి, మొక్కలతో కూడిన ప్రత్యేక కలశాలను తీసుకొని ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ప్రచార యాత్ర కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆజాదీ కా అమృత్ మహెూత్సవ్ ప్రచారానికి ముగింపుగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఢిల్లీలో దీనికి సంబంధించిన ముగింపు కార్యక్రమం నిర్వహిస్తారు.

'ఎన్ని' కళలు!

ప్రజల్లో రాజకీయ చైతన్యం రానంత వరకు చట్టసభల ప్రక్షాళన సాధ్యం కాదు. ఓటింగ్‌లో పాల్గొని మోస పోవడానికి పద్దెనిమిదేండ్ల పౌరుడే కానక్కరలేదు. 'మంచివాళ్లు ఓటింగ్‌కు దూరంగా ఉండటం- చెడ్డ ప్రభుత్వాల ఏర్పాటుకు దారి తీస్తుందన్నది' అని ఎన్నికల నిర్వహణలో తనదైన ముద్ర వేసుకున్న మాజీ సీఈసీ శేషన్ మాటలు ప్రజలందరికి ఒక హెచ్చరిక!

కళలు అరవై నాలుగు. అందులో మంచివి కొన్ని. ముంచేవి మరికొన్ని. సాధారణంగా ఒకరికి ఒకటి లేదా రెండు, మూడు కళలలో ప్రవేశం ఉంటుంది. ఇది మొదటి రకం. ఒకే వ్యక్తికి అనేక కళలలో ప్రవేశమే కాదు ప్రావీణ్యం ఉంటే వారు రెండో కోవకు చెందినవారు. నేటి రాజకీయ నాయకులను చూస్తుంటే వారిలో ఎన్ని కళలు దాగి ఉన్నాయో అన్న సందేహం కలగక మానదు. నేతలలో దాగి ఉన్న 'కళ'లు బయట పడేది ఈ ఎన్నికల కాలంలోనే. ఓట్ల పండగ వచ్చిందంటే ఓటరు దేవుడవుతాడు. ఐదేండ్లు ప్రజలను పట్టించుకోనోడే ఇప్పుడు వారి చుట్టూ తిరుగుతుంటారు. ఓటరు మహాశయులను ప్రసన్నం చేసుకోవడానికి 'దోసెలు వేస్తూ, బట్టలు ఉతుకుతూ, ఇస్త్రీ చేస్తూ, చంటి పిల్లలకు సాన్నాలు చేయిస్తూ' ఇలా ఒకటేమిటి ఓటర్లను మెప్పించేందుకు నానా తంటాలు పడుతున్నారు. ఓటర్లను ఆకట్టుకునేలా అభ్యర్థులు ప్రచార పర్వానికి సిద్ధమవుతున్నారు.

ప్రాంతీయ పార్టీలతోపాటు ప్రధాన జాతీయ పార్టీలు గాడి తప్పుతుండటం ఒక అవాంఛనీయ పరిణామం. రాజకీయపక్షాలు మునుపెన్నడూ లేని స్థాయిలో వాగ్దానాల వర్షాన్ని కురిపిస్తున్నాయి. అధికారం కోసం పరుగులో అమలు చేయగలిగే, ఆచరణయోగ్య హామీలే ఇవ్వాలనే ఔచిత్యం లోపిస్తున్నది. తమిళనాడుకు చెందిన ఓ ఇండిపెండెంట్ అభ్యర్థి ఏకంగా చంద్ర మండలం మీదికే తీసుకెళ్తానని ప్రకటించటం ఈ వాగ్దానాల పోకడకు పరా



కాష్ఠ. ఏం చేసైనా అధికారం చేజిక్కించుకోవాలనే తాపత్రయంతో ఇస్తున్న ఎన్నికల హామీలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నాయి అనడంలో సందేహమే లేదు. రాజకీయ నాయకుల నినాదాలకు, వాళ్ల వాగ్దానాలకు ప్రజలు అసలు బలికావద్దు. రాజకీయ నైతిక విలువలకు కట్టుబడని ఖద్దరు బట్టల నాయకులు ఎన్నికల్లో అమలు సాధ్యంకాని హామీలిచ్చి నెరవేర్చకున్నా వాళ్లకు ఎలాంటి శిక్షలు లేని భూస్వామ్య, నియంతృత్వ భావజాలం నిండిన ప్రజలస్వామ్యం మనది. దళారీ రాజకీయ నాయకుల స్వభావాన్ని జంతువులతో పోల్చి అలిశెట్టి ప్రభాకర్ చెప్పిన 'రాజకీయం' కవిత నేటికీ ఆలోచనల్లో పడేస్తుంది. **"ఒక నక్క/ ప్రమాణ స్వీకారం చేసిందట / ఇంకెవర్నీ మోసగించననీ/ ఒక పులి/ పశ్చాత్తాపం ప్రకటించిందట/ తోటి జంతువుల్ని సంహరించినందుకు / ఈ కట్టు కథ విని గొర్రెలింకా పుర్రెలూపుతూనే ఉన్నాయ్"** అని ఓటర్లను హెచ్చరిస్తాడు.

'ప్రజాస్వామ్యంలో ఒక ఓటరు అజ్ఞానం- మిగిలిన వారందరి భద్రతనూ ప్రమాదంలో పడేస్తుంది' అని అమెరికా మాజీ అధ్యక్షుడు జాన్ ఎఫ్.కెన్నెడీ చేసిన హెచ్చరికను యువత అర్థం చేసుకోవాలి. తమ భవితను తామే నిర్దేశించు కోవాలంటే- ప్రజాస్వామ్య యజ్ఞంలో వారు పాలు పంచుకుని తీరాలి. 'ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పాడుగాలిగా మారి/ విషం చిమ్ముతుంటాయి/ ప్రజాస్వామ్యానికి ఊపిరిపోయాల్సిన ఎన్నికలు/ దారి తప్పి ఉరితాడు పేనుతున్నాయి' అని యువకవి తగుళ్ల గోపాల్ ఆవేదన చెందినట్టు వెగటు పుట్టిస్తున్న ధన, రౌడీ రాజకీయాలతో పరువుమాస్తున్న ఎన్నికల ప్రక్రియను ఏవగించుకునే వారూ లేకపోలేదు. అవినీతి అక్రమాల చెరలోంచి జనస్వామ్యానికి స్వేచ్ఛ ప్రసాదించగలిగే ప్రజా ఉద్యమానికి యువతే నేతృత్వం ఎందుకు వహించకూడదు? ప్రజాసంక్షేమానికి పాటుపడని నేతలను నిగ్గదీయడమే కాదు... దేశం తలరాతను మార్చి రాసే విధాతలుగా యువత అవతరించాలి!

ఎన్నికల ప్రచారంలో హామీలతో బురిడీ కొట్టించే నాయకుల ప్రసంగాలకు, మోసపూరిత వాగ్దానాలకు సామాన్య ఓటర్లకు ప్రతీసారి ఓటమే. అదుపులోని లేని అధిక ధరలు పేదలను మరింత నిరుపేదలుగా మారుస్తున్నాయి. నమ్ముకున్న ఓటర్లను ప్రభుత్వాలు గెలిచిన తర్వాత వివిధ రకాలైన టాక్స్‌ల పేరుతో నట్టేట ముంచుతున్న తీరు "ఉండబట్ట లేక / ఓటేస్తే / ఉన్న బట్టా / లాక్కునట్లు" అని విమర్శిస్తాడు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలతంతు నియమనిబంధనల్లో చెప్పుకున్నంత గొప్పగా అమలు జరగడం లేదు. అక్రమ మార్గాల్లో దేశ సంపదను కొల్లగొడుతున్న అవినీతిపరులు ఓటుకు నోటు ఆశ చూపి పార్లమెంటులో పాగావేసి ధనార్జనకు పాల్పడుతున్నారు. ఈ అప్రజాస్వామిక పరిస్థితులను పరిశీలించిన నిబద్ధత కలిగిన కవిగా ప్రజాపక్షంగా నిలబడి ప్రశ్నించారు.

"అయిదేళ్లకోసారి / అసెంబ్లీలో మొసళ్ళు / పార్లమెంటులోకి తిమింగ లాలూ / ప్రవే శించటం పెద్ద విశేషం కాదు / జనమే / ఓట్ల జలాశయాలై / వాటిని బతికించటం / విషాదం..?" అన్న అలిశెట్టి చురక అక్షర సత్యం. ప్రజల్లో రాజకీయ చైతన్యం రానంత వరకు చట్టసభల ప్రక్షాళన సాధ్యం కాదు. ఓటింగ్‌లో పాల్గొని మోస పోవడానికి పద్దె నిమిదేండ్ల పౌరుడే కానక్కరలేదు. 'మంచివాళ్ల ఓటింగ్‌కు దూరంగా ఉండటం- చెడ్డ ప్రభుత్వాల ఏర్పాటుకు దారి తీస్తుందన్నది' అని ఎన్నికల నిర్వహణలో తనదైన ముద్ర వేసుకున్న మాజీ సీఈసీ శేషన్ మాటలు ప్రజలందరికి ఒక హెచ్చరిక!

మిత్రపక్షంగా దీర్ఘకాలం కొనసాగడమే గాక అయోధ్య ఘటనలలోనూ ఆరోపణలకు గురైన మహారాష్ట్ర శివసేన ఉద్ధవ్‌ఠాక్రే వర్గం ఎంపీ సంజయ్ రౌత్ దీనిపై స్పందిస్తూ రాముడు బీజేపీకి, మోడీకి మాత్రమే సంబంధించిన దేవుడు కాదు కదా అని ఆక్షేపించారు. అయోధ్య ఆలయం ప్రధాన పూజారి సత్యేంద్ర దాస్‌కు ఇది చాలా కోపం తెప్పించింది. ప్రధాని గనక పిలిచామంటే అదోరకంగా వుండేది. మోడీకి రాముడి ఆశీస్సులున్నాయి గనకే దేశాధినేతగా అధికారం చలాయించగలుగుతున్నారని, మిగిలిన వాళ్లు వీధుల్లో తిరుగుతున్నారని ఫక్తు రాజకీయవాదన చేశారు.

నిజమైన చరిత్రలో అవసరమైన అంశాలు తెలియకుండా చేయడం కోసం గాంధీజీ హత్య, గుజరాత్ మతహత్యాకాండ వంటివి తీసేయాలి. ఇవి అమలులోకి రావడం తర్వాత జరిగినా ముందు ఈ వార్తలు విడుదల చేయడం ద్వారా మతఛాందసాలను సంతృప్తి పరచాలి. అయితే విద్యారంగం ఉమ్మడి జాబితాలో వుంది గనక పాఠ్యాంశాల పరంగా నిర్ణయాలు రాష్ట్రాలు తీసుకుంటాయి గనక కొత్త విధానం వాటిపై రుద్దడం జరుగుతున్నది.కేరళ తమిళనాడు, బెంగాల్‌వంటి రాష్ట్రాలు ఇందుకు గట్టిగా నిరాకరించినా ఏపితో సహా పలు రాష్ట్రాలు అత్యుత్సాహంగా అమలు చేయడం ఆందోళన కలిగించే వాస్తవం.

కేంద్రీకృత వ్యూహంతో బీజేపీ త్రిముఖ దాడి



తెలకపల్లి రవి


అయిదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికల నేపథ్యంలో వీస్తున్న ఎదురుగాలిని తట్టుకోవడానికి బీజేపీ అగ్రనాయకత్వం ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్‌షా వేస్తున్న ఎత్తులుపై ఎత్తులు అభాసుపాలవుతున్నాయి. ఆర్భాటంగా ప్రకటించిన తతంగాలు చాపచుట్టుకోవలసి వస్తున్నది. ప్రతిపక్షాల నుంచేగాక రాజ్యాంగ నిపుణుల నుంచి మీడియా నుంచి విమర్శలు రావడంతో అనివార్యంగా వెనక్కు తగ్గవలసి వస్తున్నది. జమిలి ఎన్నికల నినాదం ఆ ఎత్తుగడలకు పరాకాష్ఠగానే రూపుదిద్దుకుంది. డబుల్ ఇంజన్ హడావుడి కూడా అదే. కేంద్రంలోని మోడీనే రాష్ట్రాలలో ఊరేగించి ఒకేసారి రాష్ట్రాలనూ కైవసం చేసుకోవచ్చనే అప్రజాస్వామిక ఆలోచన దీని వెనక వుందని అందరికీ అర్థమై పోయింది. ఒకేదేశం, ఒకే ఎన్నిక, ఒకే పన్ను, ఒకే మతం, ఒకే పార్టీ, ఒకే రేషన్, ఒకే మతం, అన్న చందంగా చేసే రాజకీయమే దేశభక్తిగా చలామణి చేయడం ఎంతో కాలం చెల్లదని ఒప్పుకోవలసి వచ్చింది. జమిలి ఎన్నికలను రుద్దడం తేలికకాదనీ పైగా ఈ సమయంలో వ్యతిరేకత కూడా తెచ్చిపెట్టవచ్చని గ్రహించిన తర్వాత ప్రస్తుతానికి కేంద్రం వెనక్కు తగ్గింది. అయితే మరోవైపున ఇందుకోసమే ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అధ్యక్షతన అధ్యయన కమిటీని నియమితమైంది. ప్రస్తుత రాష్ట్రపతి ద్రౌపదిముర్మును ఆహ్వానించకుండానే కేవలం మోడీ కనుసన్నల్లో పూర్తయిన కొత్త పార్లమెంటు భవనంలో దీన్ని ఆమోదించడం ఆసక్తికరం. మోడీ విధేయత కారణంగా గతంలో రాష్ట్రపతి పదవి పొందిన కోవింద్‌నే మళ్లీ తెరపైకి తేవడం యాదృచ్ఛికం కాదు. వాస్తవానికి పదవీ విమరణ చేసిన ఒక రాష్ట్రపతికి అధికారిక బాధ్యత అప్పగించడం ఇదే ప్రథమం. కేంద్ర ప్రభుత్వ అధికారులను కమల ప్రచారకులుగా వాడుకోవడం కోసం ఉద్దేశించిన రథప్రభారీ ప్రహసనం ఆ విధంగానే విమర్శల పాలైంది. కేంద్ర పథకాల ప్రచారమంటూ అధికారులను స్వంత పార్టీ సైన్యంగా మార్చేసుకుని ఆ ముసుగులోనే పార్టీ ప్రచారం చేయించు కోవడానికి పెట్టుకున్న రథ్ ప్రభారీ పేరును చల్లగా మార్చుకోవలసి వచ్చింది. ఎన్నికల కమిషన్ నోటీసుతో ఎన్నికలు జరిగే అయిదు రాష్ట్రాల్లోనూ ఈ కార్యక్రమం వుండబోదనే ప్రకటనా చేయవలసి వచ్చింది. అయితే ప్రధాని దీన్ని ప్రారంభించడం, దేశవ్యాపితంగా ఈ ప్రచార ప్రహసనం యథావిధంగా కొనసాగుతుంది. అంటే మౌలికంగా మోడీ ఆలోచనా ధోరణిలో గానీ, రాజ్యాంగ వ్యతిరేక రాజకీయాలలోగానీ మార్పులేదని స్పష్టమవుతుంది.

రాముడి ఆశీస్సులు ఆయనకేనా?

అయిదు రాష్ట్రాల ఎన్నికల్లో బలాబలాలను బట్టి రాజకీయ వాతావరణాన్ని బట్టి చూస్తే బీజేపీకి పెద్ద అనుకూలత లేదని చాలాచోట్ల ఓడిపోవచ్చనీ సర్వేలు చెబుతున్నాయి. మూడు హిందీ రాష్ట్రాలలో పాత వారిని కొనసాగించలేని, ప్రస్తుతమున్న వారిని కొనసాగించలేని స్థితిలో బీజేపీ వుంది. ఈ సంకట స్థితిని అధిగమించడానికి రామభక్తి నుంచి రాజకీయ కుయుక్తుల వరకూ దేనికీ వెనకాడటం లేదు. అయోధ్య పరిణామాలు సుప్రీం కోర్టు తీర్పు తదితర అంశాలు మళ్లీ ముందుకొచ్చాయి. 2019 ఎన్నికలు ముగియ గానే అయోధ్యలో భూమిపూజలో ప్రధాని మోడీ ప్రత్యక్షమయ్యారు. ఇప్పుడు కూడా అయోధ్య ట్రస్టు ప్రతినిధులు మోడీని కలిసి 2024 జనవరిలో విగ్రహ మహాప్రతిష్ఠాపనకు హాజరు కావలసిందిగా ఆహ్వానం అందించారు. ఆయన దాన్ని మీడియాలో పెద్ద విషయంగానే ప్రచారంలో పెట్టారు. బీజేపీ మిత్రపక్షంగా దీర్ఘకాలం కొనసాగడమే గాక అయోధ్య ఘటనలలోనూ ఆరోపణలకు గురైన మహారాష్ట్ర శివసేన ఉద్ధవ్‌ఠాక్రే వర్గం ఎంపీ సంజయ్‌రౌత్ దీనిపై స్పందిస్తూ రాముడు బీజేపీకి, మోడీకి మాత్రమే సంబంధించిన దేవుడు కాదు కదా అని ఆక్షేపించారు. అయోధ్య ఆలయం ప్రధాన పూజారి సత్యేంద్ర దాస్‌కు ఇది చాలా కోపం తెప్పించింది. ప్రధాని గనక పిలిచామంటే అదోరకంగా వుండేది. మోడీకి రాముడి ఆశీస్సులున్నాయి గనకే దేశాధినేతగా అధికారం చలాయించగలుగుతున్నారని, మిగిలినవాళ్లు వీధుల్లో తిరుగుతున్నారని ఫక్తు రాజకీయవాదన చేశారు. మరోవిధంగా చెప్పాలంటే రాముడి ఆశీస్సులు ఆయనకే వున్నాయని కితాబిచ్చారన్నమాట. అయోధ్యలో భూమాఫియా పెరిగి కబ్జాలు, దౌర్జన్యాలు చేస్తున్నారనే వార్తలు వస్తుంటే,ఒక పూజారి కూడా వారి చేతుల్లో ఈ మధ్యనే హత్యకు గురైతే ఇంతవరకు అతీగతీ లేదు. ఈ సమయంలోనే వారణాసిలో జ్ఞాన్‌వ్యాపీ మసీదు, బృందావన్‌లో కృష్ణమందిరం సమస్యలను కూడా కోర్టుల్లో తిరిగి తీసుకురావడం కూడా ఈ మతరాజకీయంలో భాగమే. ఢిల్లీలో రామ్‌లీలా మైదానంలో రావణదహనంలో పాల్గొంటూ మోడీ పరోక్షంగా ఎవరైతే కులగణన పేరిట ప్రజల్లో చీలికలు తెస్తున్నారో వారిని కూడా ఇలాగే దహనం చేయాలని తీవ్రమైన మాటన్నారు. ఇండియా వేదికను దృష్టిలో పెట్టుకునే ప్రధాని ఇంత మాటన్నారని మీడియా పోల్చి రాసింది.

మార్క్సిస్టులపై దాడి, నచ్చిందే చరిత్ర!

ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్ సంప్రదాయికంగా చేసే దసరా ప్రసంగంలో ఇంచుమించు ఇదే సెలవిచ్చారు. సాంస్కృతిక మార్క్సిస్టులను వోక్ పీపుల్‌ను (మేల్కొల్పు జనాభా)ను తోసిపుచ్చాలని భగవత్ ఉవాచ. కొన్నేళ్ల కిందట మోడీ లోక్‌సభలో ఆందోళన జీవులంటూ అపహాస్యం చేయడం గుర్తుండే వుంటుంది. ఈ మాటలన్నీ కూడా చైతన్యం కదలిక తీసుకొచ్చేవారిపైనే ఎక్కుపెట్టబడిన ఆయుధాలే. పశ్చిమ దేశాల్లో విముక్తి కోసం పోరాడే వారిని వోక్ పీపుల్ అంటుంటారట. దేశంలో సమస్త అనర్థాలకూ వారే మూలకారణమని మోహన్ భగవత్ ప్రకటించారు. వీరు ప్రజల్లో అసంతృప్తి పెంచుతారట, చీలికలు తెస్తారట, ఆఖరుకు మణిపూర్‌లో కూడా వీరి వల్లనే కుకీ, మైతేయిల మధ్య తగాదా వచ్చిందట. ఈ దేశంలో వున్నవారంతా హిందువులనేనని ప్రకటించిన సంఘ్‌సంచాలక్ నోట ఈ మాటలు రావడం దేనికి నిదర్శనం? సనాతన ధర్మమే శరణ్యమనే సంఘపరివార్ భావమే అది. అల్ప సంఖ్యాకులు, అణగారిన వర్గాలు, మహిళలు నోరుమూసుకుని పడుంటే ఏ గొడవలు రావని తాత్పర్యం. రాజ్యాంగం మొదటి అధికరణమే చెబుతున్నట్టు ఇండియా దటీజ్ భారత్‌గా గాక ఈ దేశాన్ని భారత్ అనే పిలవాలని తీర్మానించడం కూడా ఈ మహాపథకంలో భాగం. ఇండియా పేరుతో పాటు దాని చరిత్రనూ మార్చడం దాని కార్యాచరణ రూపం. జరిగిన చరిత్రను మరింత శాస్త్రీయంగా ప్రామాణికంగా పరిశోధించి భావి తరాలకు అందించడం గాక హిందూరాజులను కీర్తించే విధంగా చరిత్ర పాఠాలుండాలని, మొగల్ చరిత్ర తీసేయాలనీ ఎన్‌సిఇఆర్‌టి చెప్పడమూ అందుకే. అంతేనా? చరిత్రకూ పురాణాలకూ మధ్య తేడా చెరిపెయ్యాలి. చంద్రయాన్ పాఠంతో పాటు ప్రాచీనకాలంలోనే మనవాళ్లు ఆకాశవిహారం చేశారనీ పుష్పక విమానం వుండేదనీ చెప్పాలని ఎన్‌సిఇఆర్‌టి ఆదేశం. ఇదే సమయంలో నిజమైన చరిత్రలో అవసరమైన అంశాలు తెలియకుండా చేయడం కోసం




గాంధీజీ హత్య, గుజరాత్ మతహత్యాకాండ వంటివి తీసేయాలి. ఇవి అమలులోకి రావడం తర్వాత జరిగినా ముందు ఈ వార్తలు విడుదల చేయడం ద్వారా మతఛాందసాలను సంతృప్తి పరచాలి. అయితే విద్యారంగం ఉమ్మడి జాబితాలో వుంది గనక పాఠ్యాంశాల పరంగా నిర్ణయాలు రాష్ట్రాలు తీసుకుంటాయి గనక కొత్త విధానం వాటిపై రుద్దడం జరుగుతున్నది. కేరళ తమిళనాడు, బెంగాల్‌వంటి రాష్ట్రాలు ఇందుకు గట్టిగా నిరాకరించినా ఏపితో సహా పలు రాష్ట్రాలు అత్యుత్సాహంగా అమలు చేయడం ఆందోళన కలిగించే వాస్తవం. సహకార రంగం తమ అదుపులోకి తెచ్చుకోవడానికి అడుగులు వేస్తున్నారు. పర్యాటక రంగం కూడా తమ అధీనంలోకి తీసుకుంటున్నారు.

రాష్ట్రాలపై ఆర్థిక బిగింపు

ఈ ఏకపక్ష కేంద్రీకృత రాజకీయ సాంస్కృతిక ఆధిపత్యధోరణిని చలాయించడం కోసం మరింత వేగంగా ఆర్థిక కేంద్రీకరణ తీసుకొస్తున్నారు. పరిమిత అధికారాలు గల ఢిల్లీ రాష్ట్ర నమూనా ఇందుకు ఆదర్శంగా కనిపిస్తున్నది. సుప్రీంకోర్టులోనే ఇందుకు వ్యతిరేకంగా తీర్పు రాగా రాజ్యాంగ సవరణతో తోసిపుచ్చి సర్వాధికారాలు చేజిక్కించుకుంది కేంద్రం. ఉపముఖ్యమంత్రితో సహా ఆ రాష్ట్ర నేతలను ఖైదుచేసి అడుగడుగునా ప్రభుత్వ నిర్ణయాలకు అడ్డుతగులుతున్నది. జమ్మూకాశ్మీర్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా మార్చడంలో మతతత్వ రాజకీయమూ కేంద్ర పెత్తనమూ రెండూ వున్నాయి. అసలు స్వాతంత్ర్యానంతరం ఒక రాష్ట్రాన్ని కేంద్రపాలిత ప్రాంతంగా చేయడం ఇదే ప్రథమం, రాష్ట్రాలకు ఆర్థిక సహాయం చేయకుండా పరాధీనతలోకి నెట్టడం నిధులు కేటాయించకపోవడం నిరంతర ప్రహసనంగా మారింది. ఏపీ, తెలంగాణల అనుభవమే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. కేరళ నిరంతరం దీనిపై పోరాడుతూనే వుంది. నిధులు ఇవ్వకపోవడం తెచ్చుకునే అప్పులపై ఆంక్షలు పెట్టడం రాష్ట్రాలను అడకత్తెరలో నెడుతున్నది. అప్పులు పెరిగాయని మళ్లీ ఆ బీజేపీ నేతలే గగ్గోలు మొదలెడతారు. రాష్ట్రాల వాటా తేల్చే ఫైనాన్స్ కమిషన్ పరిధినే తగ్గించడంతో పాటు చేసిన సిఫార్సులనూ కేంద్రం తొక్కిపడుతుంది. జీఎస్‌టి కారణంగా పెట్రోలు, డీజిల్ తప్ప మరేవీ రాష్ట్రాలకు అందకుండా పోయాయి. మిగిలిన మేరకైనా రాష్ట్రాలకు వాటా ఇవ్వకుండా సెస్సులు, సర్‌చార్జిలను పెంచి వాటికి వాటా లేకుండా చేస్తారు. రాష్ట్రాలపై శత్రుపూరితంగా దుష్ప్రచారం చేస్తారు. బీహార్‌లో ఎఐఎంఎస్ పెట్టడానికి రాష్ట్రాలు సరైన స్థలం చూపించలేదని తెలంగాణలో కిషన్‌రెడ్డి, బీహార్‌లో మన్సుఖ్‌మాండవీయ ఒకే విధమైన ఆరోపణలు చేస్తారు. రైల్వేలకు కేరళ సహకరించలేదని మంత్రి అశ్వనీవైష్ణవ్, కర్నాటక తోడ్పడలేదని రాజీవ్ చంద్రశేఖర్ తిట్టిపోస్తారు. సంక్షేమ పథకాలను వక్రంగా చిత్రించడమే గాక సహాయ నిరాకరణ చేస్తారు. కర్నాటక ప్రభుత్వం అన్నభాగ్య పేరిట పథకం చేపట్టి ఎఫ్‌సిఐతో ఒప్పందం కుదర్చుకుంటే కేంద్రం ఒత్తిడి తెచ్చి రద్దు చేయిస్తుంది. పంజాబ్‌లో ఆప్ పథకాలపైనా కేంద్ర మంత్రులు దాడి చేస్తారు. రాష్ట్రాలకేగాక కేంద్రం అదుపుకూడా లేకుండా పిఎం కేర్స్ పేరిట భారీ నిధి వసూలు చేస్తారు. ముఖ్యమంత్రి సహాయ నిధికి సహాయం చేసిన వారికి పన్ను, పిఎం కేర్స్ అయితే కార్పొరేట్ సామాజిక బాధ్యత అంటూ వివక్షత చూపిస్తారు.

చెదురుమదురుగా కనిపించే ఈ అంశాలన్నీ ఒక్కచోటికి చేర్చిచూస్తే మోడీ సర్కార్ కుటిలవ్యూహం ఏమిటో బోధపడుతుంది. కులం, మతం, జాతి దురభిమానం వంటివి రగిలించడం ఒకవైపు, దేశ విశాలత్వాన్ని భిన్నత్వాన్ని చూపే రాష్ట్రాల వన రుల హక్కుల పైన దాడి మరోవైపు చేయడం ద్వారా వాటిని బలహీనపర్చాలి. తద్వారా రాష్ట్రాలలో తమను బలంగా సవాలు చేస్తున్న ప్రతిపక్షాలను దెబ్బతీయాలి. ప్రధాని మోడీనే సర్వశక్తి మంతుడుగా సకల నిర్ణయ సంధాతగా చూపించాలి. మిగిలిన నేతలనూ, పార్టీలనూ ఆఖరుకు ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలను కూడా దమ్మీలను చేయాలి. అయితే చైతన్యవంతులైన భారతీయులు, రాజ్యాంగం, న్యాయస్థానాలు అన్నిటినీ మించి ప్రజాన్యాయస్థానం అందుకు అవకాశమివ్వడం కల్ల.

త్రిశంకు స్వర్గం



నజర్

ఇంటి ముందు బండి ఆగిన శబ్దం విని అటు చూశాడు రాజు. బయట తన మిత్రుడు సురేష్ వచ్చాడు. సంతోషంగా ఇంట్లోకి ఆహ్వానించాడు.

మిత్రులిద్దరూ మాట్లాడుతుండగా లక్ష్మి మిరప కాయ బజ్జీలు వేడివేడిగా తీసుకుని వచ్చింది. అవి తింటూ మాటల్లో పడ్డారు.

"ఒరేయ్ నీవు ఎన్నయినా చెప్పు! కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలతో తెలంగాణ స్వర్గం అయిపోతుంది! సోనియమ్మ మాట ఇచ్చిందంటే జరుగుతుంది! అంతే!" పైగా "సోనియమ్మ మాటకు తిరుగులేదు! అందుకు తెలంగాణ రాష్ట్రమే సాక్ష్యం!" అన్నాడు సురేష్.

"ఆ ఒక్క పుణ్యంతో చేసిన పాపాలన్నీ మాఫీ కావు! అన్నాడు రాజు.

"ఉపాధి కల్పన అంటేనే కాంగ్రెస్! ఎన్నో ప్రభుత్వ రంగ సంస్థలు స్థాపించి, కోట్ల సంఖ్యలో ఉద్యోగాలు కల్పించింది! అంతెందుకు ఉపాధిహామీ పథకం పెట్టింది కాంగ్రెస్సె కదా! అన్నాడు సురేష్ గొప్పగా.

లక్ష్మి చిన్నగా నవ్వింది.

"కాని నూతన ఆర్థిక విధానాలు తీసుకొచ్చిందీ కాంగ్రెస్సే. ఉపాధి హామీ పథకం కమ్యూనిస్టుల వల్ల వచ్చింది కానీ, కాంగ్రెస్ బుర్రలో పుట్టింది కాదు! కాంగ్రెస్ పాలనలో ఉపాధి లేకనే, తెలంగాణా ఉద్యమం వచ్చింది కదా! అన్నది లక్ష్మి.

"శభాష్! కాంగ్రెస్ అంటే ఏమిటో చెప్పావు. అందుకే కేసీఆర్ మ్యానిఫెస్టో మాత్రమే తెలంగాణాను బంగారు తెలంగాణా చేస్తుంది!" అన్నాడు రాజు గర్వంగా.

లక్ష్మి పగలబడి నవ్వింది!

"ఎందుకు నవ్వుతావు? పెన్షన్లు, సబ్సిడీలు, రైతు బంధు, దళితబంధు, గొర్రెలు, బర్రెలు, చీరలు, సారెలు ఒకటేమిటి? అందరికీ అన్నీ ఇచ్చాడు మా కేసీఆర్. పదేండ్లల్లో కనీవినీ ఎరుగని అభివృద్ధి చేశాడు. దేశంలో తలసరి ఆదాయంలో తెలంగాణాను దరిదాపుల్లో ఏ రాష్ట్రమూ లేదు తెలుసా? అన్నాడు రాజు.

"నిజమా! తలసరి ఆదాయం అంతగొప్పగా ఉంటే, సబ్సిడీలు, పెన్షన్లు, ఆ బంధు, ఈ బంధు స్కీములు, బ్యాంకుల్లో ఉచితంగా డబ్బులు వేసుడు ఎందుకు?" ప్రశ్నించింది లక్ష్మి.

రాజుకి పొలమారింది!

"మా చెల్లెలు ప్రశ్నలకు జవాబు చెప్పు! అంటూ నీళ్ళగ్లాసు అందించాడు సురేష్.

అంటే ఉచిత పథకాలను వ్యతిరేకిస్తున్నారా? అన్నాడు రాజు గొంతు పెగల్చుకుని.

"వ్యతిరేకించటమూ. సమర్థించటమూ పక్కన పెట్టండి! తలసరి ఆదాయం పెరగటానికి మీరు అమలు చేస్తున్న ఉచిత పథకం కారణమా లేదా? తలసరి ఆదాయం బాగున్నందు వల్లే ఉచిత పథకాలు పెడుతున్నారా?" అడిగింది లక్ష్మి.

ఈ సారి రాజే నీళ్ళ గ్లాసు తీసుకుని ఖాళీ చేశాడు.

"మేము అమలు చేస్తున్న పథకాల వల్లే తలసరి ఆదాయం పెరిగింది" అంటూ గొణిగాడు.


తెలంగాణ వస్తే ధర్నా చౌక్ ఎత్తేస్తామంటిరి! కాని ప్రతి మండలం ధర్నా చౌక్ అయ్యింది! అంగన్‌వాడీలు, ఆశాలు, గ్రామ సేవకులు, విలేజ్ సెక్రటరీలు, మధ్యాహ్న భోజన కార్మికులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మున్సిపల్ వర్కర్లు, పోరాటాలు చేస్తుంటే వారి గురించి ఏనాడైనా పట్టించుకున్నారా? ఇప్పుడైనా మ్యానిఫెస్టోలో పెట్టారా? ఉద్యమాలు చేసి తెలంగాణ తెచ్చామని చెప్పుకునే మీ పార్టీ కష్టజీవులు ఉద్యమాలు చేస్తుంటే వాటిని అణిచి వేయాలని చూస్తారా? ప్రశ్నించింది లక్ష్మి

"ప్రజల ఆర్థిక స్తోమతను పెంచే పథకాలను ఎవ్వరూ వ్యతిరేకించవలసిన అవసరం లేదు! అది తప్పు కూడా! మరి శ్రమ చేసి, సంపదను సృష్టించే వారికి, సంపద సృష్టికి తోడ్పడే సేవారంగంలోని వారికి మీరు ఇచ్చినదేమిటి?" మళ్ళీ ప్రశ్నించింది.

రాజుకి లక్ష్మి అడుగుతున్నదేమిటో అర్థం కాలేదు!

లక్ష్మి చిన్నగా నవ్వింది.

"నేనడిగింది ఏమిటో మీకు అర్థం కాలేదని నాకు తెలుసు. మీకేమో అర్థం కాలేదు కానీ మీ గులామీ బాస్ దాన్ని మ్యానిఫెస్టోలో పక్కన పెట్టేశాడు. అందుకే



మ్యానిఫెస్టోలో కష్టజీవుల గురించి ఒక్క మాట లేదు!" అన్నది లక్ష్మి.

మా బాస్ అపర చాణక్యుడు కష్టజీవులైన రైతుల కోసం రైతుబంధు తెచ్చాడు" అన్నాడు రాజు గొప్పగా.

"రైతు అంటే కాడిపట్టి పొలం దున్నేవాడు కాని కార్పోరేట్ కాలేజీల ఓనర్ కాదు! కౌలు చేసుకునే రైతుకి రైతుబంధులో ఒక్కరూపాయి కూడా వేయని మీరు రైతుకి నిర్వచనం ఇస్తారా?" అన్నది లక్ష్మి.

రాజు మళ్ళీ నీళ్ళ గ్లాసు వెతుక్కున్నాడు.

"మీ పదేండ్లపాలనలో ఇచ్చిన ఉద్యోగాలకన్నా రద్దు చేసిన పరీక్షలే ఎక్కువ.పిల్లలు పరీక్షలు రాసుడు. ఎవరో కోర్టులో కేసులు వేసుడు, ఆ పరీక్షలు క్యాన్సిల్ కావటం ఈ చక్రబంధంలో ఇరుక్కుని పిల్లలు ఉసురు తీసుకుంటున్నారు. ఇదేనా మీరిచ్చే మోడల్? నిలదీసింది లక్ష్మి.

రాజు నీళ్ళ బాటిల్ ఖాళీ చేశాడు.

తెలంగాణ వస్తే ధర్నా చౌక్ ఎత్తేస్తామంటిరి! కాని ప్రతి మండలం ధర్నా చౌక్ అయ్యింది! అంగన్‌వాడీలు, ఆశాలు, గ్రామ సేవకులు, విలేజ్ సెక్రటరీలు, మధ్యాహ్నభోజన కార్మికులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మున్సిపల్ వర్కర్లు, పోరాటాలు చేస్తుంటే వారి గురించి ఏనాడైనా పట్టించుకున్నారా? ఇప్పుడైనా మ్యానిఫెస్టోలో పెట్టారా? ఉద్యమాలు చేసి తెలంగాణ తెచ్చామని చెప్పుకునే మీ పార్టీ కష్టజీవులు ఉద్యమాలు చేస్తుంటే వాటిని అణిచి వేయాలని చూస్తారా? ప్రశ్నించింది లక్ష్మి

సురేష్ నీళ్ళ జగ్గు తెచ్చి రాజు కిచ్చాడు.

"ఆర్టీసీ కార్మికులు సంస్థను కాపాడమని జీతాలు పెంచమని సమ్మెచేస్తే వారి మీద పగబట్టి, వారికి గత పదేండ్లుగా వేతనాలు పెరగకుండా విలీనం పేరు పెట్టి వారిని ఆగం చేసిన మీరు సంక్షేమం గురించి మాట్లాడతారా? అడిగింది లక్ష్మి.

"మా సారు మాట ఇచ్చాడంటే నిలబెట్టుకుంటాడు. అందుకు కాళేశ్వరమే సాక్ష్యం! అన్నాడు రాజు బింకంగా.

"కుర్చీ వేసుకుని పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తానని మాట ఇచ్చాడు. కుర్చీ లేదా మీ సారుకి! మాట నిలబెటుట్టకోవటంలో మీ సారే ఆదర్శం! దళిత ముఖ్యమంత్రి, మూడెకరాల భూపంపిణీ, అబ్బో ఇలాంటి మానిఫెస్టో అమలు చేస్తానని మాట ఇస్తున్నాడు!" అన్నది లక్ష్మి.

రాజు కోసం సురేష్ మంచినీళ్ళ బిందె మోసుకొస్తున్నాడు.

"మీ సారు మ్యానిఫెస్టో గురించి ఒక్కమాటలో చెబితే అది త్రిశంకు స్వర్గం!" అన్నది లక్ష్మి.

- ఉషాకిరణ్

ఎలక్షన్ డైరీ

బదనామైత...ప్రచారానికి పోను.!

వామ్మో ఆయన ప్రచారానికి నేను పోను. నేను ప్రచారానికి పోయిన తర్వాత ఎన్నికల ఫలితాల్లో ఆయనకు మెజార్టీ తగ్గితే నేను బదనాం అయిత. ఎందుకంటే ఆయన పెట్టిన షరతులు అలా ఉన్నాయి. హుజూర్‌నగర్‌లో 50 వేల మెజార్టీకి ఒక ఓటు తగ్గినా తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానంటూ ఆ నియోజకవర్గపు కాంగ్రెస్ అభ్యర్థి ఎస్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో పదే పదే ప్రజలకు చెబుతున్నారు. దీనిపై మన హన్మంతన్న గాంధీభవన్‌లో సరదాగా స్పందించారు. 'ఉత్తమ్ 50వేల మెజార్టీ గురించి ఎందుకు చెబుతున్నారో, ఆయన్ను ఎవరు అడిగారో, అంత కఠినమైన నిర్ణయం ఎందుకు తీసుకున్నారో ఆయనకే తెలియాలి. రేవంత్, భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తన కంటే ఎక్కువ ఓట్లు తెచ్చుకోవాలని సవాల్ విసురుతున్నారేమో తెలియదు కానీ నేనైతే హుజూర్‌నగర్ ఎన్నికల ప్రచారానికి పోనంటే పోను' అని తెగేసి చెబుతున్నారు. 'నేను ప్రచారానికి పోతే అనుకోని పరిస్థితుల్లో 50 వేల మెజార్టీలో ఒక ఓటు తగ్గినా ఆ ఓటు హనుమంతరావు వల్లే పోయిందంటాడేమో, ఇంకెవరూ ఆయన ఎన్నికల ప్రచారానికి పోయినా మెజార్టీ తగ్గడానికి వారే కారణమంటాడేమో' అని వ్యంగ్యంగా స్పందించారు. 'నేను కూడా హుజూర్‌నగర్‌లో ప్రచారానికి పోవడానికి జంకుతున్నాను. ఎవరు ప్రచారానికి రాకుండా ఉత్తమ్ ప్లాన్ చేసినట్టున్నాడు. నా వల్ల ఒక ఓటు తగ్గినా ఆ బదనాం నేను మోయలేను. ఇదెక్కడి లొల్లిరా బై... ఊకే ఇంట్లో కూర్చొక.. నాకెందుకు రాబై ఇదంతా...నా వల్ల ఆయన రాజకీయ సన్యాసం తీసుకోవడం నాకిష్టం లేదు.' అంటూ నవ్వులు పూయించారు.

- గుడిగ రఘు

దక్షిణ..ప్రదక్షిణ..!

దక్షిణ.. ప్రదక్షిణ... ఈ రెండు పదాలకు ఇప్పుడున్నంత గిరాకీ ఎప్పుడూ లేదు. మొదటిది పార్టీలో టిక్కెట్ దక్కాలంటే ఇచ్చేది. రెండోది ఇచ్చినా రాకపోతే దాన్ని దక్కించుకోవటం కోసం చేసేది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ ఆఫీసుల వద్ద ఇవే సీన్లు కొనసాగుతున్నాయి. ఒక పార్టీలో టిక్కెట్ రాలేదంటూ ఇంకో పార్టీలోకి, అక్కడా దక్కకపోతే మరో పార్టీలోకి జెట్ స్పీడుతో దూకుతున్నారు ఆశావహులు. ఈ క్రమంలో నిన్నటిదాకా తిట్టిన పార్టీ ఈ రోజు మంచిదవుతోంది.. గతంలో మంచిదే అన్న పార్టీ ఇప్పుడు చెడ్డవుతోంది. ఇలాంటి దౌర్భాగ్య పరిస్థితుల్లో అసలు ఇలా పూటకో పార్టీ మారే నాయకాగ్రేసరులకు పార్టీల మీద విశ్వాసం, వాటి సిద్ధాంతాల పట్ల నమ్మకం, గౌరవం ఏమాత్రం లేదని తేలిపోతోంది. అలా ఉంటే ఏండ్ల తరబడిఉన్న పార్టీలను ఎడం కాలితో తన్ని... రాత్రికి రాత్రే ప్లేటు ఫిరాయించటం ఎలా సాధ్యం..? మనిషన్న వాడికి, అందునా మనసున్న వాడికి ఇవన్నీ సాధ్యపడవు కదా..? అనే డౌటనుమానం సగటు ఓటరుకు తలెత్తుతోంది.

- కే.నరహరి

పరేషానేందుకు వయా ?

అసెంబ్లీ ఎన్నికలల్ల అధికార పార్టీ అప్పుడే పరేషాన్ కాబట్టే. గదేదో ఇంటెలిజెన్స్ రిపోర్టుతోటి ఆ నలుగురు ఇబ్బంది పడబట్టిరి. అందుకే అరోపణలు, విమర్శలు జోరుగ పెంచిర్రాయే. ప్రతిపక్ష నాయకులు, పార్టీల మీద గయ్యిన దుంకబట్టిరి. దమ్మునోడివే గందా, ఎందుకు బుర్రఖరాబుజేసుకోబడితివి. ఏమైతది..నాలుగు సీట్లు అటో, ఇటో అయితై. ఏమైతదీ వయా? ఈ పాలీకాకపోతే మరోపాలి. అధికారం ఏమన్నా పర్మినెంటా ? లేక పెటేంటా ? అప్పుడు అటు ఇటు మారితే గూడ మంచిదే కదా సామి. కాళేశ్వరం నీళ్లలెక్కల్లో తేడాలొంచినయి అనుకుంట. జెర గుస్సా పెరిగిందని అందరూ అనుకోబట్టే ఆళ్లపార్టీలోనే. అప్పుడప్పుడు అసెంబ్లీల కుడివైపు కూడా కుసోవాలే సామి. ఏం ఫికర్ జేయకు. ఇంత పెరుగన్నం తిని తొంగోసామి? ఉంట మల్ల..నాకు ఆకలైతాంది.

- బి.బసవపున్నయ్య

మల్లన్న రూటే.. సపరేటు...

ఇది ఎన్నికల కాలం. నేతల చిత్ర విచిత్ర విన్యాసాలు ఇప్పుడు నిత్యకృత్యం. ఆ విన్యాసాల్లో నటించే వారు కొందరైతే.. జీవించే వారు మరికొందరు. మొత్తం మీద హోటల్‌లో దోశ వేసినా.. వీధుల్లో చీపురు పట్టినా... ఓట్లే లక్ష్యం, గెలుపే వారి గమ్యం. ఈ రకంగా కొనసాగుతున్న ఎలక్షన్ ప్రచార ప్రహసనంలో కార్మిక మంత్రి చామకూర మల్లారెడ్డి మాత్రం తన దైన స్టైల్‌లో అందర్నీ అలరిస్తున్నారు.. తద్వారా జనాన్ని ఆకర్షిస్తున్నారు. గత కొన్నేండ్ల నుంచి 'పాలమ్మిన.. పూలమ్మిన...' అంటూ ప్రత్యేక మేనరిజమ్‌తో, అంతకు మించిన రిథమ్‌తో సభికుల్ని కడుపుబ్బా నవ్విస్తున్న మల్లన్న... మొన్నటి దసరా వేడుకల్లో సైతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. హైదరాబాద్ నగరంలోని ఓ మైదానంలో నిర్వహించిన ఆ వేడుకల్లో తాను 1980ల్లో పాలమ్మటం కోసం వాడిన బజాజ్ స్కూటర్‌ను బయటకు తీసి.. దాన్ని గ్రౌండ్ మొత్తం తిప్పి... 'ఔరా...' అనిపించారు. లేటు వయసులో లేటెస్టుగా స్కూటర్ మీద రయ్యిరయ్యిన తిరుగుతూ తనకు తానే సాటి అనిపించారు. ఇక నిన్నటికి నిన్న...కారు గుర్తుకు ఓటేయ్యాలని కోరుతూ ప్రచారాన్ని సరికొత్త పుంతలు తొక్కించారు మన లేబర్ మినిష్టర్. తన నియోజకవర్గమైన మేడ్చల్‌లో ఇంటింటికీ, గడప గడపకూ తిరుగుతూ ఓట్లడిగారాయన. ఇందులో కొత్త, వింతేముందని అనుకుంటున్నారా..? ఇక్కడే ఉంది అసలు ట్విస్ట్. క్యాంపెయిన్ సందర్భంగా నేతలు చంటి పిల్లల్ని ఎత్తుకోవటం, వారిని లాలించటం, వారితో ఫొటోలు దిగటం మామూలే. ఇక్కడ మన మల్లన్న కూడా ఒకర్ని ఒళ్లో పడుకోబెట్టుకుని, లాలి పాట పాడారు. ఏడవకు ఏడవకు వెర్రి కన్నా అంటూ జోల కూడా పాడారు. ఆ తర్వాత కారు గుర్తుకు ఓటేయమని అభ్యర్థించారు. కాకపోతే ఆయన అలా ఒళ్లో పడుకోబెట్టుకుని, లాలించింది.. ఓ డెబ్బై ఏండ్ల వృద్ధురాలిని. చుట్టూ ఉన్న జనం ఈ దృశ్యం చూసి 'నిజంగా మల్లన్న అంటే మల్లన్నే..' అనుకున్నారట. ఈ దృశ్యం సోషల్ మీడియాలో తెగ వైరలైంది. వేలల్లో జనం వీక్షించారు. అదీ మన మినిష్టర్ మల్లన్న అంటే...

- బి.వి.యన్.పద్మరాజు

కేయూ డిగ్రీ విద్యార్థులకు పెంచిన ఫీజులను తగ్గించాలి

- ఆ సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ) పరిధిలో డిగ్రీ విద్యార్థులకు పెంచిన అన్ని రకాల ఫీజులనూ తగ్గించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఫీజుల పెంపునకు సంబంధించి విశ్వవిద్యాలయం ఇచ్చిన సర్క్యులర్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేయూ పరిధి డిగ్రీ కళాశాలల్లో చదివే మొదటి సంవత్సరం విద్యార్థులకు రిజిస్ట్రేషన్ ఫీజు, రెండు, మూడో సంవత్సరం విద్యార్థులకు గుర్తింపు ఫీజు, విద్యార్థి సంక్షేమ నిధి, ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్ ఫీజులను ఇష్టారాజ్యంగా పెంచారని విమర్శించారు. గతం కన్నా మూడు రెట్లు ఫీజులను పెంచారని తెలిపారు. ఈ చర్యను వారు తీవ్రంగా ఖండించారు. గతంలో విద్యార్థి రిజిస్ట్రేషన్ ఫీజు, ప్రాసెసింగ్ ఫీజు, విద్యార్థి గుర్తింపు ఫీజు, విద్యార్థి సంక్షేమ నిధి, ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్ ఫీజులు మొత్తం కలిపి సుమారు రూ.900 ఉండేవని గుర్తు చేశారు. ఆయా ఫీజులను ఇప్పుడు రూ.2,500లకు పెంచారని ఆందోళన వ్యక్తం చేశారు. అంటే విద్యార్థులపై రూ.1,600 అదనపు భారం మోపారని తెలిపారు. పెంచిన యూనివర్సిటీ ఫీజులతోపాటు పరీక్ష ఫీజులు చెల్లించడం విద్యార్థులకు పెను భారమనీ, తక్షణమే ఆ సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కేయూ పాలకమండలి సభ్యులు విద్యార్థుల ఆర్థిక స్తోమత గురించి ఆలోచించకుండా ఏకపక్షంగా ఫీజులు పెంచడం బాధ్యతారహితమని విమర్శించారు. ఇలాంటి చర్యలతో పేద విద్యార్థులు చదువులకు దూరమవుతారని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం పెంచిన ఫీజుల సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోవాలనీ, లేదంటే రాష్ట్ర వ్యాప్త నిరసనలు చేపడతామని హెచ్చరించారు.

మునుగోడు నుంచి పోటీ చేస్తా

- కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మీద గెలుస్తా : టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చలమల్ల కృష్ణారెడ్డి



నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్

మునుగోడు నియోజకవర్గం నుంచి కచ్చితంగా పోటీ చేస్తానని కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చలమల కృష్ణారెడ్డి శనివారం వీడియో రిలీజ్ చేశారు. చౌటుప్పల్ మండలం దామెరలో ఆయన క్యాంప్ ఆఫీస్‌లో శనివారం ఏడు మండలాల కార్యకర్తల సమావేశం నిర్వహించాల్సి ఉండగా ఆ కార్యక్రమానికి చలమల్ల కృష్ణారెడ్డి హాజరు కాలేదు. వీడియోలో ఆయన మాట్లాడుతూ.. 15 నెలల కిందట కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలోకి వెళ్లిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మూడ్రోజుల కిందట తిరిగి వస్తే ఎమ్మెల్యే టికెట్ కేటాయించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ సచ్చిపోయినదని బీజేపీలోకి వెళ్లిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎలా పచ్చగా కనబడుతుందని ప్రశ్నించారు. 15 నెలల నుంచి కార్యకర్తలను, పార్టీని కాపాడుకుంటూ వస్తే అన్యాయం చేశారన్నారు. నాయకులు, కార్యకర్తలు ఎవరూ అధైర్యపడొద్దని, మునుగోడు బరిలో కచ్చితంగా పోటీ చేస్తా.. రాజగోపాల్ రెడ్డి మీద గెలుస్తా అని అన్నారు. తనకు టికెట్ రాకుండా నల్లగొండ జిల్లా నాయకులే అడ్డుకున్నారని విమర్శించారు.

బీఆర్ఎస్ అవసరం చెప్పండి

- ఎన్నారైలతో జూమ్ మీటింగ్‌లో కేటీఆర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మీకు తెలిసిన వారికి చెప్పండి.. తెలంగాణకు బీఆర్ఎస్ అవసరం ఎంతుందో అంటూ ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోరారు. శనివారం 52 దేశాల బీఆర్ఎస్ ఎన్నారై శాఖల ప్రతినిధులతో జూమ్ కాల్‌లో మాట్లాడారు. ఈ కార్యక్రములో ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ అనిల్ కుర్మాచలం, గ్లోబల్ ఎన్నారై కో ఆర్డినేటర్ మహేష్ బిగాల పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణ వచ్చాక, రాక ముందు పరిస్థితులను ప్రవాస భారతీయులు వారి గ్రామస్తులకు వివరించాలని సూచించారు. బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో ముందుకెళ్లిన విషయాలను ఆయన ఈ సందర్భంగా వివరించారు. మరోసారి దారితప్పి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 50 సంవత్సరాల పాటు తెలంగాణ అభివృద్ధి వెనక్కి పోతుందని కేటీఆర్ అన్నారు. ఒకప్పుడు కాంగ్రెస్ వలన తెలంగాణ రాష్ట్రం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కలిసి 60 సంవత్సరాలు అనేక బాధలకు గురైందని తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ ఎన్నారై నాయకులు మహేష్ తన్నీరు తదితరులు పాల్గొన్నారు.

'ఎర్రజెండాను' అణచివేసే దమ్ము ఎవరికీ లేదు

మరింత ఎరుపెక్కుతుంది

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
- పార్టీ కార్యకర్త నాగేశ్వరరావుకు నివాళి ఫకుటుంబానికి అండగా ఉంటాం



నవతెలంగాణ - బోనకల్

ఎర్రజెండాను అణచివేసే దమ్ము ఎవరికీ లేదని, ఒకవేళ ఆ విధంగా చేయాలనుకుంటే ఎర్రజెండా మరింత ఎరుపు ఎక్కుతుందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు.

ఖమ్మం జిల్లా బోనకల్ మండలం గోవిందాపురం గ్రామంలో ఈనెల 26న కాంగ్రెస్ సర్పంచ్ ఉమ్మనేని బాబు, ఆయన కుమారుడు ఉమ్మనేని రమేష్‌తోపాటు మరి కొందరు కలిసి కనకదుర్గమ్మ ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా.. మంచినీటి క్యాన్‌తో ఇంటికి పోతున్న సీపీఐ(ఎం) కార్యకర్త ఎర్రబోయిన నాగేశ్వరరావుపై గొడ్డళ్లు, గడ్డపారలతో కాంగ్రెస్ గూండాలు దాడి చేశారు. గాయపడిన అతన్ని సీపీఐ(ఎం) నాయకులు ఖమ్మంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించగా శనివారం ఉదయం మృతిచెందారు.

శనివారం మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించారు. తమ్మినేని వీరభద్రం, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు, పాలడుగు భాస్కర్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు హాజరై మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా జరిగిన సంతాప సభలో తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ.. నాగేశ్వరరావు హత్యను తీవ్రంగా ఖండించారు.

అరాచక వాదులు..



మూర్ఖులు, అరాచక వాదులకు సర్పంచి పదవి కట్టబెడితే అభివృద్ధిని మరిచి అరాచకాలకు, దాడులకు పాల్పడ తారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శనరావు, పాలడుగు భాస్కర్ అన్నారు. సర్పంచ్ ఉమ్మనేని బాబు, అతని కుమారుడు ఉమ్మనేని రమేష్ రౌడీ షీటర్ అని, వారికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. నాగేశ్వరరావును హత్య చేయటంపై సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, మల్లు నందిని సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇసుక అక్రమ వ్యాపారం, గ్రామపంచాయతీ నిధులలో అవినీతి అక్రమాలు, దొంగతనంగా పశువులు అమ్ముకునే తండ్రీ కొడుకులను కాంగ్రెస్ నాయకులు ఎందుకు ప్రోత్సహిస్తున్నారో సమాధానం చెప్పి తీరాలని డిమాండ్ చేశారు. గ్రామాన్ని అశాంతి నిలయంగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. చివర వరకు నాగేశ్వరరావుని బతికించేందుకు అనేక ప్రయత్నాలు చేశామని, కానీ ఫలితం లేకపోయిందని విచారం వ్యక్తం చేశారు. నాగేశ్వర రావు ఆశయ సాధనకు సీపీఐ(ఎం) నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని చెప్పారు.3

జక్కలొద్ది గుడిసెవాసులపై దాడి అమానుషం

- నన్నపునేని నరేందర్ పనితీరు సిగ్గు చేటు :సీపీ(ఐ)ఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, జి.నాగయ్య

నవతెలంగాణ-మట్టెవాడ

జక్కలొద్ది గుడిసెవాసులపై దాడి అమానుషమని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, జి.నాగయ్య అన్నారు. శుక్రవారం వరంగల్ జిల్లా ఉర్సుగుట్టలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో జిల్లా కార్యదర్శి సీహెచ్.రంగయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వీరయ్య మాట్లాడారు. ప్రభుత్వం పేదలకు ఇస్తానన్న డబుల్ బెడ్‌రూం ఇండ్ల హామీ నెరవేర్చలేదన్నారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో జక్కలొద్ది భూపోరాట కేంద్రంలో పేదలు గుడిసెలు వేసుకున్నప్పుడు పోలీసులు దాడులు చేసి తీవ్రంగా కొట్టి గుడిసెలు తొలగించినప్పుడు రాని తూర్పు ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ ఇప్పుడు ఎందుకు వచ్చారని ప్రశ్నించారు. నన్నపునేని నరేందర్ తన అనుచరులను పంపి గుడిసెవాసులను బీఆర్ఎస్ పార్టీలో చేరాలని.. చేరితేనే మీకు సౌకర్యాలు కల్పిస్తామని, లేకపోతే ఈ భూములు మీకు దక్కకుండా చేస్తామని భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు. సీపీఐ(ఎం)పై, నాయకులపైనా దుష్ప్రచారం చేస్తూ గుడిసెవాసుల్లో అనైక్యత తీసుకొస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోని ఎమ్మెల్యే.. ఇప్పుడు ఎన్నికలు రాగానే ఓట్ల రాజకీయాల కోసం ప్రజల మీద దొంగ ప్రేమను చూపించడాన్ని ప్రజలు గ్రహిస్తున్నారని చెప్పారు. జక్కలొద్దిలో గుడిసెలు వేసుకొని జీవిస్తున్న వారిలో 75 శాతం తూర్పు నియోజకవర్గానికి చెందిన ప్రజలు ఉన్నారని, వారి ఓట్లను రాబట్టుకునేందుకే ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు.

దౌర్జన్యాలు సీపీఐ(ఎం)కు కొత్తేమీ కాదు :నాగయ్య

జి.నాగయ్య మాట్లాడుతూ.. భూ పోరాటాలు కమ్యూనిస్టులకు కొత్తేమీ కాదనీ దాడులను, దౌర్జన్యాలను తట్టుకొని వరంగల్ జిల్లాలో 30 వేల మందికి గూడును కల్పించిన చరిత్ర పార్టీకి ఉందని చెప్పారు. దాడులకు దౌర్జన్యాలకు భయపడే వారు సీపీఐ(ఎం) నాయకులు కాదని హెచ్చరించారు. రఘునాథ్, సురేందర్ లాంటి ఎంతోమంది నాయకులు ప్రజల కోసం ప్రాణాలర్పించారని, అలాంటి గడ్డమీద మీరు చేసే ఆగడాలను చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. పేదలకు జాగాలు దక్కేవరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు జగదీష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సింగారపు బాబు, నలగంటి రత్నమాల, ఈసంపల్లి బాబు, ముక్కెర రామస్వామి, కోరబోయిన కుమారస్వామి, భూక్య సమ్మయ్య తదితరులు ఉన్నారు.

టికెట్ల మాదిరిగానే.. రాష్ట్రాన్నీ అమ్మేస్తారు..!

- కాంగ్రెస్‌కు అధికారమిస్తే ఇదే జరుగుతుంది
- మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయం :వైద్యఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్ అర్బన్, ఉట్నూర్

కాంగ్రెస్ వాళ్లకు పోటీ చేయడానికి సత్తా లేక పైసలకు టికెట్లు అమ్ముకున్నారని, వీళ్లకు అధికారమిస్తే రాష్ట్రాన్ని కూడా అమ్మేస్తారని వైద్యఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఓటుకు నోటు దొంగల చేతిలో కాకుండా.. కేసీఆర్ వంటి త్యాగధనుల చేతిలో ఈ రాష్ట్రం ఉండాలన్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్, జిల్లా కేంద్రంలోని డైట్ మైదానంలో శనివారం నిర్వహించిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో ఆయన ప్రసంగించారు. ఆదిలాబాద్, బోథ్, ఖానాపూర్ నియోజకవర్గ అభ్యర్థులు జోగు రామన్న, అనిల్ జాదవ్, జాన్సన్ నాయక్‌ను ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ గాలి వీస్తోందని, మరోసారి కేసీఆర్ సీఎం కావడం ఖాయమని చెప్పారు. ఈ పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో కరువు, కర్ఫ్యూ లేదని గుర్తు చేశారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించామని, జనవరి నుంచి ప్రభుత్వ వేతనాలు వస్తాయని వివరించారు. బీజేపీ, కాంగ్రెస్ వాళ్లు ఎన్ని జిమ్మిక్కులు చేసినా సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ కొట్టడం ఖాయమన్నారు. కర్నాటకలో గెలిచిన కాంగ్రెస్ తమను ఆగం పట్టించిందని అక్కడి రైతులు ఇక్కడికి వచ్చి నిరసన తెలుపుతున్నారని చెప్పారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను గడపగడపకూ తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. బీఆర్ఎస్ మరోసారి అధికారంలోకి రాగానే రూ.5వేల పింఛన్, రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ, రైతుబంధు ఎకరానికి రూ.16వేలు, రూ.400 గ్యాస్ సిలిండర్, సౌభాగ్యలక్ష్మీ పేరిట మహిళలకు నెలకు రూ.3వేల ఆర్థిక సాయం, ఆరోగ్యశ్రీ కింద రూ.15లక్షల వరకు ఉచిత వైద్యం, అసైన్డ్ భూములను పట్టా భూములుగా మార్చి హక్కులు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. కేసీఆర్ బీమా పథకం కింద కోటి కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున వర్తింప జేస్తామని, ముస్లిం, మైనార్టీల కోసం బడ్జెట్‌లో రూ.2200కోట్లు ఖర్చు పెడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్సీ దండె విఠల్, మాజీ శాసనమండలి చైర్మెన్ స్వామిగౌడ్, మాజీ ఎంపీ గోడం నగేష్, మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్, డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, రైతుబంధు అధ్యక్షుడు రోకండ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల తీరు సరికాదు

- ప్రత్యామ్నాయాలపై టీజేఎస్ చర్చ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ నాయకులు తలా ఒకరీతిగా మాట్లాడుతున్న తీరుపై టీజేఎస్ నాయకుల తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. సీఎం కేసీఆర్ నిరంకుశ పాలనకు చరమగీతం పాడేందుకు ప్రతిపక్షాల మధ్య ఓట్ల చీలికను నివారించాలనీ, అందుకోసం అంతా కలిసి పోటీ చేయాలని తెలంగాణ జన సమితి ప్రతిపాదిస్తున్న సంగతి తెలిసిందే. ఆ క్రమంలో టీజేఎస్ అధినేతతో టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు డాక్టర్ మల్లు రవి, తదితరులు చర్చలు జరిపిన సంగతి తెలిసిందే. ఓట్ల చీలిక నివారణ ప్రతిపాదనను మల్లు రవి, ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకులు స్వాగతించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో డాక్టర్ మల్లు రవితో జరిగిన చర్చల సందర్భంగా టీజేఎస్ ఆరు స్థానాలు కోరుకుంటున్నట్టు కాంగ్రెస్ పార్టీ ముందు ప్రతిపాదనలు పెట్టింది. దీనిపై తమ పార్టీలో చర్చించి మరోసారి చర్చించి మరోసారి భేటీ అవుదామని మల్లు రవి తెలిపారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ అధినేత రాహల్ గాంధీ రాష్ట్ర పర్యటన సందర్భంగా కోదండరాం ఆయనతో మర్యాద పూర్వకంగా కలిసి రాష్ట్ర రాజకీయాలను చర్చించారు. అయితే టీజేఎస్‌తో పొత్తు విషయంలో ఏ విషయం తేల్చకుండానే కాంగ్రెస్ పార్టీ దఫాల వారీగా తమ అభ్యర్థులను ప్రకటిస్తూ వస్తున్నది. ఇప్పటి వరకు వంద సీట్లను ప్రకటించింది. అందులోనూ టీజేఎస్ పార్టీ కోరిన సీట్లుండటం, టీజేఎస్‌తో ఎలాంటి సంప్రదింపులు లేకుండా ఏకపక్షంగా ప్రకటించడం పట్ల జన సమితి నాయకులు ఆగ్రహానికి గురవుతున్నారు. కనీస పొత్తు ధర్మాన్ని పాటించకుండా ఒక్కో నాయకుడు ఒక్కో తీరుగా మాట్లాడుతుండాన్ని వారు తీవ్రంగా తప్పుపడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ ఇదే తీరుగా ముందుకెళితే ప్రత్యామ్నాయంగా ఏమి చేయాలనే దానిపై ఇప్పటికే పార్టీలో చర్చిస్తున్నారు. ఇప్పటి వరకు సీఎం కేసీఆర్ నియంతృత్వ అప్రజాస్వామిక పాలనను అంతమొందించడమే లక్ష్యంగా పెట్టుకున్న టీజేఎస్ కాంగ్రెస్‌తో పొత్తుతో వెళ్లాలని భావించింది. అది సాధ్యం కానీ పరిస్థితిలో బీఆర్ఎస్‌ను ఓడించడంతో పాటు తమ ఉనికిని కాపాడుకుండా పార్టీ శ్రేణలకు మనోధైర్యం ఇవ్వాలని భావిస్తున్నది. కాంగ్రెస్‌తో పొత్తు కుదిరితే తాము జహీరాబాద్, సూర్యాపేట, ఎల్లారెడ్డి, ముథోల్, నర్సంపేట, కోరుట్ల స్థానాల్లో పోటీ చేయాలనుకుంటున్న టీజేఎస్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

బీజేపీ బీసీ సీఎం జపం ఎన్నికల జిమ్మిక్కే

- ద్రోహం చేయడమే తెలంగాణకు, కాంగ్రెస్ కు ఉన్న అనుబంధం : కల్వకుంట్ల కవిత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీజేపీ బీసీ సీఎం జపం ఎన్నికల గిమ్మిక్కేనని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఎక్స్ (ట్విట్టర్)లో "ఆస్క్ కవిత" కార్యక్రమంలో నెటిజన్ల ప్రశ్నలకు కల్వకుంట్ల కవిత సమాధానాలిచ్చారు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా ఉన్న బీసీని తప్పించి, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేంద్రంలో బీసీ మంత్రిత్వశాఖను ఏర్పాటు చేసేందుకు నిరాకరించి, బీసీల కులగణన చేపట్టడాన్ని విస్మరించి, మహిళా కోటాలో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించేందుకు నిరాకరించిన బీజేపీ బీసీ జపం ఎన్నికల కోసమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ద్రోహం చేయడమే కాంగ్రెస్ పార్టీకి, తెలంగాణకు ఉన్న అనుబంధమనీ, ఆ పార్టీ గత ఎన్నికల్లోనూ సర్వేల్లో గెలిచినట్టు ప్రచారం చేసుకుందని గుర్తుచేశారు. బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం సాధిస్తుందనీ, వంద స్థానాల్లో గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బాధ్యత ఉన్న ప్రభుత్వాన్ని, భరోసా ఇచ్చే నాయకుడిని ఆశీర్వదించి మళ్లీ ఎన్నుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మహిళా రిజర్వేషన్ల చట్టం పోస్ట్ డేటెడ్ చెక్కులాంటిదని ఆమె తెలిపారు. ఈ ఎన్నికల నుంచే మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని సీఎం కేసీఆర్ కోరితే, కాంగ్రెస్ పార్టీ ప్రేక్షక పాత్ర వహించిందని విమర్శించారు. చంద్రబాబు నాయుడు అరెస్టు కావడం దురదృష్టకరమని, ఆయన కుటుంబ సభ్యులు అనుభవిస్తున్న బాధను తాను అర్థంచేసుకోగలనని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ అధికారంలో ఉంటే కల్వకుంట్ల కుటుంబసభ్యులే సీఎంలు

- బీజేపీ నేతలు ఈటల, లక్ష్మణ్ విమర్శ



నవతెలంగాణ-హైదరబాద్‌బ్యూరో

బీఆర్ఎస్ అధికారంలో ఉన్నన్నాళ్లు కల్వకుంట్ల కుటుంబసభ్యులే ముఖ్యమంత్రులుగా ఉంటారనీ, ఆపార్టీలో మరొకరిని ఆ స్థానంలో చూడలేమని బీజేపీ సీనియర్ నేతలు డాక్టర్ కే లక్ష్మణ్, ఈటల రాజేందర్ అన్నారు. శనివారంనాడిక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దేశానికి ఓబీసీ ప్రధానిని అందించిన ఘనత బీజేపీదే అని అన్నారు. బీఆర్ఎస్ గతంలో దళితుడు ముఖ్యమంత్రి అని ప్రకటించి, అమలు చేయలేదన్నారు. ఈసారి రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీని ముఖ్యమంత్రి చేస్తామని ధైర్యంగా ప్రకటించామని చెప్పారు. బీఆర్ఎస్‌లో పార్టీ అధ్యక్ష పదవిలోనూ కల్వకుంట్ల కుటుంబ సభ్యులే ఉంటారని విమర్శించారు. తెలంగాణ వస్తే బడుగులకు అధికారం, జీవితాల్లో వెలుగు వస్తుందన్నారనీ కానీ ఒక్క కుటుంబంలో మాత్రమే వెలుగు వచ్చిందన్నారు. వారికి అధికారం ఇచ్చిన ప్రజల బతుకులు ఆగమయ్యాయన్నారు. బీసీల పట్ల బీఆర్ఎస్‌కు చులకనభావం, చిన్నచూపు ఉందన్నారు. గిరిజన బిడ్డను రాష్ట్రపతి చేసిన ఘనత బీజేపీదే అనీ, కేంద్రంలో 70 శాతానికి పైగా అణగారిన వర్గాలకు చోటుదక్కిందని చెప్పారు. కుటుంబ పాలనకు ప్రజలు చరమగీతం పాడాలనీ, అవినీతి రహిత పాలన కోసం బీజేపీని గెలిపించాలని కోరారు.

టిప్పర్ ఢీకొని 90 గొర్రెలు మృత్యువాత

నవతెలంగాణ-నాగార్జునసాగర్

టిప్పర్ ఢీకొని సుమారు 90 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన శనివారం నాగార్జునసాగర్ దయ్యాలగండి వద్ద జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

టిప్పర్ దయ్యాలగండి వద్ద ఆగి ఉన్న కారు, అంబులెన్స్‌ను ఢీకొని మాచర్ల నుంచి నల్లగొండ వెళ్తున్న గొర్రెల మందపైకి దూసుకెళ్లింది. ఎదురుగా వస్తున్న మార్కాపురం ఆర్టీసీ బస్సుకు తాకి ఆగడంతో పెను ప్రమాదం తప్పింది. ఎవరికి ఎటువంటి ప్రమాదమూ జరగలేదు. గొర్రెల మందపైకి టిప్పర్ దూసుకెళ్లడంతో సుమారు 90గొర్రెలు మృత్యువాతపడ్డాయి. ఈ మేరకు పోలీసులు కేసు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అవమానించారు... ఎన్నికల్లో పోటీ చేయను

- మాజీ ఎమ్మెల్యే బాబూమోహన్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

బీజేపీలో తనకు అనేక అవమానాలు జరిగాయనీ, అందువల్ల వచ్చే ఎన్నికల్లో తాను పోటీచేయట్లేదని బీజేపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే బాబుమోహన్ అన్నారు. ఎన్నికలు, పార్టీ ప్రచారాలకు దూరంగా ఉంటాననీ, పార్టీకి కూడా రాజీనామా చేస్తానని చెప్పారు. శనివారంనాడిక్కడి ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో తన కుమారుడికి టికెట్ ఇస్తున్నట్టు ప్రచారం చేసి, తమ మధ్య విభేదాలు సృష్టించేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. అర్హులకే టికెట్ ఇవ్వాలనీ, పార్టీలో చాలా అవమానాలు జరిగాయనీ, ఆత్మాభిమానం దెబ్బతినడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నానని అన్నారు. బీజేపీ జాబితాలో తన పేరు లేకపోవడంతో తప్పుడు ప్రచారాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. తాను ఫోన్ చేస్తే పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎత్తరనీ, కావాలనే తనను పార్టీకి దూరం పెట్టారని ఆరోపించారు.

డీఎస్సీకి ఆదరణ కరువు

గతం కంటే లక్షకుపైగా తగ్గిన దరఖాస్తులు

- ఈసారి 1.76 లక్షల మంది అప్లై
- టెట్ కంటే మరింత తక్కువ
- 5,089 ఉపాధ్యాయ ఖాళీల భర్తీకే నోటిఫికేషన్
- అన్ని జిల్లాల్లో పలు సబ్జెక్టులకు స్కూల్ అసిస్టెంట్ పోస్టులే లేవు
- ఎస్జీటీ పోస్టులకు బీఎడ్ వారికి అవకాశం లేదు
- ముగిసిన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించిన జిల్లా నియామక కమిటీ (డీఎస్సీ)కి ఆదరణ కరువైంది. బీఎడ్, డీఎడ్ పూర్తి చేసి టెట్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఎక్కువ మంది దరఖాస్తు చేసేందుకు ఆసక్తిని కనబరచలేదు. అందుకే గతం కంటే లక్షకు పైగా దరఖాస్తులు తగ్గడం గమనార్హం. 2017, అక్టోబర్ 21న 8,792 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే. అప్పుడు రాష్ట్రవ్యాప్తంగా 2,77,574 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. మళ్లీ ఆరేండ్ల తర్వాత ఉపాధ్యాయ నియామకాలకు ప్రభుత్వం నోటిఫికేషన్‌ను జారీ చేసింది. బీఎడ్, డీఎడ్ పూర్తి చేసిన అభ్యర్థులు పెరిగారు. ఆరేండ్ల తర్వాత నోటిఫికేషన్ రావడంతో అభ్యర్థులు పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేయాల్సి ఉంది. కానీ ఆశించిన స్థాయిలో స్పందన కరువైంది. ఉపాధ్యాయ పోస్టులు తక్కువగా భర్తీ చేస్తుండడమే ఇందుకు కారణంగా ఉన్నది. అన్ని జిల్లాల్లో పలు సబ్జెక్టులకు సంబంధించి స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) పోస్టులే లేవు. పోస్టుల్లేకపోవడంతో అభ్యర్థులు ఎక్కువ మంది దరఖాస్తు చేయలేదు. ఎస్ఏ, సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ), ఎల్పీ, పీఈటీ పోస్టులకు సంబంధించి కొన్ని రిజర్వేషన్ కేటగిరీల వారికి కొన్ని జిల్లాల్లో పోస్టులు లేకపోవడం, ఒకవేళ ఉన్నా అతి తక్కువగా ఉన్నాయి. అందుకే ఈసారి కేవలం 1,79,297 మంది ఫీజు చెల్లించారు. వారిలో 1,76,530 మంది దరఖాస్తు చేశారు. అంటే గతసారి కంటే ఇప్పుడు 1,01,044 దరఖాస్తులు తగ్గడం గమనార్హం.

తక్కువ పోస్టులే ప్రధాన కారణం

రాష్ట్రంలో 5,089 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జిల్లాస్థాయి నియామక కమిటీ (డీఎస్సీ) నోటిఫికేషన్‌ను పాఠశాల విద్యాశాఖ సెప్టెంబర్ ఆరో తేదీన విడుదల చేసిన విషయం తెలిసిందే. గతనెల 20 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఆన్‌లైన్‌లో ప్రారంభమైంది. శనివారంతో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ముగిసింది. ఇప్పటి వరకు 1,76,530 మంది దరఖాస్తు చేశారు. అయితే రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వచ్చేనెల 20 నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో జరిగే రాతపరీక్షలను విద్యాశాఖ వాయిదా వేసింది. వచ్చే ఏడాది జనవరి చివరి వారంలో లేదా ఫిబ్రవరి మొదటి వారంలో డీఎస్సీ రాతపరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించాలని విద్యాశాఖ అధికారులు సమాలోచన చేస్తున్నారు. డీఎస్సీకి తక్కువ దరఖాస్తులు రావడానికి ప్రధాన కారణం తక్కువ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడమే. అందులోనూ సగానికిపైగా పోస్టులు మహిళలకే ఉన్నాయి. కొన్ని సబ్జెక్టుల పోస్టులు చాలా జిల్లాల్లో అందుబాటులో లేవు. ఎస్జీటీ పోస్టులకు బీఎడ్ పూర్తి చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసేందుకు అవకాశం లేదు. తక్కువ పోస్టులున్నా దరఖాస్తు ఫీజు రూ.వెయ్యి ఉన్నది. డీఎస్సీకి దరఖాస్తులు తగ్గడానికి ఇలా అనేక కారణాలున్నాయి. అందుకే 2,575 సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ) పోస్టులకు 66,083 మంది, 611 లాంగ్వేజ్ పండితులు (ఎల్పీ) పోస్టులకు 12,270 మంది, 164 ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ (పీఈటీ) పోస్టులకు 6,789 మంది, 1,739 స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) పోస్టులకు 91,388 మంది కలిపి మొత్తం 5,089 ఉపాధ్యాయ పోస్టులకు 1,76,530 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు

టెట్ కంటే డీఎస్సీకే తక్కువ దరఖాస్తులు

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు వచ్చిన ఆదరణ కూడా డీఎస్సీకి రాలేదు. టెట్ రాసేదే ఉపాధ్యాయ పోస్టులను సాధించడం కోసం. అలాంటి ఉపాధ్యాయ ఖాళీలకు నోటిఫికేషన్ వచ్చినా అభ్యర్థుల నుంచి సరైన స్పందన రాకపోవడం గమనార్హం. గతనెల 15న టెట్ పేపర్-1కు 2,69,557 మంది దరఖాస్తు చేస్తే వారిలో 2,23,582 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వారిలో 82,489 (36.89 శాతం) మంది అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించారు. పేపర్-2కు 2,08,498 మంది దరఖాస్తు చేయగా, వారిలో 1,90,047 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. వారిలో 29,073 (15.30 శాతం) మంది అభ్యర్థులు ఉత్తీర్ణత పొందారు. టెట్ పేపర్-1, పేపర్-2కు భారీ సంఖ్యలో దరఖాస్తులొచ్చాయని పై గణాంకాలే నిదర్శనం. కానీ డీఎస్సీకి దరఖాస్తు చేసేందుకు అభ్యర్థులు విముఖత చూపారు. కేవలం 1,76,530 దరఖాస్తులు రావడమే ఇందుకు నిదర్శనం.

ఉపాధ్యాయ పోస్టులు, దరఖాస్తుల వివరాలు

కేటగిరీ	టీఆర్టీ-2017		డీఎస్సీ-2023	
	పోస్టులు	దరఖాస్తులు	పోస్టులు	దరఖాస్తులు
ఎస్ఏ	1,941	1,45,158	1,739	91,388
ఎస్జీటీ	5,415	89,149	2,575	66,083
ఎల్పీ	1,011	24,219	611	12,270
పీఈటీ	416	16,871	164	6,789
ఎస్ఏపీఈ	09	2,177	--	--
మొత్తం	8,792	2,77,574	5,089	1,76,530



2023 ఐసీసీ ప్రపంచకప్ ప్రీ టోర్నీ టైటిల్ ఫేవరేట్లు భారత్, ఇంగ్లాండ్. మెగా ఈవెంట్‌లో భారత్, ఇంగ్లాండ్ మ్యాచ్‌పై ఎన్నో అంచనాలు ఉండేవి. టోర్నీ మొదలైంది, ఇరు జట్లు ఐదేసి మ్యాచులు ఆడేశాయి. కానీ ఆరంభంలో మ్యాచ్‌పై ఉన్న ఆసక్తి ఇప్పుడు లేదు!. ఆతిథ్య భారత్ వరుసగా ఐదు మ్యాచుల్లో విజయాలు సాధించి సెమీస్ దారిలో దూసుకెళ్తుండగా.. ఇంగ్లాండ్ నాలుగు పరాజయాలతో టోర్నీ నుంచి నిష్క్రమించే ప్రమాదంలో పడింది. నేడు లక్నోలో టీమ్ ఇండియా 'ఆరో విజయం'పై కన్నేయగా.. ఇంగ్లాండ్ గెలుపు బాట పట్టాలనే తపనతో కనిపిస్తుంది. ప్రపంచకప్ గ్రూప్ దశలో భారత్, ఇంగ్లాండ్ సమరం నేడు.



సిక్సర్ కొట్టాలని..!

- భారత్, ఇంగ్లాండ్ ఢీ నేడు
- ఆరో విజయంపై రోహిత్‌సేన గురి
- గెలుపు బాట తపనలో బట్లర్‌సేన

మ॥ 2 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

నవతెలంగాణ-లక్నో

టీమ్ ఇండియాకు ఎదురుందా? :

ప్రపంచకప్‌లో ఆతిథ్య భారత్ ప్రణాళికబద్ధంగా ప్రత్యర్థులను మట్టికరిపిస్తుంది. ఐదు మ్యాచుల్లో ఐదు విజయాలు సాధించిన రోహిత్‌సేన టోర్నీలో ఏకైక అజేయ జట్టుగా కొనసాగుతోంది. ఇటు బ్యాట్‌తో, అటు బంతితో భారత్ ఆధిపత్యం సుస్పష్టం. కెప్టెన్ రోహిత్ శర్మ బ్యాట్‌తో దండయాత్రను నడిపిస్తున్నాడు. పవర్‌ప్లేలో రోహిత్ శర్మ స్ట్రయిక్‌రేట్ 134.01. ఆరంభంలోనే ఎడాపెడా పరుగులు పిండుకుంటున్న ఓపెనర్లు.. భారీ స్కోరుకు గట్టి పునాది వేయటంతో పాటు ప్రత్యర్థి బౌలర్లపై మానసికంగా పైచేయి సాధిస్తున్నారు. విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్, కెఎల్ రాహుల్ మిగతా పని పూర్తి చేస్తున్నారు. ఇక బంతితో జశ్‌ప్రీత్ బుమ్రా కథ నడిపిస్తున్నాడు. తొలి పది ఓవర్లలో బుమ్రా ఎకానమీ 2.90. ప్రత్యర్థి ఓపెనింగ్ జోడీపై ఎనలేని ఒత్తిడి పెంచుతున్న బుమ్రా.. మరో ఎండ్‌లో వికెట్ల వేటకు మార్గం సుగమం చేస్తున్నాడు. కొత్త బంతితో పేసర్లు, ఆ తర్వాత స్పిన్నర్లు మాయ చేస్తుండటంతో భారత్‌కు ఎదురే ఉండటం లేదు. ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య లేకుండా మరో మ్యాచ్‌కు సిద్ధమైన భారత్.. స్పిన్‌కు అనుకూలించే లక్నోలో రవిచంద్రన్ అశ్విన్‌ను తుది జట్టులోకి తీసుకునే ఆలోచనలో ఉంది. కానీ ఇద్దరు పేసర్లతో ఆడటం ప్రమాదకర ఎత్తుగడ కానుండటంతో.. షమి, సూర్యలు తుది జట్టులో చోటు నిలుపుకోనున్నారు.

గెలుపు బాట పడతారా? :

డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లాండ్ ఐదు మ్యాచుల్లో చేయగల్గినంతా చేసేసింది. అందుబాటులో ఉన్న 15 మంది ఆటగాళ్లను ప్రయోగించింది. చివరకు వైస్ కెప్టెన్‌ను సైతం పక్కనపెట్టింది. అయినా, ఆ జట్టుకు ఏదీ కలిసి రావటం లేదు. ఐదు మ్యాచుల్లో నాలుగు ఓటములు చవిచూసిన బట్లర్‌సేన.. నేడు భారత్‌తో ఓడితే టోర్నీ నుంచి అధికారంగానే నిష్క్రమించనుంది!. జట్టు ప్రదర్శనకు కెప్టెన్ జోశ్ బట్లర్ వైఫల్యం తోడైంది. ఐదు ఇన్నింగ్స్‌ల్లో బట్లర్ 95 పరుగులే చేశాడు. నాయకుడిగా అఫ్గాన్, సఫారీలతో మ్యాచుల్లో తొలుత బ్యాటింగ్ ఎంచుకోవటం సైతం విమర్శలకు దారితీసింది. టైటిల్ ఫేవరేట్‌గా బరిలో నిలిచి.. నిష్క్రమించే తొలి జట్టుగా నిలిచే ప్రమాదంలో పడిన ఇంగ్లాండ్ ఆఖరుకు భయమెరుగని, బాధ్యతలేని ఆటతీరును సైతం పరీక్షించుకుంది. అయినా, ఆ జట్టుకు విజయం దక్కటం లేదు. నేడు ఆతిథ్య భారత్‌తో పోరులో పుంజుకోవాలని ఆ జట్టు భావిస్తోంది. బెయిర్‌స్టో, మలాన్, బెన్ స్టోక్స్, హ్యారీ బ్రూక్‌లు ఇంగ్లాండ్‌కు కీలకం కానున్నారు. మోయిన్ అలీ మరోసారి బెంచ్‌కు పరిమితం కానున్నాడు.

పిచ్, వాతావరణం :

లక్నో ఎకాన మైదానం సంప్రదాయంగా స్పిన్ స్వర్గధామం. ప్రపంచకప్‌లో ఇక్కడ జరిగిన మూడు మ్యాచుల్లో స్పిన్నర్ల ఎకానమీ 4.79 కాగా, పేసర్ల ఎకానమి 5.63గా నమోదైంది. కానీ భారత్, ఇంగ్లాండ్ మ్యాచ్‌కు ఎర్ర మట్టితో తయారు చేసిన పిచ్‌ను సిద్ధం చేశారు. పిచ్‌పై కాస్త పచ్చిక సైతం కనిపిస్తుంది. దీంతో ఆదివారం లక్నోలో పేసర్లు హవా చూపించే అవకాశం లేకపోలేదు. మ్యాచ్‌కు ఎటువంటి వర్షం సూచనలు లేవు. మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రతలు ఉన్నప్పటికీ..సాయంత్రానికి వాతావరణం చల్లబడనుంది. టాస్ నెగ్గిన జట్టు ఛేదనకు మొగ్గుచూపవచ్చు.

తుది జట్లు (అంచనా) :

భారత్ : రోహిత్ శర్మ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్, కెఎల్ రాహుల్ (వికెట్ కీపర్), సూర్యకుమార్ యాదవ్, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, మహ్మద్ షమి, జశ్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్.

ఇంగ్లాండ్ : జానీ బెయిర్‌స్టో, డెవిడ్ మలాన్, జో రూట్, బెన్ స్టోక్స్, జోశ్ బట్లర్ (కెప్టెన్, వికెట్ కీపర్), హ్యారీ బ్రూక్, లియాం లివింగ్‌స్టోన్, క్రిస్ వోక్స్, డెవిడ్ విల్లే, అటిక్సన్, ఆదిల్ రషీద్.

సిరాజ్ మెరిసేనా..!

వరల్డ్ నం.1 బౌలర్‌గా వరల్డ్‌కప్ వేటను షురూ చేసిన హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్.. గ్రూప్ దశ ఐదు మ్యాచుల్లో నిరాశపరిచాడు. ప్రపంచకప్ ఆరంభానికి ముందు ఈ ఏడాది 14 మ్యాచుల్లో 30 వికెట్లు పడగొట్టిన సిరాజ్.. మెగా టోర్నీలో కేవలం ఆరు వికెట్లే తీసుకున్నాడు. 4.91 ఎకానమీతో ప్రతి మూడో ఓవర్లో ఓ వికెట్ పడగొట్టిన సిరాజ్.. ఇప్పుడు వికెట్ల వేటలో వెనకబడ్డాడు. కీలక సెమీఫైనల్స్ ముంగిట సిరాజ్ ఫామ్ అందుకోకుంటే తుది జట్టు ఎంపికలో షమి నుంచి తీవ్ర పోటీ ఎదుర్కొవాల్సి ఉంటుంది.



కివీస్ పోరాడినా..!

- పరుగుల పండుగలో ఆసీస్ పైచేయి
- 5 పరుగుల తేడాతో ఉత్కంఠ విజయం

ధర్మశాల (హిమాచల్ ప్రదేశ్) : ప్రపంచకప్‌లో పరుగుల పండుగ. అభిమానులకు ఆసీస్, కివీస్ అదిరే మ్యాచ్‌ను అందించాయి!. తొలుత ఆస్ట్రేలియా 388 పరుగులు చేయగా.. ఛేదనలో న్యూజిలాండ్ 383 పరుగులతో గెలుపు వాకిట వరకు వచ్చింది. 771 పరుగులు నమోదైన మ్యాచ్‌లో ఆఖర్లో అద్భుత ఫీల్డింగ్ నైపుణ్యంతో ఆస్ట్రేలియా 5 పరుగుల తేడాతో గెలుపొందింది. ఆసీస్‌కు ఇది వరుసగా నాల్గో విజయం కాగా.. న్యూజిలాండ్‌కు వరుసగా రెండో ఓటమి. తొలుత ఓపెనర్ ట్రావిశ్ హెడ్ (109, 67 బంతుల్లో 10 ఫోర్లు, 7 సిక్సులు) విధ్వంసం సృష్టించాడు. అతడికి డెవిడ్ వార్నర్ (81, 65 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్సులు) తోడయ్యాడు. ఓపెనర్ల దెబ్బకు 23.2 ఓవర్లలోనే 200 పరుగులు చేసిన ఆసీస్.. మిడిల్ ఆర్డర్ బ్యాటర్ల సహకారంతో 388 పరుగుల భారీ స్కోరు సాధించింది. మార్ష్ (36), స్మిత్ (18), లబుషేన్ (18), మాక్స్‌వెల్ (41), ఇంగ్లిశ్ (38), కమిన్స్ (37) రాణించారు. కివీస్ బౌలర్లలో బౌల్ట్, ఫిలిప్స్ మూడు వికెట్లు పడగొట్టారు. ఛేదనలో రచిన్ రవీంద్ర (116, 89 బంతుల్లో 9 ఫోర్లు, 5 సిక్సులు) చెలరేగాడు. డార్లీ మిచెల్ (54), జేమ్స్ నీషమ్ (58) సైతం చెలరేగటంతో న్యూజిలాండ్ గెలుపు దిశగా దూసుకెళ్లింది. చివరి ఓవర్లో 19 పరుగులు అవసరం కాగా.. నీషమ్ బౌండరీ కోసం ప్రయత్నించినా ఆసీస్ మెరుపు ఫీల్డింగ్‌తో రెండు ఫోర్లు నిలువరించింది. ఆఖరు బంతికి ఆరు పరుగులు అవసరం కాగా.. న్యూజిలాండ్ ప్రయత్నం వృథా అయ్యింది. ట్రావిశ్ హెడ్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు.

భారత్ 111

ఆసియా పారా క్రీడల్లో ఉత్తమ ప్రదర్శన



హాంగ్జౌ : ఆసియా పారా క్రీడల్లో టీమ్ ఇండియా పారా అథ్లెట్లు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు. పోటీల చివరి రోజు పతక శతకం అందుకున్న భారత్.. ఓవరాల్‌గా 111 మెడల్స్ సొంతం చేసుకుంది. 2018 జకర్తా ఆసియా పారా క్రీడల్లో 72 పతకాలే భారత్‌కు ఇప్పటివరకు అత్యధికం. హాంగ్జౌలో 29 పసిడి, 31 రజతాలు, 51 కాంస్య పతకాలు సొంతమయ్యాయి. హాంగ్జౌకు 303 పారా అథ్లెట్లను (191 పురుషులు, 112 మహిళలు) పంపిన భారత్.. పతకాల పట్టికలో ఐదో స్థానంలో నిలిచింది. చైనా, ఇరాన్, జపాన్, దక్షిణ కొరియాలు టాప్-4లో నిలిచాయి. ఆతిథ్య చైనా 521 పతకాలు గెలుపొందగా అందులో 214 పసిడి పతకాలు ఉన్నాయి. శనివారం పోటీల్లో మెన్స్ టీ-47 400 మీటర్ల ఈవెంట్‌లో దిలిప్ గావిట్ పసిడి పతకం సాధించి భారత్ వంద పతకాల మార్క్ అందుకునేలా చేశాడు.

బంగ్లాపై డచ్ గెలుపు

కోల్‌కత : ప్రపంచకప్‌లో నెదర్లాండ్స్ మరో విజయం సాధించింది. దక్షిణాఫ్రికాకు షాకిచ్చిన డచ్.. ఈడెన్‌గార్డెన్స్‌లో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసింది. తొలుత 229 పరుగులు చేసిన నెదర్లాండ్స్.. ఛేదనలో బంగ్లాదేశ్‌ను 142 పరుగులకే కుప్పకూల్చింది. 87 పరుగుల తేడాతో గ్రూప్ దశలో రెండో విజయం అందుకుంది. స్కాట్ ఎడ్వర్డ్స్ (68), వెస్లీ బారెసి (41), సైబ్రాండ్ (35)లు డచ్‌కు మంచి స్కోరు అందించారు. పాల్ వాన్ మీకెరన్ (4/23), లీడె (2/25) నిప్పులు చెరుగగా బంగ్లాదేశ్ 42.2 ఓవర్లలోనే చేతులెత్తేసింది. బంగ్లా తరఫున మెహిది (35), మహ్మదుల్లా (20), ముస్తాఫిజుర్ (20) పరుగులు చేశారు.

స్ఫూర్తినిచ్చే వ్యక్తులకు నివాళి..



విజయ్ రామరాజు

విక్రాంత్ రుద్ర దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'అర్జున్ చక్రవర్తి.. జర్నీ ఆఫ్ యాన్ అన్‌సంగ్ ఛాంపియన్". శ్రీని గుబ్బల నిర్మాత. నటుడు విజయ రామరాజు, సిజా రోజ్, అజయ్, దయానంద్ రెడ్డి, అజయ్ ఘోష్, దుర్గేష్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రం 1980లలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించిన కబడ్డీ ఆటగాడి నిజ జీవిత కథ ఆధారంగా రూపొందుతోంది. ఇదొక క్రీడాకారుడి జీవితంలోని కష్టాలను, విజయాలను సహజంగా కళ్ళకు కట్టినట్టు చూపిస్తూ సాగే చిత్రం. శుక్రవారం ఈ చిత్రం నుంచి విజయ రామరాజు ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు మేకర్స్.

నిర్మాత శ్రీని గుబ్బల మాట్లాడుతూ, "ఇది కేవలం సినిమా మాత్రమే కాదు, సవాళ్లను అధిగమించి, మనందరికీ స్ఫూర్తినిచ్చే వ్యక్తులకి నివాళి అని మేం నమ్ముతున్నాము. పోరాటతత్వం, సంకల్పం, కలల సాధన గురించి తెలిపే కథ. ఈ చిత్రం ద్వారా మేం మానవ సంకల్ప శక్తిని వెండితెరపై ఆవిష్కరించాలనుకుంటున్నాం. నటీనటుల నటన అలాగే సినిమాటోగ్రఫీ నుండి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ వరకు ఈ చిత్రంలోని ప్రతి అంశం ప్రేక్షకులకు సినిమాలో లీనమయ్యేలా చేస్తూ భావోద్వేగ అనుభవాన్ని అందించేలా ఉంటుంది' అని తెలిపారు.

'స్ఫూర్తిదాయకమైన చిత్రానికి దర్శకత్వం వహించడం గౌరవంగా భావిస్తున్నాను. 'అర్జున్ చక్రవర్తి' కథకు జీవం పోసే ప్రయాణం అపురూపమైనది. అర్జున్ చక్రవర్తి పాత్రని విజయ్ రామరాజు అద్భుతంగా పోషించారు. ఆయన నటనకు ప్రేక్షకులు కదిలిపోతారని, స్ఫూర్తి పొందుతారని మేం ఆశిస్తున్నాం' అని దర్శకుడు విక్రాంత్ రుద్ర చెప్పారు. తెలుగు, తమిళ భాషలలో ఏకకాలంలో నిర్మితమైన ఈ సినిమా హిందీ, మలయాళం, కన్నడ భాషలలో అనువాదమై, పాన్-ఇండియా విడుదలకు సిద్ధమవుతోంది.

నరనరమున.. నీ తలపే



కార్తీక మురళీధరన్, యష్

'బలగం' వంటి మంచి విజయం సాధించిన సినిమా తర్వాత దిల్ రాజు ప్రొడక్షన్ హౌస్ నుంచి వస్తున్న తాజా చిత్రం 'ఆకాశం దాటి వస్తావా'. ఈ సినిమాతో కొరియోగ్రాఫర్ యష్ హీరోగా పరిచయం అవుతున్నారు. మలయాళ నటి కార్తీక మురళీధరన్ హీరోయిన్‌గా నటిస్తోంది. శశి కుమార్ ముతులూరి దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ సినిమా ఒక మ్యూజికల్ డాన్స్ బేస్డ్ లవ్ స్టోరీ. రీసెంట్‌గా ఫస్ట్ సాంగ్ 'ఉన్నానో లేనో...' రిలీజ్ చేశారు. దీనికి ముందు విడుదల చేసిన ఆ సాంగ్, సినిమా టీజర్ ప్రేక్షకులు అందరిని ఆకట్టుకున్నాయి.

శుక్రవారం సినిమాలోని రొమాంటిక్ మెలోడీగా రూపొందించిన సెకండ్ సింగిల్ 'నరనరమున.. నీ తలపే.. శృంగార...'ను విడుదల చేశారు. ఈ పాటను సంజిత్ హెగ్డే, మాళవికా శంకర్ ఆలపించారు. మ్యూజిక్ డైరెక్టర్ కార్తీక్ తన అద్భుతమైన గాత్రంతో పాటకు ప్రాణం పోశారు. దర్శకుడు శశి కుమార్ ముతులూరి ఈ సాంగ్ రాయడం విశేషం. ఇందులో హీరో, హీరోయిన్లు యష్, కార్తీక మురళీధరన్ మధ్య కెమిస్ట్రీ అందంగా ఉంది. ప్రేమ జంట మధ్య ఎటువంటి అవధులు లేని స్వచ్ఛమైన రొమాన్స్ ఈ పాటలో చూపించారని చెప్పొచ్చు. ప్రేక్షకులకు ఈ పాట చక్కటి కనువిందు చేస్తుందని చెప్పడంలో ఎటువంటి సందేహం అవసరం లేదు. శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షితా రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

నవచిత్రం

ఇద్దరం ఒకటే..నేస్తమా



రష్మిక మందన్నా, రణబీర్ కపూర్

చార్ట్ బస్టర్ నెంబర్ 'అమ్మాయి' తర్వాత ప్రేక్షకులు, సంగీత ప్రియులకు మరింత ఉత్సాహన్ని ఇస్తూ 'యానిమల్' సెకండ్ సింగిల్ 'నే వేరే' పాటని శుక్రవారం విడుదల చేశారు మేకర్స్. హ్యూమన్ ఎమోషన్స్‌ని సరికొత్తగా హార్ట్ హిట్టింగ్‌గా ప్రజెంట్ చేస్తూ, వివాహం తర్వాత తలెత్తే సంక్లిష్టమైన విభేధాలని ఈ సోల్ ఫుల్ ట్రాక్‌లో చూపించారు.

కార్తీక్ పాడిన 'నే వేరే' పాట.. లీడ్ పెయిర్ రణబీర్ కపూర్, రష్మిక మధ్య అనుబంధం, విభేదాలను లోతుగా ఎక్స్‌ప్లోర్ చేస్తోంది. ఈ పాటని శ్రేయాస్ పురాణిక్ స్వరపర్చగా, అనంత శ్రీరామ్ రాసిన సాహిత్యం ప్రేమలోని సంక్లిష్టమైన అంశాలను హత్తుకునేలా చూపించింది. ఈ ట్రాక్ మానవ వ్యక్తిత్వ, విభిన్న కోణాలను రివీల్ చేస్తూ 'యానిమల్' కోర్‌కి అద్దం పడుతుంది. ఈ ట్రాక్ సాంప్రదాయ సరిహద్దులను దాటి సినిమా తాలూకా ఆకర్షణీయమైన, ఆలోచింపజేసే కథనంలో గ్లింప్స్‌ని ప్రజెంట్ చేస్తోంది.

రణబీర్ కపూర్, రష్మిక మందన్న, అనిల్ కపూర్, బాబీ డియోల్ తదితరులు నటించిన క్రైమ్ డ్రామా 'యానిమల్'ని భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్ టి-సిరీస్, మురాద్ ఖేతాని సినీ1 స్టూడియోస్, ప్రణయ్ రెడ్డి వంగా భద్రకాళి పిక్చర్స్ పై నిర్మిస్తునారు. డిసెంబర్ 1న హిందీ, తెలుగు, తమిళం, కన్నడ, మలయాళంలో ఈ సినిమా విడుదల కానుంది.

రేజ్ ఆఫ్ తీక్షణ..

ప్రియాంక ఉపేంద్ర నటిస్తున్న 50వ చిత్రం 'డిటెక్టివ్ తీక్షణ'. త్రివిక్రమ్ రఘు దర్శకత్వంలో నిర్మాతలు గుత్తా ముని ప్రసన్న, ముని వెంకట చరణ్, పురుషోత్తం. బి.కో యురు, ఈవెంట్ లింక్స్ ఎంటర్టైన్మెంట్, ఎస్‌డిసి సినీ క్రియేషన్స్ బ్యానర్లపై ఈ చిత్రాన్ని నిర్మించారు. భయంకరమైన హత్యల నేపథ్యంలో డిటెక్టివ్ తీక్షణగా ప్రియాంక ఉపేంద్ర ఈ కేసును సాల్వ్ చేయడానికి రంగంలోకి దిగుతుంది. థ్రిల్లింగ్, యాక్షన్, ఎమోషనల్ ఎలిమెంట్స్ మేళవింపుతో ఈ సినిమా తెరకెక్కింది. యాక్షన్ సన్నివేశాలలో కూడా ప్రియాంక ఉపేంద్ర తన స్టంట్స్‌తో మెప్పించారు. ట్రైలర్ సినిమా మీద అంచనాలను మరింతగా పెంచింది. శనివారం ఈ చిత్రంలోని ఫస్ట్ సింగిల్.. రేజ్ ఆఫ్ తీక్షణ'ను మేకర్స్ విడుదల చేశారు.



ప్రియాంక ఉపేంద్ర

'రణరణమున రథము నిలిపి, రుధిర నదిని ఎదురు మలిపి.. కుత్తుకల కోట కూల్చే తీక్షణా.. కణకణమున యుద్ధ నీతి, కనికరమే లేని యువతి క్రూర కథల కత్తివేటు తీక్షణా..' అంటూ సాగే ఈ ఎనర్జిటిక్ సాంగ్‌లో తీక్షణ తను అనుకున్నది సాధించేందుకు ఎంతకైనా తెగించే తీరుని రేజ్ ఆఫ్ తీక్షణ పాట రూపంలో వివరించారు. ఈ పాటకు లిరిక్స్, సంగీతం పెద్దపల్లి రోహిత్ అందించగా, హైమత్ మొహమ్మద్, సాయి చరణ్ భాస్కరుని, అరుణ్ కౌండిన్య ఆలపించారు. శక్తి గ్రఫిస్టే క్రియేట్ చేసిన లిరికల్ వీడియో కూడా ఆకట్టుకునే యానిమేషన్‌తో, ఆసక్తికరమైన మేకింగ్ వీడియోతో రూపొందించారు. పాన్ ఇండియా సినిమాగా తెరకెక్కిన ఈ చిత్రాన్ని కన్నడ, తెలుగు, హిందీ, తమిళ, మలయాళం, బెంగాలీ, ఒరియా వంటి ఏడు భాషల్లో విడుదల చేయడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

ప్రతి 15 నిమిషాలకు థ్రిల్ అవుతారు..

సత్యం రాజేష్, డా. కామాక్షి భాస్కర్ల హీరో, హీరోయిన్లుగా నటించిన చిత్రం 'మా ఊరి పొలిమేర-2'. గౌరు గణబాబు సమర్పణలో గౌరికృష్ణ నిర్మాతగా రూపొందుతున్న ఈ చిత్రానికి డా.అనిల్ విశ్వనాథ్ దర్శకుడు. 'మా ఊరి పొలిమేర' చిత్రానికి సీక్వెల్‌గా రూపొందుతున్న ఈ చిత్రాన్ని పంపిణీదారుడు వంశీకృష్ణ నంది పాటి నవంబరు 3న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నాయిక డా. కామాక్షి భాస్కర్ల మీడియాతో మాట్లాడుతూ, 'మొదటి పార్ట్‌లో చాలా ఓర్పుగా ఉండే పాత్ర చేశాను. అయితే నా పాత్రకు అందులోనూ అన్ని రకాల ఎమోషన్స్ పండించే స్కోప్ ఇచ్చారు. ఇందులో ఇంకాస్త అగ్రెసివ్‌గా కనిపిస్తాను. నా పాత్రకు చాలా ప్రాముఖ్యత ఉంటుంది. మంచి స్క్రీన్‌ప్లే బేస్డ్ మూవీ ఇది. సినిమా చూసి బయటికి వెళ్లే వాళ్లంతా లక్ష్మీ పాత్రను బయటికి తీసుకెళతారు. అలా అందరికీ కనెక్ట్ అవుతుంది ఇందులోని నా పాత్ర. అంతేకాదు ప్రతి 15 నిమిషాలకు ప్రేక్షకులను సర్‌ప్రైజ్ చేసే ఎలిమెంట్ వస్తుంది. ప్రస్తుతం 'మాన్షన్ హౌస్ మల్లేష్', 'భూత' వంటి సినిమాలలో చేస్తున్నాను.



డా. కామాక్షి భాస్కర్ల

మహిళలు చూడాల్సిన సినిమా

సత్యం రాజేష్ హీరోగా నటించిన మరో చిత్రం 'టెనెంట్'. ఈ చిత్ర టైటిల్ గ్లింప్స్‌ను మేకర్స్ లాంచ్ చేశారు. మహాతేజ క్రియేషన్స్ బ్యానర్‌పై రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం మన చుట్టూ జరిగే సంఘటనలకి దగ్గరగా ఉండే ఒక సింపుల్ ఫ్యామిలీ ఎమోషనల్ మర్డర్ మిస్టరీ కథ.



సత్యం రాజేష్, మేఘా చౌదరి

ముఖ్యంగా ఆడవాళ్లు తప్పకుండా చూడాల్సిన సినిమా ఇది. 'అద్భుతం' చిత్రాన్ని నిర్మించిన మొగుళ్ల చంద్రశేఖర్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, 'ఇప్పుడు కాక ఇంకెప్పుడు' చిత్రానికి దర్శకత్వం వహించిన వై. యుగంధర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తూ.. స్క్రీన్‌ప్లే, సంభాషణల్ని కూడా అందించారు. మేఘా చౌదరి, చందన పయ్యావుల, భరత్ కాంత్, తేజ్ దిలీప్, ఆడుకాలం నరేన్, ఎస్తేర్ నొరోన్హ, ధనా బాల, చందు, అనురాగ్, రమ్య పొందూరి, మేగ్న తదితరులు నటిస్తున్నారు.

కెప్టెన్ మార్వెల్‌గా..

ది మార్వెల్స్ కోసం తాజా ఫీచర్‌లో బ్రీ లార్సన్ మొదటిసారి కెప్టెన్ మార్వెల్ సూట్ ధరించడం విశేషం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులు ది మార్వెల్స్‌లో ఆమె తిరిగి రావడం కోసం ఎదురు చూస్తున్న చూస్తున్న తరుణం రానే వచ్చేసింది. క్రీ రెనెగేడ్ నుండి మాడ్ టైటాన్: థానోస్‌తో పోరాడటానికి ఎవెంజర్స్‌లో చేరడం వరకు బ్రీ లార్సన్ తన ప్రయాణాన్ని ఎలా సాగించిందో ఇందులో చూడొచ్చు. బ్రీ లార్సన్ మాట్లాడుతూ, 'కెప్టెన్ మార్వెల్ సూట్‌లో కనిపించడం నా జీవితంలో అత్యంత అధివాస్తవిక అనుభవం. అత్యంత డైనమిక్ క్యారెక్టర్ ఇది' అని తెలిపారు. 'కెప్టెన్ మార్వెల్‌గా లార్సన్ నటన అద్భుతం. ఈ దీపావళికి భారతదేశం అంతటా రిలీజ్‌కి రెడీగా ఉంది. నవంబర్ 10న ఇంగ్లీష్, హిందీ, తమిళం, తెలుగు భాషలలో దీన్ని థియేటర్లలో చూడొచ్చు' అని నిర్మాత కెవిన్ ఫిగే చెప్పారు.



బ్రీ లార్సన్





సమాజం కోసమే పాడతాను

పాట ఆమెకు ప్రాణం మాత్రమే కాదు బాధ్యత కూడా. అందుకే ఎక్కడ సమస్య పుట్టినా వెంటనే ఆమె మెదడు నుండి ఓ పాట పురుడు పోసుకుంటుంది. తన అక్షరాలతో ప్రజల్లో చైతన్యం నింపు తుంది. తన స్వరంతో ఉత్సాహ పరుస్తుంది. కాస్త గుర్తింపు వచ్చినా తమ స్వార్థం చూసుకునే రంగంలో ఉన్నా తాను మాత్రం సమాజం కోసమే పాడతానంటుంది. ఆమే జానపద కళాకారిణి **కె.శ్యామల**. వామపక్ష ఉద్యమాల నుండి తాను నేర్చుకున్న భావాలను సమాజంలో పాటల ద్వారా ప్రచారం చేస్తానంటున్న ఆమె పరిచయం నేటి మానవిలో...

మా సొంతూరు వనపర్తి జిల్లా లోని అమరచింత. అమ్మ చెన్నమ్మ, నాన్న మల్లకల్. మాది వ్యవసాయ కుటుంబం. మేము అరుగురం పిల్ల లం. ఇద్దరు అన్నలు నలుగురం అక్క చెల్లెళ్ళం. అందరికంటే నేనే చిన్నదాన్ని. మా ఊళ్ళోనే స్కూల్ ఉండేది. కానీ క్లాసులకు మాత్రం సరిగా వెళ్ళేవాళ్ళం కాదు. అమ్మానాన్నలకు సాయంగా ఉంటుందని పశువులు మేపడానికి, కూలీ పనులకు వెళ్ళేవాళ్ళం. మా పెద్దన్న విజయ రాములు మొదటి నుండి కమ్యూనిస్టు పార్టీ లో పని చేసేవాడు. ఆయన ద్వారానే ఎస్ఎఫ్ఐ పరిచయమయింది. హైస్కూల్లో ఉన్నప్పుడు ప్రజా నాట్యమండలి వాళ్ళు పాటల వర్క్‌షాప్ పెడితే నన్నూ, మా అక్కను పంపించాడు. కానీ అక్కడ పెద్దగా ఏమీ నేర్చుకోలేదు. నేను ఎనిమిదో తరగతిలో ఉన్నప్పుడు మేడే సందర్భంగా ఓ పాట పాడాలన్నాడు. అప్పట్లో పాటలేమీ రావు. అన్నయ్యనే దగ్గర కూర్చోబెట్టుకొని 'పాడు దమా స్వేచ్ఛాగీతం' అనే పాట నేర్పించాడు. ఆ పాటలో జాతిపతాకం అనే దగ్గర అరుణపతాకం అని మార్చి నేర్పించాడు. అప్పటి నుండి పాడటం అలవాటయింది. అప్పట్లో మహిళా, విద్యార్థి సమస్యలపై పాటలు నేర్చుకొని పాడేదాన్ని.

చదువుకోవాలని కోరికతో...

మా అక్కలందరికీ తొందరగానే పెండ్లి చేశారు. నేను మాత్రం ఎలాగో ఇంటర్ పూర్తి చేశాను. తర్వాత నాకు కూడా పెండ్లి చేయాలను కున్నారు. నాకేమో చదువుకోవాలని కోరిక. దాంతో ఇంట్లో చెప్పకుండా మా అక్క పద్మావతి దగ్గరకు వెళ్ళిపోయాను. తను కూడా పాటలు బాగా పాడు తుంది. కాలేజీలో చేర్పించే వరకు అన్నం తిన కుండా నిరాహారదీక్ష చేశాను. మా అక్క కూడా నాకే సపోర్ట్ చేసింది. దాంతో చివ రకు ఒప్పుకున్నారు. కానీ అప్పటికే చాలాచోట్ల అడ్మిషన్లు అయి పోయాయి. దాంతో వనపర్తిలో ఎస్ఎఫ్ఐ సహ కారంతో సీటు దొరికింది. అలా డిగ్రీ పూర్తి చేశాను.

రాయడం మొదలుపెట్టాను

మా ఇంట్లో మా అక్క కూతురి తో నాకు బాగా రిలేషన్ ఉండేది. తను పెండ్లి చేసుకుని వెళ్ళి పోతుంటే ఆడపిల్ల మాత్రమే పెండ్లి తర్వాత ఇల్లు వదిలి ఎందుకు వెళ్ళాలి అనే బాధతో 'ఆడపిల్ల పుట్టిం దంటే అత్తింటికి వెళ్ళా లంటూ... ఏ దేవుడు రాశాడేమో మనుషులకు పాడు రాతని... రాత రాసిన దేవుడికి కూతురు అసలే ఉండదులే... ఉండుంటే తెలిసేది... అమ్మ నాన్న వేదన ఏంటనీ..' అంటూ ఓ పాట రాశాను.

డిగ్రీ చేసేటపుడు సంక్షేమ హాస్టల్ సమస్యలపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సైకిల్ యాత్ర జరిగింది. సందర్భానికి తగిన పాటలు చాలా అవసరమని అప్పుడే అనిపించింది. అందుకే హాస్టల్ సమస్యలపై పాట రాసి పాడాను. ఎంత గొప్ప ఉపన్యాసం చెప్పినా పాట ప్రభావం చాలా ఉంటుంది. పాట రూపంలో అయితే జనంలోకి సమస్య చాలా త్వరగా వెళుతుంది. ఆ పాట అందరికీ బాగా నచ్చింది. దాంతో నేనూ రాయగలను అనే నమ్మకం వచ్చింది. అప్పటి నుండి సందర్భానికి తగ్గట్టు పాటలు రాస్తూనే ఉన్నాను. పార్టీ కామ్రేడ్స్ చనిపోయినప్పుడు వాళ్ళపైన రాసేదాన్ని. అలాగే ఏప్రిల్ నెలను ఫూల్ అంటుంటారు. కానీ జ్యోతిబాపూలే, అంబేద్కర్, చార్లీచాప్లిన్, లెనిన్ లాంటి ఎంతో మంది మహనీయులు ఆ నెలలోనే పుట్టారు. అలాంటి నెలను ఫూల్ అంటారు. దాన్ని ప్రశ్నిస్తూ ఒక పాట రాశాను. పీజీలో సోషియాలజీ కోసం ఓయూలో చేశారు. ఓయూలో ఉన్నప్పుడే విద్యార్థుల సమస్యలపై అనేక పోరాటాలు చేశాము. అప్పుడు కూడా పాటలు బాగా పాడేదాన్ని.



కుటుంబం కోసం...

పార్టీల మధ్య జరిగిన గొడవలతో సురేష్, మా అన్నయ్య 90 రోజులు జైల్లో ఉన్నారు. అప్పుడే నాకు బాబు పుట్టాడు. అప్పట్లో సురేష్ మహబూబ్‌నగర్ ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శిగా ఉండేవాడు. దాంతో నేను కూడా మహబూబ్‌నగర్ వచ్చేశాను. సురేష్ పూర్తి కాలం పార్టీలోనే పని చేసేవాడు. నేను కుటుంబం కోసం ప్రైవేట్ స్కూల్స్‌లో టీచర్‌గా పని చేసేదాన్ని. తర్వాత పాప పుట్టింది. 2014లో తెలుగు యూనివర్సిటీలో ఎంఏ ఫోక్ ఆర్ట్ కోర్సు చేశాను. 2016లో నోటిఫికేషన్ వస్తే అప్లయ్ చేశాను. 2018లో గురుకులంలో మ్యూజిక్ టీచర్‌గా జాబ్ వచ్చింది. దాంతో కొంత వరకు మా కష్టాలు తీరాయి. ఎక్కడ ఉన్నా మా



భావజాలన్ని ప్రచారం చేస్తుంటాను. క్లాసికల్ అయితే చాలా ఇబ్బంది ఉండేది. అన్నమయ్య కీర్తనల్లాంటివి నేర్పించాల్సి వచ్చేది. ఫోక్ కాబట్టి పిల్లలకు మంచి భావజాలాన్ని నేర్పించ గలుగుతున్నాను. చదువు ప్రాధాన్యం, సమానత్వానికి సంబంధించిన పాటలనే మా స్కూల్ పిల్లలకు నేర్పిస్తుంటాను. ఈ మధ్య కాలంలో రైతుల సమస్యలపై, ఆదర్శ వివాహాలపై, ఉపాధ్యాయుల బాధ్యతను తెలియజేస్తూ ఇలా ఎన్నో పాటలు రాశాను. అలాగే పోడు రైతుల సమస్యలపై, భావప్రకటనా స్వేచ్ఛపై కూడా రాశాను. ఇవన్నీ పిల్లలకు నేర్పిస్తుంటాను. గవర్నమెంట్ ప్రోగ్రామ్స్ ఎక్కడ జరిగినా పిల్లల్ని తీసుకెళతాను. మా స్కూల్స్ మధ్య కూడా పోటీలు జరుగుతుంటాయి. మా పిల్లలకు బహుమతులు కూడా వచ్చాయి. సాయిచంద్ రాసి పాడిన అంబేద్కర్ పాటకు కోలాటం నేర్పించి పోటీలో పాల్గొంటే, వాళ్ళకు ఫస్ట్ ప్రైజ్ వచ్చింది.

యూట్యూబ్ ఛానల్‌తో...

ఈ మధ్యనే యూట్యూబ్ ఛానల్ పెట్టాను. నేను రాసి పాడిన పాటలు, మా స్కూల్ పిల్లల ప్రోగ్రామ్స్ అందులో పెడుతుంటాను. అందులో ఉంటే ఎక్కడికి పోకుండా జాగ్రత్తగా ఉంటాయి. అలాగే సామాజిక అంశాలకు సంబంధించిన పాటలు అందరూ వింటారు అనే ఉద్దేశంతో యూట్యూబ్‌లో పెడుతున్నాను. సురేష్ డప్పు కొడుతుంటాడు, నేను పాడు తుంటాను. 2017లో తెలుగు యూనివర్సిటీ నుండి గుమ్మడి వెంకటేశ్వరావు అవార్డు అందుకున్నాను. 'కురుమూర్తి జాతర-ప్రత్యేక అధ్యయనం' అనే అంశంపై ఎంఫిల్ చేశాను. అందులో గోల్డ్ మెడల్ అందుకున్నాను.

చైతన్యం నింపాలి

ప్రస్తుతం పాటను చాలా మంది స్వార్థం కోసం వాడుకుం టున్నారు. పచ్చిబూతులు రాసి సమాజంలోకి వదిలేస్తున్నారు. వ్యక్తులుగా వాళ్ళకు పేరొస్తే చాలానుకుంటున్నారు. ఆ పాట జనంపై ఎలాంటి ప్రభావం చూపుతుందో పట్టించుకోవడం లేదు. డబ్బు కోసం పేరు కోసం ఎలాంటి పాటలైనా రాస్తున్నారు, పాడుతున్నారు. అలాంటి వాటి వల్ల సమాజానికి ఎలాంటి ఉపయోగం లేదు. కానీ బాధ పడాల్సిన విషయం ఏమిటంటే వాటిని ఎవ్వరూ వ్యతిరేకించడం లేదు. అందుకే నేను రాసే, పాడే పాటలు సమాజం కోసమై ఉండాలని కోరుకుంటున్నాను. నాకు పేరు రాకపోయినా నా పాట వల్ల ఒక్కరిలో చైతన్యం వచ్చినా చాలనుకుంటున్నాను. ముఖ్యంగా పాటను అమ్ముకోవడం నాకు ఇష్టం లేదు.

వందకు పైగా...

కరోనా సమయంలో లెనిన్ జయంతి అప్పుడు లెనిన్ గురించి 'ప్రపంచ అరుణతారా... కమ్యూనిస్టు ధృవతారా... లాల్‌సలామ్ లెనిన్ నీకు లాల్ సలామ్' అనే పాట రాశాను. అలాగే పుస్తకం చదవడం ఎంత అవసరమో తెలియజేస్తూ ఒక పాట రాశాను. ఇలా సుమారు వంద కు పైగా రాశాను. కానీ అప్పట్లో ఇవన్నీ జాగ్రత్త చేసుకోలేక కొన్ని పోగొట్టు కున్నాను. వీటన్నింటినీ కలిపి పుస్తకం తీసుకురావొచ్చని మొదట్లో తెలీదు. దాంతో పట్టించుకోలేదు. ఎస్ఎఫ్ఐలో ఉన్నప్పుడే సురేష్‌తో పరిచయం. పార్టీ వాళ్ళే మాట్లాడి, రెండు కుటుంబాలను ఒప్పించి 2007లో మాకు పెండ్లి చేశారు. ఊళ్ళో అప్పుడే పార్టీ మధ్య గొడవలు మొదలయ్యాయి. అందరూ సీపీఎంలో నుండి సీపీఐలోకి వచ్చారు. అలా మా కుటుంబం మొత్తం సీపీఐలోకి వచ్చేసింది. అప్పుడు నేను యువజన సంఘంలో పని చేశాను. సురేష్ వాళ్ళది కూడా పార్టీ కుటుంబమే. వాళ్ళ అన్న కూడా కళాకారుడు. సురేష్ కూడా పాటలు పాడతాడు, డప్పు కొడతాడు. మా అన్నయ్య ప్రస్తుతం సీపీఐ వనపర్తి జిల్లా కార్యదర్శిగా ఉన్నాడు.



మహిళా

- సలీమ

ఇదే మా వ్యూహం

(మొదటిపేజీ తరువాయి)

జనం దగ్గరకు పోయి.. కరెంటు గురించి అడుగుదాం... మీరు సిద్ధమా...?' అని కాంగ్రెస్‌కు సవాల్ విసిరారు.

టీఎస్‌యూడబ్ల్యూజే ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమానికి కేటీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రతిపక్ష కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. 55 ఏండ్లపాటు రాష్ట్రాన్ని పాలించిన ఆ పార్టీ... రాష్ట్రాన్ని అధోగతి పాల్జేసిందని విమర్శించారు.

దేశానికి స్వాతంత్ర్యానంతరం వివిధ సందర్భాల్లో తెలంగాణ ప్రజల ఆకాంక్షలను కాంగ్రెస్ తొక్కిపట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయాల్లో వందలాది మంది యువకులను కాల్చి చంపిందని తెలిపారు. '2009లో జగన్ కొత్త పార్టీ పెట్టటంతో ఏపీలో కాంగ్రెస్‌కు దిక్కూ దివాణం లేకుండా పోయింది. అక్కడి నష్టాన్ని కనీసం ఇక్కడైనా పూడ్చుకుందామనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చింది తప్ప ఇక్కడి ప్రజల ఆకాంక్షల మేరకు కాదు...' అని ఆయన వ్యాఖ్యానించారు.

దేశాన్ని, రాష్ట్రాన్ని దశాబ్దాల పాటు పాలించిన కాంగ్రెస్ పుర్రెలో ఎప్పుడైనా రైతుబంధు, దళిత బంధు లాంటి పథకాలు, అలాంటి ఆలోచనలు పుట్టాయా..? అని కేటీఆర్ ఈ సందర్భంగా ప్రశ్నించారు. తాము తొమ్మిదన్నరేండ్ల కాలంలో చేసిన అభివృద్ధిని వివరించి, ఆ తర్వాతనే ఓట్లడుగుతున్నామని తెలిపారు. కానీ ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీలు ఏ ముఖం పెట్టుకుని, ఏం చెప్పి జనం దగ్గర ఓట్లడుగుతాయని నిలదీశారు. పదేండ్ల నుంచి అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణ చేసింది గుండుసున్నా అంటూ ఎద్దేవా చేశారు.

వివిధ పన్నుల రూపంలో రాష్ట్రం నుంచి కేంద్రానికి వెళ్లింది ఎక్కువ.. అక్కడి నుంచి వచ్చింది మాత్రం చాలా తక్కువని గుర్తు చేశారు. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్ కుంగిన ఘటనను విలేకరులు ప్రస్తావించగా... 'గతంలో కాళేశ్వరం మోటార్లు మునిగితే ప్రతిపక్షాలు రాద్ధాంతం చేశాయి. కానీ ప్రజలపై, ప్రభుత్వంపై ఒక్క పైసా భారం పడకుండా సదరు నిర్మాణ సంస్థే పునరుద్ధరణ చర్యలను చేపట్టింది. ఇప్పుడు కూడా అలాగే జరుగుతుంది. రాష్ట్ర ఖజానాపైగానీ, ప్రజలపై గానీ ఒక్క పైసా భారం పడదు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇటీవలే బ్యారెజీని పరిశీలించి వెళ్లింది. చిన్న చిన్న సాంకేతిక లోపాలుంటాయి. అయితే ఆ వివరాలేవీ నాకు తెలియదు. కానీ త్వరలోనే నిర్మాణ సంస్థే పునరుద్ధరణ చర్యలు చేపడుతుంది...' అని వివరించారు. కార్యక్రమానికి టీఎస్‌యూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి విరాహత్ అలీ అధ్యక్షత వహించగా...ఐజేయూ ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరెడ్డి సమన్వయకర్తగా వ్యవహరించారు.

కేసీఆర్ ఫ్యామిలీ ఫామ్‌హౌస్‌కే..

నవతెలంగాణ-తాండూరు

కర్నాటక రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చాక అన్ని హామీలను అమలు చేస్తున్నామని తెలిపారు. రైతులకు కరెంట్ ఇస్తున్నామన్నారు. గృహలక్ష్మి కింద మహిళలకు రూ.రెండు వేలు ఇస్తున్నామన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్, పేదలకు పది కిలోల బియ్యం, మహిళలకు బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్టు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు కర్నాటక ప్రభుత్వంపై చేస్తున్న ఆరోపణలన్నీ బూటకమన్నారు. తెలంగాణకు కేవలం పది కిలోమీటర్ల దూరంలో ఉన్న కర్నాటకకు సీఎం కేసీఆర్ వచ్చి వాస్తవాలు తెలుసుకోవాలని హితవు పలికారు. అసలు తెలంగాణలో సీఎం కేసీఆర్ ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు.

టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అధికార అహంకారంతో అవినీతికి పాల్పడి మింగిన రూ.లక్ష కోట్లను తిరిగి కక్కిస్తామన్నారు. హైదరాబాద్‌లో పదివేల ఎకరాల్లో భూ కబ్జాలు చేశారని ఆరోపించారు. ఆ భూములను తిరిగి స్వాధీనం చేస్తామని చెప్పారు.

హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్‌ను అభివృద్ధి చేసిందే కాంగ్రెస్ అన్నారు. మెట్రో రైలు, రింగ్ రోడ్డు వేసింది తమ పార్టీ అని చెప్పారు. రాష్ట్రంలో ఎనిమిది నుంచి పది గంటలు మాత్రమే కరెంటు వస్తోందన్నారు. మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్ ఇస్తామని మోసం చేశారన్నారు. మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్ తీసుకొచ్చిన ఘనత కాంగ్రెస్‌దే అన్నారు. 'గెలిస్తే పని చేస్తాం లేకుంటే ఫామ్‌హౌస్‌లో ఉంటాం' అని కేసీఆర్ అనడంతోనే ఓటమిని ఒప్పుకున్నారన్నారు. తాండూరులో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు కుమ్ములాడుకొని ఇప్పుడు ఒక్కటైన విషయాన్ని ప్రజలు గుర్తించారన్నారు. వారిద్దరూ కార్యకర్తల మనోభావాలను దెబ్బతీశారన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి పుష్పలీల, కాంగ్రెస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షులు రామ్మోహన్ రెడ్డి, ఏఐసీసీ నాయకులు ఖాన్, తాండూరు నాయకులు డాక్టర్ సంపత్ కుమార్, కల్వ సుజాత తదితరులు పాల్గొన్నారు.

జక్కలొద్దిపై జులుం

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

17 నెలలుగా పేదలు సీపీఐ(ఎం) అండగా భూపోరాటం చేస్తున్నా ఆ ప్రాంతానికి ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ రాలేదు, ఎలాంటి హామీ సైతం ఇవ్వలేదు. ఇప్పుడు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని జక్కలొద్ది పేదలపై ఓట్ల రాజకీయాలు చేయడం విస్మయాన్ని కలిగిస్తోంది. పైగా సీపీఐ(ఎం) నేతలపై దుష్ప్రచారం చేసి వారిపై దాడి చేయించడం, గుడిసెవాసులను బెదిరించి వారి ఇండ్లపై గులాబీ జెండాలు ఎగురవేయడం ప్రజలను ఆగ్రహానికి గురిచేసింది. గతంలో ఇదే నన్నపనేని గుడిసెవాసులపైకి పోలీసులను ఉసికొల్పినట్టు ఆరోపణలున్నాయి. స్థానికులమనే పేరిట భూకబ్జాదారులను గుడిసెవాసులపైకి దాడికి పంపడంతో ఘర్షణ జరిగిన విషయం విదితమే. వర్ధన్నపేట నియోజకవర్గం పరిధిలోని జక్కలొద్దిలో 'నన్నపనేని' రాజకీయాలు చేయడం వెనుక భూదందానే కారణమని తెలుస్తోంది.

రాష్ట్ర శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న కొద్ది వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ఆసక్తికరమైన పరిణామాలు జరుగుతున్నాయి. 'తూర్పు' ఎమ్మెల్యే బీఆర్ఎస్ అభ్యర్థి నన్నపనేని నరేందర్ పట్ల సొంత పార్టీ కార్పొరేటర్లే తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఆయన వ్యవహారశైలి రోజురోజుకూ విమర్శలపాలవుతోంది. వర్ధన్నపేట నియోజకవర్గం పరిధిలోని జక్కలొద్దిలో 'నన్నపనేని' రంగప్రవేశం చేయడంపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఎమ్మెల్యే తన బినామీలతో పెద్ద ఎత్తున రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలోనే జక్కలొద్దిలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పేదలు వేసుకున్న గుడిసెలను తొలగించే ప్రయత్నంలో తాజా దాడులు చేయించినట్టు ప్రచారం జరుగుతోంది.

కాంగ్రెస్‌కు మంచి అస్త్రం

'నన్నపనేని' రాజకీయ మంత్రాంగం కాంగ్రెస్‌కు మంచి అస్త్రాన్ని అందించినట్లైంది. 17 నెలలుగా జక్కలొద్దికి రాని 'నన్నపనేని' ఇప్పుడే ఎందుకు వచ్చారు? అని గుడిసెవాసులు ప్రశ్నిస్తున్నారు. గతంలో ఎన్నడూ హామీలు ఇవ్వని 'తూర్పు' ఎమ్మెల్యే ఇప్పుడు పట్టాలిప్పిస్తానని హామీలివ్వడం వెనుక మతలబేంటని ప్రశ్నిస్తున్నారు.

బీఆర్ఎస్ మెడకు 'నన్నపనేని' కుతంత్రం

నన్నపనేని నరేందర్ జక్కలొద్దిలో చేసిన కుతంత్రం బీఆర్ఎస్ మెడకు చుట్టుకునే ప్రమాదం ఏర్పడింది. తన నియోజకవర్గం కాకపోయినా జక్కలొద్దిలో జోక్యం చేసుకొని ఘర్షణకు కారణమైన 'నన్నపనేని' వ్యవహారశైలి ఆ పార్టీకి ఎన్నికల ముందు గుదిబండగా మారింది. ఎమ్మెల్యే తన గూండాలతో దాడులు చేయించడాన్ని పేదలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. దాడులు చేసిన బీఆర్ఎస్ నేతలపై చర్యలు తీసుకోవాలని ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సీపీఐ (ఎం) నేతలపై దాడి

జక్కలొద్ది భూ పోరాటానికి నాయకత్వం వహిస్తున్న సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడు ఎం.సాగర్, నాయకులు ఓదేలుపై ఎమ్మెల్యే అనుచరులు, గూండాలు దాడి చేసి జక్కలొద్దిలో భయానక వాతావరణం సృష్టించారు. భూముల్ని లాక్కునే ఎత్తుగడల్లో భాగంగానే కొద్దిరోజులుగా సీపీఐ(ఎం) నేతలపై ఎమ్మెల్యే దుష్ప్రచారం చేయడం ప్రారంభించారు. అందులో భాగంగానే ఈ ఘటన జరిగిందని తెలుస్తోంది. ఏదేమైనా అసెంబ్లీ ఎన్నికల ముందు ఎమ్మెల్యే నరేందర్ వ్యవహరించిన తీరు ఆయనకు ప్రతికూలంగా మారే ప్రమాదముందని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

నరేంద్రునితో సెల్ఫీ దిగండి

(మొదటిపేజీ తరువాయి)

మాజీ లెఫ్టినెంట్ జనరల్ ప్రశ్నించారు. ఇది సైనిక సంప్రదాయాలను ఉల్లంఘించడమే అవుతుందని రిటైర్డ్ కల్నల్ ఒకరు చెప్పారు. ఈ చర్య సాయుధ దళాలను రాజకీయ రొచ్చులోకి లాగడమేనని, ఓటర్లను ఆకర్షించేందుకు ఇది ఓ రాజకీయ ఎత్తుగడ అని ఆయన విమర్శించారు.

సరిహద్దు రోడ్ల సంస్థ, తీరగస్తీ దళం, ప్రభుత్వ రంగ రక్షణ సంస్థలు, రక్షణ పరిశోధన-అభివృద్ధి సంస్థ, సైనిక స్కూల్స్, ఎన్‌సీసీ సహా రక్షణ శాఖకు చెందిన అన్ని విభాగాలు, సంస్థలను సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రజలు సెల్ఫీలు దిగి వాటిని అప్‌లోడ్ చేసేందుకు వీలుగా ఓ యాప్‌ను తీసుకొచ్చే యోచన కూడా చేస్తున్నారు. కాగా కేంద్ర సైన్స్ మంత్రిత్వ శాఖకు చెందిన సంస్థలు కూడా సెల్ఫీ పాయింట్ల ఏర్పాటుపై కసరత్తు చేస్తున్నాయి. న్యూఢిల్లీలోని ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ ఇప్పటికే సెల్ఫీ పాయింట్‌ను ఏర్పాటు చేసింది. 3డీ సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయాలంటూ రైల్వే బోర్డు అన్ని జోన్లకు ఆదేశాలు పంపింది.

భారత్ రైల్వేగా ఇండియన్ రైల్వే..!

(మొదటిపేజీ తరువాయి)

ఇండియాకు బదులుగా ప్రెసిడెంట్ ఆఫ్ భారత్ అని రాశారు. జీ20 నేతల సదస్సులో ప్రధాని మోడీ టేబుల్ ముందు భారత్ అని రాశారు. ఎన్సీఈఆర్టీ పుస్తకాల్లో కూడా ఇండియా పేరును తొలగించి, దానికి బదులు భారత్‌ను ఉపయోగించాలని ప్రతిపాదించారు.

అ ఐదు రాష్ట్రాల్లో యాత్రలు వద్దు

(మొదటిపేజీ తరువాయి)

నిర్ణయం వివాదాస్పదమైంది. యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వం జాయింట్ సెక్రెటరీ, డైరెక్టర్, డిప్యూటీ సెక్రెటరీ స్థాయి అధికారులను జిల్లా రథసారధులుగా నియమించడంపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. దీంతో ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. తెలంగాణ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మిజోరాం రాష్ట్రాలకు ఎన్నికల తరువాత వాహనాలు వస్తాయని, ప్రభుత్వ అధికారులను యాత్రలో ఉపయోగించుకోవాలనే వివాదం తప్పదని అపూర్వ చంద్ర అన్నారు. నవంబర్ 15న బిర్సా ముండా జయంతి రోజున ప్రధాని మోడీ యాత్రను జెండా ఊపి ప్రారంభించున్నారు. జనవరి 25న యాత్ర ముగుస్తుంది.

మళ్లీ తగ్గిన విదేశీ నిల్వలు

(మొదటిపేజీ తరువాయి)

రిజర్వ్ నిధులపై ఒత్తిడి పెరిగింది. డాలర్‌తో రూపాయి విలువ తగ్గడం, విదేశీ చెల్లింపుల భారం పెరగడం మారకం నిల్వలు కరిగిపోవడానికి ప్రధాన కారణాలుగా ఉన్నాయని ఆర్థిక రంగ నిపుణులు చెబుతున్నారు. విదేశీ మారకం నిల్వలు తగ్గడం ఆర్థిక వ్యవస్థకు ప్రమాదకరం. రూపాయిపై ఒత్తిడి నెలకొంటుంది. ముడి చమురు దిగుమతులు భారమవుతాయి. ద్రవ్యోల్బణం భారీగా పెరుగుతుంది. నిత్యావసర వస్తువులుసహా వివిధ వస్తువులు, సేవలపై పెరిగిన ధరలతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. బంగారం ధరలు విపరీతంగా పెరగడంతో రిజర్వ్ బ్యాంకు వద్ద పసిడి నిల్వలు పెరిగాయి. గత వారం రోజుల్లో 1.85 బిలియన్ డాలర్లు పెరిగి 45.42 బిలియన్లకు చేరుకున్నాయి.

ఈజిప్ట్‌లో పలు వాహనాలు ఢీకొని 32మంది మృతి

కైరో : ఈజిప్ట్ రాజధాని కైరోను అనుసంధానిస్తున్న హైవేపై శనివారం ఉదయం ఆగివున్న వాహనంలోకి పాసింజర్ బస్సు దూసుకువెళ్ళడం, అటుపై పలు వాహనాలు ఢీ కొనడంతో 32మంది మరణించారని అధికారులు తెలిపారు. పొగ మంచు దట్టంగా వుండడమే ప్రమాదానికి కారణంగా భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో కొన్ని వాహనాలకు మంటలు అంటుకున్నాయని 63మంది గాయపడ్డారని ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే అంబులెన్సులు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. సమీపంలోని ఆస్పత్రులకు గాయపడిన వారిని తరలించాయి. కైరోకు వెళుతున్న బస్సు ఆగివున్న వాహనాన్ని ఢీ కొందని, ఇతర కార్లు కూడా బస్సులోకి దూసుకువెళ్ళాయని, దాంతో కొన్నింటికి మంటలు వ్యాపించాయని స్థానిక మీడియా తెలిపింది.

మానవత్వం స్పందించింది..

(మొదటిపేజీ తరువాయి)

మరింతగా పెంచాలని డిమాండ్ చేసింది. బందీలుగా వుంచిన పౌరులందరినీ తక్షణమే విడుదల చేయాలని తీర్మానం కోరింది. ఇజ్రాయిల్ పౌరులపై దాడులతో సహా అన్ని రూపాల్లోని తీవ్రవాద చర్యలను, విచక్షణారహిత దాడులన్నింటినీ ఖండించింది. హమాస్‌పై దాడులను తీర్మానంలో నిర్దిష్టంగా ప్రస్తావించలేదు. కాల్పుల విరమణ అంటే హమాస్‌కు తిరిగి ఆయుధాలు సమకూర్చుకోవడానికి సమయం ఇవ్వడమేనని ఐక్యరాజ్య సమితిలో ఇజ్రాయిల్ రాయబారి గిలాద్ ఎర్డాన్ వ్యాఖ్యానించారు. శాంతిని తీసుకురావడానికి ఈ ఓటింగ్ ఉద్దేశించబడలేదని, కేవలం ఇజ్రాయిల్ చేతులు కట్టివేయడానికేనని అన్నారు. అత్యసరం సమావేశంలో కాల్పుల విరమణ జరగాలని కోరుతూ పలువురు వక్తలు మాట్లాడారు.

బాంబు దాడులు ఆపండి

బాంబు దాడులను ఆపి, ప్రాణాలను కాపాడాలని పాలస్తీనా రాయబారి విజ్ఞప్తి చేశారు. జనరల్ అసెంబ్లీ అత్యవసర సమావేశంలో ఆయన భావోద్వేగంతో మాట్లాడారు. మరణించిన వారిలో 70శాతం మంది చిన్నారులు, మహిళలేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి యుద్ధాన్నా మీరు సమర్థించేది? అని ఆయన ప్రశ్నించారు. ఇవన్నీ నేరాలేనని అన్నారు. ఇదంతా ఆటవికమని విమర్శించారు. చనిపోయిన వారు చనిపోగా, మిగిలిన వారిని కాపాడేందుకైనా ఈ యుద్ధాన్ని ఆపాలని ఆయన కోరారు. హమాస్‌ను సమూలంగా నిర్మూలించేవరకు శాంతించేది లేదని ఇజ్రాయిల్ రాయబారి స్పష్టం చేశారు.



మారణహోమాన్ని తక్షణమే ఆపాలి

(మొదటిపేజీ తరువాయి)

పాలస్తీనా, గాజా వ్యవహారంలో ఇండియా వైఖరిని సీపీఐ(ఎం) ఖండించింది. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మీడియాతో మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో గాజాపై దాడులు, కాల్పుల విరమణ తీర్మానంపై జరిగిన ఓటింగ్‌లో ఇండియా తటస్థంగా ఉండటం సరికాదని విమర్శించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి పాలస్తీనా పట్ల ఉన్న వైఖరికి విరుద్ధంగా ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. స్వతంత్ర రాజ్యం పాలస్తీనియన్ల ప్రాథమిక హక్కు అనే ఇండియా సుదీర్ఘ వైఖరికి ఇది పూర్తిగా విరుద్ధమని అన్నారు. ఇండియా స్వతంత్ర విదేశాంగ విధానం నుంచి తప్పుకుంటున్నదని, ఇది అమెరికా సామ్రాజ్యవాదానికి వంతగా మారిందని పేర్కొన్నారు. కాల్పుల విరమణ మానవత్వంలో భాగమని, ఇండియా మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. 22 లక్షల మంది గాజా ప్రజలపై ఇజ్రాయిల్ చేస్తున్న ఆక్రమణ యుద్ధం పూర్తిగా అమానవీయమని అన్నారు. మొత్తం కమ్యూనికేషన్ వ్యవస్థ ధ్వంసమైందని, క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించేందుకు అంబులెన్స్‌కు ఫోన్ చేయడానికి కూడా వీలు లేకుండా చేశారని తెలిపారు. ఆస్పత్రులపైనా దాడులు జరుగుతున్నాయని అన్నారు. హమాస్‌తో ఏకీభవిస్తున్నామా లేదా అన్నది ప్రస్తుత సమస్య కాదని, గాజా ప్రజలు ఎదుర్కొంటున్న విషాదానికి పరిష్కారం తక్షణావసరమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం హమాస్‌ను ఉగ్రవాద సంస్థగా ప్రకటించలేదని ఏచూరి పేర్కొన్నారు.. ఇండియా వైఖరిని ఖండిస్తూ గాజాపై కాల్పులు విరమణ చేయాలి, మానవతావాద సహాయం అందించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తామన్నారు.

కార్మిక క్షేత్రం ఏ గట్టుకో..

రామగుండం నియోజకవర్గంలో కార్మికులే కీలకం

అనుబంధ సంఘాలపైనా నాయకుల దృష్టి

వారి ఓట్లు దండుకునేందుకు యత్నాలు

గంప గుత్తగా పడితేనే విజయం..


అమలుకాని పాలకపక్షం హామీలపై ప్రతిపక్షాల ఫోకస్

60వేల పైచిలుకు కార్మిక ఓట్లు

కార్మిక క్షేత్రంగా పేరున్న రామగుండం నియోజకవర్గం ఏ గట్టుకు చేరనుందోనన్న ఉత్కంఠ నెలకొంది. ఎమ్మెల్యే అభ్యర్థులు తమ బలాబలాలను అంచనా వేసుకుంటున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న కార్మికుల మద్దతు కూడగట్టేలా తమ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. కార్మికులు, వారికి అనుబంధంగా ఉన్న ఇతర వ్యాపారులు, ఉద్యోగ ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు కసరత్తు ప్రారంభించారు. కార్మికుల అభివృద్ధి, అందించిన లబ్దిపై అధికారపార్టీ ప్రచారం చేస్తుండగా.. అమలుకాని పాలకపక్షం హామీలపై ప్రతిపక్షాలు దృష్టిసారించాయి. ఈ నేపథ్యంలో కార్మికవర్గం ఏ గట్టున ఉంటుందో.. ఎవరి పక్షాన నిలుస్తుందోనన్న ఉద్వేగభరిత వాతావరణం నెలకొంది.







నవతెలంగాణ - కోల్‌సిటీ

రామగుండం నియోజకవర్గ పరిధిలో సింగరేణి, ఆర్ఎఫ్‌సీఎల్, ఎన్టీపీసీ, కేశోరామ్ సిమెంట్, జెన్‌కో, ఆర్టీసీ, రైల్వే లాంటి ప్రతిష్టాత్మక సంస్థల కార్మికులున్నారు. ఇక్కడ ఓటర్లలో కార్మిక జనాభాయే సుమారు 60వేల పైచిలుకు వరకూ ఉంటుందని అంచనా. మొత్తం ఓటర్లు కనీసం లక్షా 80వేల పైచిలుకు ఉంటారు.

ఆయా కంపెనీల్లో పర్మినెంట్, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న కార్మికుల ఓట్లను గంపగుత్తగా దండుకుంటే తప్ప విజయం వరించదనే చెప్పొచ్చు. ఈ క్రమంలో ఆయా పార్టీల అభ్యర్థులు, ఆశావహులు కార్మిక సంఘాల నేతలతో మాట్లాడి ఆ ఓటర్లను ప్రసన్నం చేసుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. బీఆర్ఎస్‌కు అనుబంధంగా ఉన్న టీబీజీకేఎస్ నాయకులు తమ అభ్యర్థి తరపున, ఐఎన్‌టీయూసీ నేతలు కాంగ్రెస్‌కు మద్దతుగా, బీఎంఎస్ నేతలు బీజేపీ పక్షాన నిలుస్తూ కార్మికవర్గాల్లో ఎన్నికల ప్రచారం చేసుకునే పనిలో బిజీ అయ్యారు.

రాజకీయ పార్టీల జోక్యం..

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సంస్థకు చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఐఏఎస్ స్థాయి అధికారిని నియమించి వారి ఆధ్వర్యంలో సంస్థ అభివృద్ధి పనులు చేపడతారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. సంస్థలో కాంట్రాక్టుల కేటాయింపు, బదిలీలు, నియామకాలు, కార్మికులకు అందించాల్సిన సౌకర్యాల లాంటి అంశాల్లో రాజకీయ నాయకుల జోక్యం ఎక్కువైంది. ఎమ్మెల్యేలు, మంత్రుల ఆదేశాల మేరకే చాలా పనులు సాగుతున్నాయి. దీని కారణంగా పైరవీలు ఎక్కువయ్యాయి.

ఎన్నికల నేపథ్యంలో ఆర్ఎఫ్‌సీఎల్, కెశోరామ్, జెన్‌కో, ఎన్టీపీసీ, ఆర్టీసీ లాంటి సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులు వారికి ప్రభుత్వం ఇచ్చిన హామీలు, కల్పిస్తున్న సౌకర్యాలపై బేరీజు వేసు కుంటున్నారు. హామీలు నెరవేరాయా లేదా అనే అంశాలను కార్మిక సంఘాల నేతలు, కార్మికులు పరిశీలి స్తున్నారు. ఈ నేపథ్యంలో కార్మిక క్షేత్రం ఈ ఎన్నికల ఫలితాల్లో కొంత ఆసక్తిగా మారడం ఖాయం అని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు.



నిధులు తరలింపు..

గతంలో ఏ ప్రభుత్వం కూడా సింగరేణికి సంబంధించిన నిధులను ఇతర అభివృద్ధి పనులకు కేటాయించలేదు. తెలంగాణ ఏర్పాడ్డాక పరిస్థితి మారింది. సింగరేణి నిధులను ప్రభుత్వ అభివృద్ధి కార్యకలాపాలకు వినియోగించేలా పలు మార్పులు చేశారు. దానికి అనుగుణంగా పదేండ్లుగా ఒకే సీఎండీని కొనసాగిస్తూ నిధులను పక్కదారి పట్టిస్తున్నారన్న అపవాదూ ఉంది. కార్మికుల వేతనాల పెంపు, అలవెన్సులు ఇతర విషయాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రామగుండంలో మెడికల్ కాలేజీతోపాటు సిరిసిల్ల, గజ్వేల్, సిద్ధిపేట లాంటి నియోజకవర్గాలకు సైతం ఇక్కడి నిధులను తరలించారు. తమ నిధులను తరలించడంపై కార్మికలోకం తీవ్ర అసంతృప్తితో ఉంది.

ఇండ్ల పట్టాలు రాకపాయే..

సింగరేణి కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో రామగుండం ప్రాంతంలో కోల్‌మైన్స్ ఏర్పాటైన మొదట్లో కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల నుంచి వేలాది మంది ఉపాధి కోసం ఇక్కడికి వచ్చి సింగరేణి కార్మికులుగా స్థిరపడ్డారు. ఇక్కడి ప్రాంతమంతా 99ఏండ్ల పాటు సింగరేణి సంస్థ లీజులో తాత్కాలిక నివాసాలు మాత్రమే ఏర్పాటు చేసుకోగలిగారు. కాలక్రమంలో అనేక కార్మిక కాలనీలు వెలిశాయి. అయినా ఈ ఆస్తులకు ప్రభుత్వ రిజిస్ట్రేషన్ లేక బ్యాంకులూ రుణాలు ఇవ్వడం లేదు. అయితే, అధికారంలోకి వచ్చిన తొలిరోజుల్లోనే సీఎం కేసీఆర్ కార్మికుల ఇండ్లకు పక్కా పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు.. దశాబ్దకాలం కావస్తున్నా అమలుకు నోచలేదు.

అక్కా..మీరు జైలుకెప్పుడెళతారు ?

లిక్కర్ స్కామ్‌లో మీ వాటా ఎంత !

ఎమ్మెల్సీ కవిత ట్వీట్‌కు నెటిజన్ల కౌంటర్



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి–హైదరాబాద్

బీఆర్ఎస్ మాజీ ఎంపీ, ప్రస్తుత ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంగతి మనం ప్రత్యేకంగా చెప్పుకోనక్కర్లేదు. ఆమె అడుగు జాడలు అన్నీ తన తండ్రి సీఎం కేసీఆర్‌ను పోలి ఉంటాయి. సోషల్‌మీడియాలోనూ ఆమె యాక్టివ్‌గా ఉంటారనే సంగతి తెలిసిందే. శనివారం యథాలాపంగా 'మరో అరగంటలో కలుద్దాం..మీరు ప్రశ్నలేయండి.. మీ ఆలోచనలు చెప్పండి..మీ శక్తిని ప్రదర్శించండి' అంటూ ఎక్స్(ట్వీటర్)లో ఒక పోస్టు పెట్టారు. అనంతరం మరో రెండు గంటల్లోనే భారీ స్పందన కనిపించింది. అనుకూల, ప్రతికూల ప్రశ్నలతో ఎక్స్ మార్మోమోగింది. నెటిజన్లు వేలల్లో రీట్వీట్లు చేశారు. రకరకాల ప్రశ్నల వర్షం కురిపించారు. అందులో కొన్ని రకాల ప్రశ్నలు ఇలా ఉన్నాయి. లిక్కర్ స్కాంలో మీ వాటా ఎంత?, మీరు జైలుకు ఎప్పుడెలుతున్నారు?, బీజేపీకి బీఆర్ఎస్ బీ టీమా, ఎప్పుడు విలీనం చేస్తున్నారు?, కాళేశ్వరంపై మీ అభిప్రాయమేంటి?, కిలో నెయ్యి ధర ఎంత?, తెలంగాణ ఎన్నికల్లో ఓడిపోతున్నారా? టీఎస్‌పీఎస్సీ పరీక్షలకు సంబంధించి కోర్టు కేసులను పరిష్కరించండి, నిజాం షుగర్ ఫ్యాక్టరీని ఎప్పుడు ఓపెన్ చేస్తారు ?, కామారెడ్డిలో బాపు(కేసీఆర్) పోటీ నీకోసమే అంటకదా అక్కా?, మొత్తం ఎన్ని సిమ్‌కార్డులు వాడతారు అక్కా?, అంటూ స్పందించారు. అయితే ఈ ప్రశ్నలకు కవితక్క ఏమేరకు జవాబు చెబుతారనేది ఆసక్తిరేపుతున్నది.



ఓటు వేసామని ఎడమ చేతి చూపుడు వేలుపై ఉండే ఇంకును చూపిస్తుంటారు. ఆ ఇంకు నేపథ్యం తెలుసా? దొంగ ఓట్లను అరికట్టడానికి 1962 నుంచి ఎన్నికల్లో ఈ ఇంకును వినియోగిస్తున్నారు. ఎన్నికల్లో మాత్రమే వాడే ఈ ఇంకు మరెక్కడా లభించదు. నేషనల్ ఫిజికల్ ల్యాబొరేటరీస్ నిర్ధేశించిన ఫార్ములాతో కర్నాటక రాష్ట్రం మైసూర్‌లోని పెయింట్స్ అండ్ వార్నీష్ కర్మాగారంలో ఈ ఇంకు తయారవుతుంది. మన దేశంలోనే కాకుండా మరో 29 దేశాలకు కూడా ఈ ఇంకు ఎగుమతి అవుతున్నది. ప్రస్తుత రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు 2 లక్షల ఇంకు సీసాల్ని వినియోగించనున్నారు. ఒక్క సీసాలోని ఇంకుతో కనీసం 600 మందికి గుర్తు వేయొచ్చు. ఇంకులో 7.25 శాతం సిల్వర్ నైట్రేట్ ఉండటంతో అది త్వరగా చెరిగిపోదు.

రూ.377.68 కోట్లకు చేరిన ఎన్నికల సొత్తు స్వాధీనాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించి, నిబంధనావళి అమల్లోకి వచ్చిన అక్టోబర్ 9 నుంచి 28వ తేదీ వరకు ఎన్నికల సంఘం నిర్వహించిన తనిఖీల్లో పట్టుబడిన సొమ్ము విలువ రూ.377.68 కోట్లకు చేరింది. ఈనెల 27 ఉదయం 9 నుంచి 28వ తేదీ ఉదయం 9 గంటల వరకు జరిపిన తనిఖీల్లో రూ.5.32 కోట్ల నగదు, రూ.6.11 కోట్ల విలువైన మద్యం, రూ.58.27 లక్షలు విలువైన 83.816 కిలోల గంజాయి, 43.75 కిలోల ఎన్‌డీపీఎస్ స్వాధీనం చేసుకున్నారు. అలాగే రూ.19.13 లక్షలు విలువైన బంగారం, వెండితో పాటు రూ.1.65 కోట్లు విలువైన ల్యాప్‌టాప్‌లు, వాహనాలు, కుక్కర్లు, చీరలు, మొబైల్ ఫోన్లు, క్రీడా సామాగ్రిని స్వాధీనం చేసుకున్నట్టు కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం తెలిపింది.



సమర్థవంతమైన నాయకుణ్ని ఎన్నుకున్నవాడే సమర్థ వంతుడైన ఓటరు. ఓటరు నిర్ణాయక శక్తి.. అద్భుతశక్తి.. ప్రజా సంక్షేమం కోరేవారే నిజమైన నాయకుడు..


- మహాత్మా గాంధీ



దేశాభివృద్ధిపై మీకంటూ ఓ వ్యూహం ఉందా! అయితే దాన్ని నెరవేర్చుకోవడం ఓటుతోనే సాధ్యం!!

మరో ఎన్నికల 'జుమ్లా'

'ఉచిత విద్య, వైద్యం' మరింత హాస్యాస్పదం



భవిష్యత్ ముందే తెలిస్తే ఉండే సుఖం వేరే ఉంటుంది. తన భవిష్యత్‌పై కేసీఆర్‌కు కొన్ని సందేహాలుండటంతో 2014లో అధికారంలోకి వస్తే దళితుడిని ముఖ్య మంత్రిని చేస్తానని, తర్వాత నాలుక్కర్చుకున్నారు. ఇప్పటికీ ప్రతిపక్షాలు దానిపై దెప్పిపొడుస్తూనే ఉన్నాయి. కమలనాథులకు అటువంటి ఇబ్బంది ఏమీ లేదని తేలడంతో మొన్న సూర్యాపేట సభలో అమిత్‌షా అధికారంలోకొస్తే బీసీ ముఖ్యమంత్రిని తెలంగాణలో ప్రతిష్టిస్తామని గాల్లోకి ఒక బాణం వేశారు.

రెండు అర్జెంటు ప్రయోజనాలు ఆయన ఆశించాడు. మొదటిది బీఆర్ఎస్ నుండి వలసొచ్చి వాలిన ఒక ప్రధాన 'పక్షి'ని ఆ ప్రకటన ద్వారా ఆ బీసీని నేనేనని భ్రమింపజేసి 'పక్కచూపులు' చూడకుండా ఉంచుకోవచ్చు. రెండవది ఇప్పటికే పదవి పోయి, నారాజుగా ఉన్న మరో 'పెద్ద' బీసీ నేతను అది తన కోసమేనని సంతృప్తి పరచవచ్చు. ప్రతివారి అకౌంట్‌లోకి 15 లక్షలు వేస్తామన్న ఎన్నికల 'జుమ్లా' లాగా ఇదీ ఒక ఎన్నికల జుమ్లా అని తెలిసిన పెద్దోలెవరూ పెద్దగా ఆందోళన పడరు. పడలేదు కూడా.

కాంట్రాక్టులు ఎరవేస్తే తోకాడించుకుంటూ వచ్చేవారు వివిధ పార్టీల్లో ఉంటారని బీజేపీకి నార్తిండియాలో మస్తు అనుభవం. బెల్లం చుట్టూ ఈగలు ముసిరినట్టు అధికారం, దాన్ని పయోగించుకుని కాంట్రాక్టులు, కోట్లు వెనకేసు కోవడం ఇదంతా ఆశలు నడిపే ప్రయాణం! అధికార 'బెల్లం' లేదనుకుంటే, రాదనుకుంటే ఆవేశంగా రివర్స్ జంపింగులుంటాయి. ఇదే నేడు తెలంగాణలో కనబడుతోంది. మనుషుల్ని దగ్గరుండి ఊచకోత కోయించిన ఆ రెండు గుండెలూ బండరాళ్లే! కాని వాళ్లూ మనుషులే. ఒక రాష్ట్రం అదనంగా తమ ఖాతాలో పడుతుందనుకుంటే పడకపోగా, ఉన్నది కూడా ఊసిపోతే వారికీ ఎక్కడో కలుక్కుమనదా?!

కిషన్‌రెడ్డి గారి వాగ్దానం 'ఉచిత విద్య, వైద్యం' మరింత హాస్యాస్పదంగా ఉంది. దేశంలోని బీజేపీ పాలిత ఇతర రాష్ట్రాల్లో పరిస్థితి ఏమిటో కనుక్కో లేనంత ఎర్రోల్లా తెలంగాణ ప్రజలు కిషన్ జీ! తాజాగా గెలిచిన శాసనమండలి సభ్యునితో సహా ఎందరో మహానుభావులను 'విద్యాదాన పరాయ ణులుగా మీ చంకలో కూసోపెట్టుకుని ఉచిత విద్య గురించి ఉపన్యాసాలు చెప్తే చెల్లుబాటు కాదు అమాత్యా!

బీజేపీలోకి కొత్తగా దారులు కట్టే అభ్యర్థులను వడబోయ డానికి వేసిన స్క్రీనింగ్ కమిటీ చైర్మెన్ రాజగోపాలరెడ్డి . ఆయన నిన్న కాంగ్రెస్ కండువా కప్పుకున్నాడు. మాజీ ఎంపీలెవరూ ఎమ్మెల్యేలుగా పోటీ చేయం అంటూన్నారట! ప్రస్తుతానికి వాళ్లు చెప్తున్న సాకేమిటంటే ఎంపీలుగానైతే మోడీ మ్యాజిక్‌తో గెలవచ్చని.

2024 నాటి పరిస్థితిని బట్టి ఎటో ఒక దగ్గరికి జంప్ చేయొచ్చనే ఆలోచ నున్నట్లుంది. గతంలో బంగారు లక్ష్మణ్‌లాంటి ఎస్సీ నేతలున్నా, ఇక్కడ బీసీ ముఖ్యమంత్రి వచ్చినా నిర్ణయాలు జరిగేది నాగపూర్‌లోనే! ఆరెస్సెస్‌పై ఆధార పడే బీజేపీ నడవాలి తప్ప ఎస్సీ, బీసీలతోని ఏమీకాదు. కులవ్యవస్థను పునఃస్థాపించడమే ఆర్ఎస్సెస్ లక్ష్యం. ఇది అర్థమైన వారందరూ చల్లగా జారుకుంటున్నారు.

- ఎలక్షన్ డెస్క్



మీడియాతో మాట్లాడుతున్న కాసాని

తెలంగాణ ఎన్నికల బరిలో ఉంటాం

టీటీడీపీ అధ్యక్షులు కాసాని

- ఒంటరిగానే పోటీ
- లోకేష్‌తో చర్చించాకే సంఖ్య తేలుస్తామని వ్యాఖ్య
- చంద్రబాబుకు పరామర్శ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి–హైదరాబాద్

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో టీటీడీపీ పోటీ చేస్తుందని ఆ పార్టీ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ప్రకటించారు. బీజేపీతో పొత్తు నాదృష్టిలో లేదనీ, ఒంటరిగానే ఎన్నికలకు వెళతామని స్పష్టం చేశారు.పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్‌తో చర్చించాకే ఎన్నిస్థానాల్లో పోటీచేయాలనేది నిర్ణయిస్తామని వివరించారు.

శనివారం చంద్రబాబును పరామర్శించేందుకుగాను రాజమండ్రి సెంట్రల్ జైలుకు వెళ్లారు. ములాఖాత్‌లో భాగంగా ఆయన బాబును కలిశారు. తెలంగాణ రాజకీయాలు, ప్రస్తుత పరిస్థితులు, పొత్తులు, ఇతర అంశాలపై బాబుతో చర్చించారు. పోటీ చేసేందుకు చంద్రబాబు సైతం అంగీకరించినట్టు కాసాని చెప్పారు. ఎన్ని స్థానాల్లో పోటీ చేయాలి ? ఎక్కడెక్కడ చేయాలి ? తదితర అంశాలకు సంబంధించి లోకేశ్‌తో మాట్లాడి నిర్ణయం తీసుకోవాలని చంద్రబాబు, కాసానికి సూచించారు. ఈనేపథ్యంలో ములాఖాత్ అనంతరం కాసాని జ్ఞానేశ్వర్ మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలోని అన్నీ స్థానాల్లో పోటీచేయాలని భావిస్తున్నామన్నారు.

తెలంగాణలో టీడీపీ బలంగానే ఉందన్నారు. నాకు ఏ పార్టీ నుంచి పిలుపు రాలేదు, నేను ఏ ఏపార్టీతోనూ చర్చించలేదని చెప్పారు. అవన్నీ మీడియా సృష్టి మాత్రమేనని అన్నారు. నాదృష్టిలో టీడీపీనే బెస్ట్ పార్టీ అనీ, చంద్రబాబే బెస్ట్ లీడర్ అని వ్యాఖ్యానించారు. ఆదివారం లోకేశ్‌తో పూర్తిస్థాయిలో చర్చించిన తర్వాత పోటీ చేసే స్థానాలు, సంఖ్య ఖరారవుతుందని తెలియజేశారు.

పంచ్ తంత్రం!

దేశాన స్వాతంత్ర్యవేషానికప్పుడే
మూడుపాతికలేండ్లు మూడిపాయె
ప్రజలపాలనపేర పరిహాసమప్పుడే
ఏడు పదులయేండ్లు ఎల్లిపాయె
సకలజనులకంత సమమన్న ఓటింగు
అడుగువర్గము సేమమరాయదాయె
అయిదేండ్లకొకసారి అరుగుదెంచెడినేత
తనలాభమేతప్ప తలచదాయె

వారిమోసపు మాటల మర్మమెరిగి
గుర్తులేకుండ ఓటెట్ల గుద్దుతావు
ఓరి వెంకన్న! దోస్తుగా ఒర్లుబోతు!
ఒక్కమాటన్న వినవార తిక్కలోడ

- ఏనుగు నర్సింహా రెడ్డి

పేదల పక్షపాతి మల్లూర్

ఆస్తులు.. సంపాదన కన్నా ప్రజాభిమానమే గొప్పదని.. కడవరకు దాని కోసమే.. ప్రజల కోసమే జీవించిన గొప్ప ప్రజానాయకుడు ఉప్పల మల్సూర్. నాలుగు సార్లు సూర్యాపేట ఎమ్మెల్యేగా ఉన్నా ప్రజల సేవకే జీవితాన్ని అంకితం చేశారు. ఆస్తులకంటే ప్రజాభిమానమే మిన్నగా భావించారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించారు. తుది శ్వాస వరకు గుడిసెలోనే కాలం వెళ్లదీశారు.

నాలుగు సార్లు ఎమ్మెల్యే అయినా గుడిసెలోనే.. ప్రజాభిమానమే మిన్నగా భావించిన మహోన్నతుడు





సూర్యాపేట జిల్లా మోతే మండలం సిరికొండ గ్రామంలో మల్లయ్య– లచ్చమ్మ దంపతులకు 1928 సెప్టెంబర్ 8న ఉప్పల మల్సూర్ జన్మించారు. నాలుగో తరగతి వరకు చదివారు. చిన్నతనం నుంచే కమ్యూనిస్టు భావాలకు ఆకర్శితులయ్యారు. ఆయన ఆలోచనలు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం వైపు మళ్లాయి. సాయుధ పోరాటంలో అత్యంత ధైర్యసాహసాలతో పోరాడారు. 1948లో సూర్యాపేట దగ్గర చందుపట్ల గ్రామంలో పోలీసులకు చిక్కారు. చిత్రహింసలకు గురయ్యారు. రాజమండ్రి సబ్ జైలు నుంచి 1951లో విడుదలయ్యారు. 1952 నుంచి 1972 వరకు నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1952లో పీడీఎఫ్ తరపున, 1957లో ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ పక్షాన, 1967, 72లో సీపీఐ(ఎం) తరపున శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు. 1990లో సిరికొండ సర్పంచ్‌గా పని చేశారు. నాడు నామినేషన్ వేయడానికి కూడా డబ్బులు లేక పోవడంతో ప్రజలే ఎన్నికల ఖర్చులు సమకూర్చి ఘన విజయానికి బాటలు వేశారు. అభాగ్యుల పక్షాన నిలబడిన మహోన్నత వ్యక్తి మల్సూర్. ఎమ్మెల్యేగా ఉన్నా సైకిలే ఆయన వాహనం. చివరి దశలో చెప్పులు కుట్టుకుంటూ బతుకెళ్లదీశారు. 1999 జనవరి 13న ఆ పూరి గుడిసెలోనే తుది శ్వాస విడిచారు. ఆయన భార్య లచ్చమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. నాలుగు సార్లు ఎమ్మెల్యే, ఒకసారి సర్పంచ్‌గా పనిచేసినా మల్సూర్ నిరాడంబర జీవితం నేటి తరానికి ఆదర్శంగా నిలిచింది. ఆయన జీవించి ఉండగా తన 500 గజాల స్థలాన్ని పాఠశాలకు ఇస్తామన్నారు. ఆయన మాట ప్రకారం కుమారుడు దాన్ని నెరవేర్చారు.


చరిత్రకెక్కిన కల్వకుర్తి

1989లో సీఎం ఎన్టీఆర్‌పై కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు

తర్వాతి ఎన్నికల్లో కాంగ్రెస్‌కు డిపాజిట్ గల్లంతు



ఎన్టీ రామారావు



చిత్తరంజన్ దాస్

నవతెలంగాణ -కల్వకుర్తి


ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1989 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు దేశంలోనే చరిత్ర సృష్టించాయి. నేషనల్ ఫ్రంట్ చైర్మెన్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఆయనపై కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యే చిత్తరంజన్ దాస్ పోటీ చేసి 3568 కోట్ల మెజార్టీతో గెలుపొందారు. దీంతో అప్పట్లో కల్వకుర్తి నియోజకవర్గం పేరు దేశ స్థాయిలో మారుమొరోగింది. సాధారణ వ్యక్తి చేతిలో ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ఓడిపోవడంపై తీవ్ర చర్చ సాగింది. అప్పట్లో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీగా పుట్టపాగ రాధాకృష్ణ వ్యవహరించారు. స్థానిక పార్టీ నాయకులకు నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించకపోవడం వల్ల ముఖ్య నాయకులు రామారావు గెలుపు కోసం అంతగా ప్రయత్నించలేదన్న విమర్శలు అప్పట్లో ఉన్నాయి. ఎన్టీఆర్ ఓటమితోపాటు ఈ ప్రాంత అభివృద్ధికి నోచుకోలేదు. దాంతో 1989లో ఎన్టీ రామారావును ఓడించిన చిత్తరంజన్ దాస్ 1994 అసెంబ్లీ ఎన్నికలలో నాలుగో స్థానానికి పరిమితమై డిపాజిట్ సైతం దక్కించుకోలేదు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At Navatelangana Printers Private Limited, Laxmidas Bhavan, Phase-2, Plot No. 8&9, Surana X Road, Near Mint Compound, Ida, Charlapally, Medchal-Malkajgiri District-500051, Published At Navatelangana Printers Private Limited, Laxmidas Bhavan, Phase-2, Plot.8&9, Surana X Road, Near Mint Compound, Ida, Charlapally, Medchal-Malkajgiri District-500051, Telangana State, Editor : R.Sudha Bhaskar. TELTEL/2015/60815

బిజినెస్

ఇన్వెస్టర్లకు అదాని టోటల్ షేర్ దెబ్బ

- ఏడాదిలో 85 శాతం పతనం
- హిండెన్‌బర్గ్ దెబ్బకు కోలుకోని సూచీ



ముంబయి : బిలియనీర్ గౌతం అదానికి చెందిన అదాని టోటల్ గ్యాస్ షేర్ ఇన్వెస్టర్లకు భారీ నష్టాలను మూటగడుతోంది. ఏడాది కాలంలో దాదాపుగా 85 శాతం పతనమయ్యింది. అదాని ఆర్థిక మోసాలపై ప్రస్తుత ఏడాది జనవరిలో హిండెన్‌బర్గ్ విడుదల చేసిన రిపోర్ట్ దెబ్బకు ఆ సూచీ వరుసగా కుప్పకూలుతోంది. జనవరిలో దాదాపుగా రూ.4,000కు చేరవకు వెళ్లిన.. ఈ సూచీ అక్టోబర్ 27 నాడు 562.70 వద్ద ముగిసింది. అదాని కంపెనీల షేర్ల ధరలను ప్రమోటర్లు కృత్రిమంగా పెంచారని హిండెన్‌బర్గ్ ఆరోపించిన విషయం తెలిసిందే. కార్పొరేట్ మోసాలకు పాల్పడిన ఆ కంపెనీ ఆ స్టాక్స్ దాదాపు 85 శాతం పతనం కావొచ్చని హిండెన్‌బర్గ్ అప్పుడే హెచ్చరించింది. ఆ విధంగానే అదాని టోటల్ గ్యాస్ స్టాక్ పతనాన్ని చవి చూడటం విశేషం.

హిండెన్‌బర్గ్ దెబ్బకు అదానీ గ్రూప్ మార్కెట్ విలువ దాదాపు రూ.10 లక్షల కోట్లకుపైగా ఆవిరయ్యింది. ఆ తర్వాత అదాని కంపెనీల్లో మరో యుఎస్ ఫండ్ జిక్యుజి పార్టనర్స్ పెట్టుబడులతో కొంతమేరకు షేర్లు కోలుకున్నప్పటికీ.. తిరిగి మళ్లీ ఒత్తిడిలోనే కొనసాగుతున్నాయి. 2023 జనవరి 24న ఈ షేరు ధర రూ.3,892. దీంతో పోలిస్తే కేవలం తొమ్మిది నెలల్లో అదానీ టోటల్ ధర 85 శాతం పతనాన్ని చవి చూసింది. అదాని గ్రూపులో 10 లిస్టెడ్ కంపెనీలు ఉన్నాయి. అందులో అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ ట్రాన్స్‌మిషన్, అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ టోటల్ గ్యాస్, అదానీ విల్మార్, అదానీ పోర్ట్స్ అండ్ సెజ్, అదానీ పవర్, ఎసిసి, అంబూజా సిమెంట్స్, ఎన్‌డిటివి తదితర సంస్థలున్నాయి. ఎన్‌డిటివిని ఇటీవలే కొనుగోలు చేసింది. మిగిలిన తొమ్మిది గ్రూప్ కంపెనీల్లో అదానీ పోర్ట్స్ మినహా మిగిలిన షేర్లన్నీ జనవరిలోని ధరలతో పోలిస్తే ప్రస్తుతం 20 నుంచి 70 శాతం నష్టాల్లో ట్రేడింగ్ అవుతున్నాయి.

మిలిపోల్‌లో ఐకామ్ - కారకాల్ ఆయుధాల ప్రదర్శన



హైదరాబాద్: ఆయుధాలకు సంబంధించి ఢిల్లీలో నిర్వహించిన అంతర్జాతీయ ప్రదర్శన మిలి పోల్ ఇండియా 2023లో ఐకామ్ - కారకాల్ సంస్థలు తమ ఉత్పత్తులను ప్రదర్శించాయి. ఈ ఎక్సిబిషన్ ఈ నెల 26 నుంచి 28 వరకు ఢిల్లీలోని ప్రగతిమైదాన్‌లో జరిగిందని ఆ సంస్థ ఓ ప్రకటనలో పేర్కొన్నాయి. ఈ ఆయుధ నమూనాలు డిఫెన్స్ రంగంలోని సంస్థలు, అందులో నైపుణ్యం ఉన్న ప్రముఖులు, సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయని ఆ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. ఆత్మనిర్భార్ భారత్, మేక్ ఇన్ ఇండియా పథకాల్లో భాగంగా అత్యాధునికమైన సబ్ మెషిన్ గన్స్, పిస్టల్స్, రైఫిల్స్‌ను తయారు చేసేందుకు ఎడ్జ్ గ్రూప్ సంస్థ కారకాల్, ఎంఐఎల్ గ్రూప్ సంస్థ ఐకామ్ గతంలో ఒప్పందం కుదుర్చుకున్న విషయం తెలిసిందే. తమ ఉత్పత్తుల ప్రదర్శనకు మిలిపోల్ ఇండియా 2023 ఎంతో ఉపయోగపడిందని కారకాల్ సిఇఒ హమద్ అల్ అమేరి పేర్కొన్నారు.

త్వరలో దేశ వ్యాప్తంగా బిఎస్‌ఎన్‌ఎల్ 4జి సేవలు



న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ టెలికం కంపెనీ బిఎస్‌ఎన్‌ఎల్ వచ్చే డిసెంబర్ నుంచి 4జి సేవలను అందుబాటులోకి తేనుందని ఆ సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పికె పూర్వార్ తెలిపారు. న్యూఢిల్లీలో జరుగుతన్న ఇండియన్ మొబైల్ కాంగ్రెస్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 2014 జూన్ కల్లా దేశ వ్యాప్తంగా 4జి సేవలను అందించనున్నామని పేర్కొన్నారు. తొలుత పంజాబ్ నుంచి ఈ సేవలు ప్రారంభిస్తామన్నారు. ఇప్పటికే 200 ప్రదేశాల్లో విజయ వంతంగా పరీక్షలు నిర్వహించామన్నారు.దశల వారీగా ఇతర ప్రాంతాల్లో విస్తరిస్తామని చెప్పారు. 4జి నెట్‌వర్క్‌ను 5జికి అప్‌గ్రేడ్ చేసే బాధ్యతను దిగ్గజ ఐటి కంపెనీ టిసిఎస్, ప్రభుత్వ రంగ ఐటిఐకి అప్పగించామ న్నారు. 5జి సేవల కోసం స్పెక్ట్రం కూడా అందు బాటులో ఉందన్నారు.

మళ్లీ తగ్గిన విదేశీ మారకం నిల్వలు



ముంబయి: భారత విదేశీ మారకం నిల్వల్లో మళ్లీ తగ్గుదల చోటు చేసుకుంది. ఈ నెల 20తో ముగిసిన వారంలో 2.36 బిలియన్ డాలర్లు క్షీణించాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) వెల్లడించింది. దీంతో అక్టోబర్ 20 నాటికి దేశంలో గల ఫారెక్స్ నిల్వలు 583.53 బిలియన్ డాలర్లకు పరిమితమ య్యాయి. అంతకుముందు అక్టోబర్ 6 నుంచి 13 మధ్య 1.153 బిలియన్ డాలర్లు పెరిగాయి. వరుసగా నెల రోజులకుపైగా పడిపోయిన విదేశీ మారకపు నిల్వలు.. ఒక్క వారం పెరిగినట్టే పెరిగి తిరిగి పతనం కావడం గమనార్హం. దీంతో సెప్టెంబర్ 1 నుంచి ఈ నెల 20 వరకు 15 బిలియన్ డాలర్లకు పైగానే దేశీయ ఫారెక్స్ నిల్వలు పడిపోయినట్లయ్యింది.

లివ్‌లాంగ్ నుంచి ప్రీమియం ఎలక్ట్రిక్ సైకిళ్ల విడుదల



న్యూఢిల్లీ : లివ్‌లాంగ్ ఇ-మొబిలిటీ కొత్తగా రెండు ప్రీమియం ఎలక్ట్రిక్ స్కూటర్లను విడుదల చేసినట్లు వెల్లడించింది. యుపోరియా-ఎల్‌ఎక్స్, నెస్టోర్-ఎస్ఎక్స్ పేరుతో రెండు వేరియంట్లను ఆవిష్కరించినట్లు పేర్కొంది. ఒక్క ఛార్జింగ్‌తో యుపోరియా 40-50 కిలోమీటర్లు, నెస్టోర్ 30-40 కిలోమీటర్ల మేర ప్రయణించగలవని లివ్‌లాంగ్ ఇ-మొబిలిటీ ఎండి సురేష్ పాలపర్తి తెలిపారు. ఈ వినూత్న సైకిళ్లు సీనియర్ సిటిజన్లకు కూడా అను కూలంగా ఉంటాయన్నారు. కాగా.. వీటి ధరలను ఆ సంస్థ వెల్లడించలేదు.

రొమ్ము క్యాన్సర్‌పై ఎస్‌బిఐ లైఫ్ అవగాహన

హైదరాబాద్ : రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన క్యాంపెయిన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్‌బిఐ లైఫ్ పేర్కొంది. ఇందుకోసం 'థాంక్స్ ఎ డాట్' పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొంది. అక్టోబర్‌ను రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసంగా పాటిస్తారు. ఈ కార్యక్రమంలో భాగంగా రుతుక్రమ నొప్పి సమస్యకు పరిష్కారంగా మహిళలు ఎక్కువగా ఉపయోగించే 'హాట్ వాటర్ బ్యాగ్'ని ఉపయోగించడం ద్వారా స్వీయ రొమ్ము పరీక్షను ప్రోత్సహించడానికి అవగాహన పెంచే వర్క్‌షాప్‌లను చేపడుతున్నట్లు పేర్కొంది.

2న హాజరవ్వాల్సిందే

- మహువాకు స్పష్టం చేసిన ఎథిక్స్ కమిటీ

న్యూఢిల్లీ : పార్లమెంటులో డబ్బులు తీసుకుని ప్రశ్నలు అడిగారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న తృణమూల్ ఎంపి మహువా మొయిత్రా కోరుకున్నట్టుగా విచారణ తేదీని శనివారం ఎథిక్స్ కమిటీ మార్పు చేసింది. నవంబర్ 2వ తేదీన విచారణకు రావాల్సిందేనని కమిటీ పేర్కొంది. గతంలో అక్టోబర్ 31న విచారణకు హాజరుకావాలని ఎథిక్స్ కమిటీ ఆమెకు నోటీసులిచ్చింది. అయితే ఆ నోటీసులు తనకు అందేముందే మీడియాలో లీక్ అయిందని.. టీవీల్లో ప్రసారం చేశారని ఆమె ఆరోపిస్తూ ఎథిక్స్ కమిటీకి లేఖ రాసింది. 30 నుంచి నవంబర్ 4 వరకు తన నియోజకవర్గంలో ముందుగా షెడ్యూల్ చేసిన కార్యక్రమాల వల్ల తాను విచారణకు రాలేనని ఆమె తన లేఖలో పేర్కొన్నారు.

నాలుగేండ్లలో రూ.1.2 లక్షల కోట్ల ఎగవేత

- సగటున రోజుకు రూ.100 కోట్లకు పైబడే
- ట్రాన్స్‌యూనియన్ సిబిల్ వెల్లడి



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో ఉద్దేశపూర్వక ఎగవేతల సొమ్ము అంతకంతకూ పెరిగిపోయింది. ప్రజలు దాచుకున్న సొమ్మును బ్యాంకుల నుంచి రుణాల రూపంలో కాజేసిన బడా పెట్టుబడిదారులు, కంపెనీలు ఉద్దేశపూర్వకంగా చెల్లించని సొమ్ము 2019 మార్చి నుంచి రూ.1.2 లక్షల కోట్లు ఉన్నట్లు వెల్లడైంది. యుపిఎ ప్రభుత్వం 'స్కామ్‌ల'తో బ్యాంకింగ్ రంగాన్ని నాశనం చేసిందని, తమ ప్రభుత్వం 'మంచి ఆర్థిక ఆరోగ్యాన్ని' పునరుద్ధరించిందని ప్రధాని నరేంద్ర మోడీ జులై 22న ప్రకటన చేశారు. ఆయన ప్రకటనకు భిన్నంగా... ఎగవేతదారులు చెల్లించాల్సిన బకాయిల మొత్తం సగటున రోజుకు రూ.100 కోట్లకు పైగా పెరిగింది. వరుసగా నాలుగు త్రైమాసికాల్లో మొత్తం రూ.3 ట్రిలియన్ మార్క్ కంటే ఎక్కువగానే ఉందని ట్రాన్స్‌యూనియన్ సిబిల్ డేటా తెలిపింది. ప్రభుత్వ బ్యాంకులతో పోలిస్తే ప్రైవేటు బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు ఇచ్చే అటువంటి రుణాల పెరుగుదల చాలా తక్కువగా ఉంది. ఈ ఏడాది జూన్‌లో ఉద్దేశపూర్వక ఎగవేతదారులకు చెల్లించాల్సి న డబ్బులో వాటా 77.5 శాతంగా ఉంది. ఉద్దేశపూర్వక ఎగవేతదారులు ప్రైవేట్ బ్యాంకులకు రూ.53,500 కోట్లు బకాయిపడ్డారు. 10 జాతీయ బ్యాంకులకు జూన్ నాటికి రూ.1.5 లక్షల కోట్ల బకాయిలు ఉండగా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వాటా రూ.80 వేల కోట్లు ఉంది. ఉద్దేశపూర్వక ఎగవేతదారుల జాబితాలో మహారాష్ట్ర అగ్రస్థానంలో ఉంది. తరువాత స్థానాల్లో ఢిల్లీ, పశ్చిమబెంగాల్, గుజరాత్, తమిళనాడు ఉన్నాయి. చెల్లించాల్సిన మొత్తంలో (గత ఆర్థిక సంవత్సరం చివరి వరకు) 70 శాతం కంటే ఎక్కువ ఈ రాష్ట్రాల నుంచే ఉన్నాయి. ఈ సమయంలో బకాయి ఉన్న మొత్తం రూ.0.6 ట్రిలియన్ నుండి రూ.1.3 ట్రిలియన్లకు పెరిగింది. ఆర్‌బిఐ ఇటీవలే ఉద్దేశపూర్వక ఎగవేతదారులను రుణం నిరర్థక ఆస్తి (ఎన్‌పిఎ)గా మారిన ఆరు నెలల్లోగా ప్రకటించాలని ప్రతిపాదించింది. అక్టోబరు నెలాఖరులోగా ఈ ప్రతిపాదనపై ప్రజల అభిప్రాయాలు తెలియజేయాలని కేంద్రం కోరింది. ఆర్‌టిఐ ప్రత్యుత్తరాలు, పార్లమెంటు ప్రశ్నలు, బ్యాంకు డేటా పెద్ద రుణగ్రహీతలు చెల్లించాల్సిన భారీ మొత్తంలో ప్రజాధనాన్ని వెల్లడించాయి. ది ఎకనామిస్ట్ 'క్రోనీ క్యాపిటలిజం' ఇండెక్స్‌లో ఇండియా 10వ స్థానంలో ఉంది. 2013 నుండి 'క్రోనీ-క్యాపిటలిస్ట్ సెక్టార్ల' నుండి సంపద ఇండెక్స్ ప్రకారం దాని జిడిపిలో 5 శాతం నుండి 8 శాతానికి పెరిగింది. పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో ఆర్థికశాఖ సహాయ మంత్రి భగవత్ కరాద్ రాజ్యసభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు గత ఐదు ఆర్థిక సంవత్సరాల్లో (ఆర్‌బిఐ) మొత్తం రూ.10,57,326 కోట్లు మాఫీ చేశాయని వెల్లడించా రు. కరాద్ ప్రకారం, టాప్ 10 ఉద్దేశపూర్వక ఎగవేతదారులు షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులకు రూ.40,825 కోట్లు బకాయిపడ్డారు. మొదటి 50 మంది రుణ ఎగవేతదారులు బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు రూ.87,295 కోట్లు బకాయిపడినట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ తెలిపింది. పరారీలో ఉన్న మెహుల్ చోక్సీకి చెందిన గీతాంజలి జెమ్స్ రూ.8,738 కోట్లతో అతిపెద్ద ఉద్దేశపూర్వక ఎగవేతదారుగా, ఎరా ఇన్‌ఫ్రా ఇంజినీరింగ్ లిమిటెడ్ రూ.5,750 కోట్లు, ఆర్ఇఐ ఆగ్రో లిమిటెడ్ రూ.5,148 కోట్లు, ఎబిజి షిప్‌యార్డ్ లిమిటెడ్ రూ.4,774 కోట్లు, పవర్ స్టెల్ వద్ద రూ.3,911 కోట్లు రుణ ఎగవేతదారులుగా ఉన్నారు.

లోకాయుక్తకు ఆ అధికారాల్లేవు

- హైకోర్టు స్పష్టీకరణ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



రెవెన్యూ అధికారులు ఒకరికి బదులు మరొకరికి చెల్లించిన పరిహారాన్ని రికవరీ చేయాలని ఆ శాఖకు ఆదేశాలు జారీ చేసే పరిధి లోకాయుక్తకు లేదని హైకోర్టు స్పష్టం చేసింది. లోకాయుక్త చట్టంలోని 7, 9 నిబంధనల ప్రకారం ఆ అధికారం లోకాయుక్తకు లేదని తేల్చింది. తోటపల్లి రిజర్వాయర్ భూసేకరణలో చెల్లించిన పరిహారాన్ని లోకాయుక్త ఉత్తర్వుల మేరకు డిపాజిట్ చేయాలని హుస్నాబాద్ ఆర్డీవో ఇచ్చిన నోటీసును ఎస్.కనకయ్య హైకోర్టులో సవాల్ చేశారు. దీనిపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లోక్ అరాథే, జస్టిస్ ఎస్వీ శ్రవణ్‌కుమార్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఇటీవల విచారణ జరిపింది. పిటిషనర్ తరపు న్యాయవాది వాదిస్తూ... రికవరీ ఆదేశాలు జారీ చేసే అధికారం లోకాయుక్తకు లేదన్నారు. లోకాయుక్త ఆదేశాల్ని రద్దు చేయాలని కోరారు. ప్రతివాది గుడారం బాలవ్వ తరపు న్యాయవాది పొన్నం అశోక్ గౌడ్ వాదనలు వినిపిస్తూ, పరిహారం కోసం లోకాయుక్తను ఆశ్రయిస్తే ఉత్తర్వులు వెలువరించిందని చెప్పారు. వాదనల తర్వాత హైకోర్టు, లోకాయుక్త చట్టం ప్రకారం ఇలాంటి ఆదేశాలిచ్చే పరిధి లోకాయుక్తకు లేదని స్పష్టం చేసింది. పరిహారం కోసం చట్టపరమైన విధానం ఉందని, ఆ మేరకు బాధితుడు చేసుకోవచ్చునని చెప్పింది. పిటిషన్‌పై విచారణ ముగిసినట్టు ప్రకటించింది.

క్షమాభిక్షపై తగిన నిర్ణయం తీసుకోండి-హైకోర్టు

క్రిమినల్ కేసులో ముద్దాయిగా రుజువై, 27 ఏండ్లుగా యావజ్జీవశిక్ష అనుభవిస్తున్న ఇద్దరు ఖైదీలకు క్షమాభిక్ష విధించే అంశంపై నాలుగు వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. ఒక కేసులో ముద్దాయిలుగా ఉన్న ముగ్గురికి క్షమాభిక్ష ప్రసాదించారని, తన తండ్రి మహ్మద్ ఇర్ఫాన్ అలీకి క్షమాభిక్ష ప్రసాదించలేదని అతని కుమారుడు మహ్మద్ అస్రఫ్ అలీ, ఇదే కేసులో మరో ఖైదీ ఆరిఫ్ ఖాన్ వేర్వేరుగా హైకోర్టును ఆశ్రయించారు.

వీటిని జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ఇటీవల విచారణ జరిపారు. కింది కోర్టు 1997లో తీర్పు చెప్పింది. దీనిపై అప్పీల్‌ను హైకోర్టు కొట్టేసింది. ముగ్గురికి ప్రభుత్వం క్షమాభిక్ష ప్రసాదిస్తూ గత ఆగస్ట్ 19న జీవో 51 జారీ చేసింది. ముగ్గురికి క్షమాభిక్ష ప్రసాదించి ఇద్దరికి ఇవ్వకపోవడం వివక్ష కిందకే వస్తుందని హైకోర్టు వ్యాఖ్యానించింది. పిటిషనర్ల విషయంపై తగిన నిర్ణయం తీసుకుని నవంబర్ 21న జరిగే విచారణ నాడు చెప్పాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

మాజీ సైనికుల కనీస మార్కులపై నిర్ణయం తీసుకోండి

రాష్ట్రంలో గ్రూప్-4 పోస్టుల్లో మాజీ సైనికులకు కనీస అర్హత మార్కులపై సత్వరం నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ)ని హైకోర్టు ఆదేశించింది. ఈమేరకు జస్టిస్ మాధవీదేవి ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. కౌంటర్ దాఖలు చేయాలని టీఎస్‌పీఎస్సీ తోపాటు హోంశాఖ ముఖ్య కార్యదర్శికి నోటీసులు జారీ చేసింది. డైరెక్టర్ ఆఫ్ సైనిక్ వెల్ఫేర్ సిఫారసులకు పరిగణనలోకి తీసుకుని మాజీ సైనికుల కనీస అర్హత మార్కులపై 30రోజుల్లోగా ఒక నిర్ణయానికి రావాలనీ, అప్పటి వరకు మాజీ సైనికులకు కేటాయించిన పోస్టులను భర్తీ చేయరాదని చెప్పింది. కనీస మార్కుల అంశంపై నిర్ణయం తీసుకోవడం లేదని పేర్కొంటూ బీ భాస్కర్ మరో 9 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 30 రోజుల్లోగా నిర్ణయం తీసుకోవాలని ఆదేశించిన హైకోర్టు విచారణను వాయిదా వేసింది.

పిల్ డిస్మిస్

రాష్ట్రంలోని దేవాదాయ శాఖ నిర్వహణలోని ఆలయాల్లో అన్యమతస్తులు ఉన్నారనే పిల్‌ను హైకోర్టు కొట్టేసింది. అన్యమతస్తులకు చోటు లేదని, కమిటీల్లో కూడా ఆవిధంగా అస్కారం కల్పించడం లేదని ప్రభుత్వం వేసిన అఫిడవిట్‌ను ఆమోదించింది. అన్యమతస్తులు లేకుండా తీర్పు చెప్పాలని కోరుతూ దాఖలైన పిల్‌ను డిస్మిస్ చేస్తూ చీఫ్ జస్టిస్ అలోక్ అరధే ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ తీర్పు చెప్పింది.

జీఎస్టీ కరెక్టే - హైకోర్టు

కాలేజీలు, విద్యా సంస్థల నుంచి యూనివర్సిటీ, ఆయా కాలేజీల బోర్డులు నిర్వహించే గుర్తింపు, తనిఖీల ఫీజులపై జీఎస్టీ విధించడాన్ని హైకోర్టు సమర్థించింది. కాళోజీ మెడికల్ వర్సిటీ ఇచ్చిన నోటీసులను పలు నర్సింగ్ కాలేజీలు వేర్వేరుగా వేసిన రిట్లను హైకోర్టు డివిజన్ బెంచ్ డిస్మిస్ చేస్తూ తీర్పు చెప్పింది. గుర్తింపు, తనిఖీలు విద్యా సేవల కిందకు రాదని చెప్పింది.

మైక్రోసైట్‌లతో కేరళ పర్యాటకాన్ని అభివృద్ధిపరిచేందుకు చర్యలు



తిరువనంతపురం : కేరళ రాష్ట్రంలోని సుసంపన్నమైన, వైవిధ్యమైన వారసత్వాన్ని పెంపొందించేందుకు, ముఖ్యమైన ఆరాధనా స్థలాలను ప్రముఖంగా ప్రచారం చేస్తూ, మైక్రోసైట్‌లను తీసుకురానున్నట్లు కేరళ పర్యాటకా విభాగం ప్రకటించింది. ఇందులో భాగంగా శబరిమలపై వివిధ భాషల్లో విస్తృత సమాచారాన్ని అందచేస్తున్న మైక్రోసైట్‌ను త్వరలో ఆవిష్కరించనున్నారు. పతనంతిట్ట జిల్లాలోని శబరిమలపై పునరుద్దరించిన మైక్రోసైట్‌లో ఐదు భాషలు ఇంగ్లీషు, హిందీ, తమిళం, కన్నడ, తెలుగుల్లో సమగ్ర సమాచారం వుంటుంది. రూ.61.36లక్షల వ్యయంతో చేపట్టు ఈ ప్రాజెక్టులో ఇ బ్రోచర్లు వుంటాయి. ఇదికాకుండా, ఆ సైట్‌లో ఒక చిత్రం కూడా వుంటుంది. అయ్యప్ప దేవాలయాన్నిఏటా లక్షలాదిమంది భక్తులు సందర్శించుకుంటున్నందున ఇక్కడకు జరిపే పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా వుండేలా చూసేందుకు ఈ ప్రాజెక్టు ఉద్దేశించబడింది. అన్నిహంగులతో పునరుద్దరించబడుతున్న ఈ సైట్‌లో శబరిమలను సందర్శించుకున్న అనంతరం ఆ దారిలో సందర్శించుకునే ఇతర ఆలయాలు, వాటికి సంబంధించిన సమాచారాన్ని అందచేస్తారు. ఇందుకు సంబంధించి యూట్యూబ్ వీడియోలు కూడా విడుదల చేస్తామని అధికారులు తెలిపారు.

ప్రధాన యాత్రా స్థలంగా కేరళకు గల పేరు ప్రతిష్టలను పెంపొందించడం ఈ ప్రయత్నాల లక్ష్యంగా వుందని చెప్పారు. కేవలం ఆయా రూట్‌ల గురించే కాకుండా రవాణా సదుపాయాలు, లాడ్జింగ్ వసతులు వంటి సమాచారాన్ని కూడా అందచేస్తారు.

కోర్టుకు రండి

- యూపీ గవర్నర్‌కు న్యాయస్థానం ఆదేశం : ఆగ్రహించిన ఆనందీబెన్ పటేల్




లక్నో : ఉత్తరప్రదేశ్‌లో విచిత్రమైన, అరుదైన ఘటన జరిగింది. ఓ కుటుంబ భూ వివాదానికి సంబంధించి స్థానికుడొకరు చేసిన ఫిర్యాదు ఆధారంగా రాష్ట్ర గవర్నర్ ఆనందీబెన్ పటేల్‌కు బదౌన్ జిల్లా సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ (ఎస్‌డీఎం) వినీత్ కుమార్ సమన్లు జారీ చేశారు. దీనిపై గవర్నర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కేసులో వాదనలు విన్పించేందుకు, సాక్షులను ధృవీకరించేందుకు కోర్టుకు రావాలని ఈ నెల 10న జారీ చేసిన ఆదేశాలలో ఎస్‌డీఎం పేర్కొన్నారు. 'ఒకవేళ మీరు అక్టోబర్ 18వ తేదీన కోర్టుకు హాజరుకాని పక్షంలో ఈ కేసులో నిర్ణయం ఏకపక్షంగా ఉంటుందని మీకు తెలియజేస్తున్నాము' అని ఆ ఆదేశాలలో వివరిం చారు. కాగా కోర్టు సమన్లు అత్యంత అభ్యంతరకర మైనవని ఉత్తరప్రదేశ్ గవర్నర్ కార్యాలయం తెలిపింది. ఈ కేసులో చట్టపరమైన చర్యలు ప్రారంభించాలని బదౌన్ జిల్లా మెజిస్ట్రేట్‌కు సూచిం చింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కూడా పేర్కొంది. ఈ మేరకు జిల్లా మెజిస్ట్రేట్‌కు యూపీ గవర్నర్ ప్రత్యేక కార్యదర్శి ఓ లేఖ రాశారు.

'ఈ ఘటన రాజ్యాంగంలోని ఆర్టికల్ 361ని ఉల్లంఘిస్తోంది. రాష్ట్రపతి, గవర్నర్ లేదా రాజ్ ప్రముఖ్ పదవిలో ఉన్నప్పుడు వారికి వ్యతిరేకంగా ఎలాంటి క్రిమినల్ చర్యలు చేపట్టకూడదని ఆ అధికరణ స్పష్టం చేస్తోంది' అని ఆ లేఖలో వివరించారు. కాగా ఫిర్యాదుదారుడైన చంద్రహాస్ కోర్టులో దాఖలు చేసిన పిటిషన్ ప్రకారం... చంద్రహాస్ కుటుంబానికి చెందిన భూమిని బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం తీసుకుంది. ఆ భూమికి ఆయనే హక్కుదారుడైనప్పటికీ ఆయన సోదరుడు దానిని మూడో వ్యక్తికి అమ్మేశాడు. ఆ మూడో వ్యక్తికే ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించింది. దీంతో చంద్రహాస్ రాష్ట్ర గవర్నర్‌ను, స్థానిక అధికారులను ప్రతివాదులుగా చేర్చి కోర్టులో కేసు వేశారు. దీనిపై గవర్నర్‌కు ఎస్‌డీఎం సమన్లు జారీ చేశారు.

ఐటీ చట్టం కింద అది నేరం కాదు

- సోషల్ మీడియా పోస్ట్‌ను లైక్ చేయడంపై బాంబే హైకోర్టు



ముంబయి : సోషల్ మీడియా పోస్టులను లైక్ చేసే విషయంపై బాంబే హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసిం ది. సమాచార సాంకేతిక చట్టం లోని సెక్షన్ 67 ప్రకారం సోషల్ మీడియా లో పోస్ట్‌ను లైక్ చేయడం నేరం కాదని బాంబే హైకోర్టు తెలి పింది. అయితే, అటువంటి పోస్ట్‌లను షేర్ చేయడం లేదా రీట్వీట్ చేయడం నిబంధన ప్రకారం "వ్యాప్తిచేయటం (ట్రాన్స్‌మిషన్)" అని స్పష్టం చేసింది. చట్టంలోని సెక్షన్ 67 ఎలక్ట్రానిక్ రూపంలో అశ్లీల విషయాలను ప్రచు రించడం లేదా ప్రసారం చేసే శిక్షను వివరిస్తుంది. 500 మందికి పైగా ముస్లింలు పర్మిట్ లేకుండా ఊరేగిం పు కోసం సమావేశమయ్యేలా సోషల్ మీడియా పోస్ట్‌లు చేసినందుకు తన పై వచ్చిన ఆరోపణలను కొట్టివేయా లని కోరుతూ మొహమ్మద్ ఇమ్రాన్ కాజీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు పైవిధంగా ఉత్తర్వులు జారీ చేసింది.

కామారెడ్డి మాస్టర్ ప్లాన్ ప్రతిపాదన రద్దు

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



కామారెడ్డి మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేస్తున్నట్టు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ తెలిపారు. శనివారం కామారెడ్డి రైతు జేఏసీ ప్రతినిధులు కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేస్తున్నట్టు గతంలోనే మున్సిపల్ శాఖ తెలిపిన విషయాన్ని గుర్తుచేశారు.డీటీసీపీ అధికారులతో మాట్లాడిన కేటీఆర్... ప్రస్తుతం అమలులో ఉన్న పాత మాస్టర్ ప్లాన్ ప్రకారమే నడుచుకోవాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా తాము అండగా ఉంటామని భరోసానిచ్చారు. రైతు జేఏసీ నిరసన కార్యక్రమాల సందర్భంగా నమోదైన కేసులను కూడా సానుకూలంగా పరిశీలించి ఎత్తేసే చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఇదే అంశంపై రాష్ట్ర డీజీపీతోనూ మాట్లాడారు. కేటీఆర్ రైతు జేఏసీ ధన్యవాదాలు తెలిపింది.

గుజరాత్‌లో ఘోరం

- ఒకే ఇంట్లో ఏడుగురు ఆత్మహత్య
- ఆర్థిక సమస్యలే కారణమని అనుమానం

అహ్మదాబాద్ : బిజెపి పాలిత గుజరాత్‌లోని సూరత్‌లో ఘోరం చోటుచేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు ఆత్మహత్య చేసుకున్నారు. వీరిలో ముగ్గురు పిల్లలు కూడా ఉన్నారు. ఆర్థిక సమస్యల వల్ల ఈ కఠిన నిర్ణయం తీసుకుని ఉంటారని పోలీసులు అనుమానిస్తు న్నారు. ఆ ఇంట్లో సూసైడ్ నోట్ లభించినట్లు వారు తెలిపారు. సూరత్‌లోని అడాజన్ ప్రాంతంలోని అపార్ట్‌మెంట్ ఫ్లాట్ నుంచి శనివారం ఉదయం దుర్వాసన రావడాన్ని స్థానికులు గమనించి డోర్ తట్టి, బెల్ మోగించినప్పటికీ ఎవరూ స్పందించకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు.

వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు ఇంటి తలుపును పగులగొట్టి లోనికి వెళ్లి చూశారు. అందులో నివసిస్తున్న కుటుంబం సామూహిక ఆత్మ హత్యకు పాల్పడినట్టు గ్రహించారు. మృతులను మనీష్ సోలంకి (35), ఆయన భార్య రీటా(32), పిల్లలు దిశ (7), కావ్య (5), ఖుషాల్ (3), మనీష్ తల్లిదండ్రులు కాంతిలాల్ సోలంకి (65), శోభన (60)గా గుర్తించారు. కుటుంబంలోని ఆరుగురు వ్యక్తులు విషం తాగి చనిపోగా, మనీష్ ఉరి వేసు కున్నారని పోలీసులు తెలిపారు. ఆర్థిక సమస్యల వల్ల ఆత్మహత్య చేసుకున్న ట్లుగా రాసి ఉన్న నోట్, విషం బాటిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. మనీష్ ఫర్నీచర్ వ్యాపారం చేస్తూ కాంట్రాక్టరుగా పనిచేస్తున్నారు. ఆయనకు ఇదే అపార్ట్‌మెంట్ బిల్డింగ్‌లో నాలుగు ఫ్లాట్లు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. చాలా కాలంగా కుటుంబంతో కలిసి ఉంటున్న అతడు చాలా మందికి డబ్బు లు అప్పుగా ఇచ్చినట్టు చెప్పారు. దీపావళి పండగ సమీపిస్తున్నందున డబ్బు లు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశాడని, వారు ఇవ్వకపోవడంతో తన కుటుం బ సభ్యులకు విషం ఇచ్చిన తర్వాత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు వివరించారు. అయితే ఆ కుటుంబ సామూహిక ఆత్మహత్యకు కారణం ఏమిటన్నదానిపై వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.